ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 02.10.2026 | సంపుటి : 13 సంచిక : 73 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# ఈ సారి చలీ తక్కువే..

- ఎల్‌నినో ప్రభావంతో మారనున్న పరిస్థితులు
- వాతావరణశాఖ వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): శీతాకాలం ఔట్ లుక్‌ను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. వర్షాకాలం ముగిసి నేటి నుంచి శీతాకాలం ప్రారంభమైనట్లు తెలిపింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని పేర్కొంది. అక్టోబంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే వీలుందని తెలిపింది. తెలంగాణలో

మిగతా 2లో..

# సర్కారీ ఉద్యోగులకు ఖుష్ ఖబర్

## పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలకు కేబినెట్ ఆమోదం

- కరవు పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలి
- ఎల్‌నినో పరిస్థితులపై సమావేశంలో సుదీర్ఘ చర్చ
- త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు నిర్ణయం



- విద్యుత్ డిమండ్ భారీగా ఉన్నా అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ఆదేశం
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 నుంచి బకాయి ఉన్న డీఏలలో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి బకాయి పడ్డ ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. దీంతో ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2500 కోట్ల భారం పడనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత తెలంగాణ సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నా రు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ వానాకా లంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉంది. నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. కరవు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో ఉన్న ఎల్?నినో పరిస్థితులు చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరిస్తారు. కరవు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. త్వరలోనే మంత్రుల బృందం దిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదించనున్నారు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. త్వరలోనే ధాన్యం

మిగతా 2లో..



# 'సర్' గడువు మళ్లీ పొడిగింపు కుదరదు

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి
## రాష్ట్రంలో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
## 65 లక్షల మంది సమాధానం ఇచ్చారని వెల్లడి





హైదరాబాద్(జనంసాక్షి):సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా రాష్ట్రంలో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. హైదరాబాద్ జగ్జీవన్?రామ్ భవన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్‌కు సంబంధించిన అంశాలను సుదర్శన్? రెడ్డి వివరించారు. ఎన్నికల కమిషన్ సర్‌లో కొన్ని మార్పులు చేసిందన్నారు. సర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో ఫామ్-6తో పాటు డిక్లరేషన్ తీసుకోవాలని ఈసీ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సర్ నోటీసులు అందిన వారి వద్దకే బీఎల్వోలు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటారని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందిన

మిగతా 2లో..

## ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా
# ఈసీని ఆదేశించండి

హైకోర్టులో పిటిషన్ • విచారణ వాయిదా వేసిన ధర్మాసనం



హైదరాబాద్(జనంసాక్షి): ఖైరతాబాద్ ఉప ఎన్నిక అంశంలో మాజీ మంత్రి పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు లో విచారణ జరిగింది. అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ విజయారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్

మిగతా 2లో..

## ఆర్మీ ఆయుధాల చోరీ కేసు..

మల్లేశ్ నుంచి కీలక సమాచారం రాబట్టిన పోలీసులు

2లో..

## తృణముల్ బ్యాంకు ఖాతాలు సీజ్

టీఎంసీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు..

2లో..

## హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం







# ఆస్తులపై విచారణకు సిద్ధం

## మీరు సిద్ధమా..! సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- మాపై కేసుల మీద కేసులు వేసి చివరకు తేల్చిందేమిటి?
- దశాబ్దాల పాటు కాంగ్రెస్ రైతులను ఇబ్బంది పెట్టింది
- రాష్ట్రంలో అన్ని వర్గాలను సీఎం రేవంత్ మోసం చేశారు
- ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త అంశాలను తెరపైకి తెస్తోందని మండిపాటు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం నాడు తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలు గోస పడుతున్నారని తెలిపారు. ఆరు గంటలు

మిగతా 2లో..

# సిద్ధమైన ఎర్రవల్లి భూసర్వే నివేదిక..

హైదరాబాద్(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి భూసర్వే నివేదిక దాదాపు సిద్ధమైంది. సర్వే నిర్వహించిన రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ హైమావతికి నివేదిక అందింది. దాన్ని నేడు కలెక్టర్ ప్రభుత్వానికి అందజేయనున్నారు. నివేదికలో పేర్కొన్న అంశాలపై ఉత్కంఠ నెలకొంది. ఎర్రవల్లిలో భూములు అన్యాక్రాంతం అయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధికారులు సర్వే ప్రక్రియ ప్రారంభించారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో

మిగతా 2లో..



'ఓట్ చోరీపై దేశం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. అయినా బీజేపీ- ఈసీ బహిరంగంగానే ఏం చేస్తుందో చూడండి. కర్ణాటకలోని బెళగావిలో దాదాపుగా 15 వేల మంది ఓటర్ల పేర్లను ఒక్క దెబ్బతోనే తుడిచిపెట్టే కుట్ర ప్రయత్నం జరిగింది. 3 రోజుల్లోనే ఓటర్ల జాబితా నుంచి ఎన్నో పేర్లను తొలగించడానికి ఫారం- 7 దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆటోమేటెడ్ వ్యవస్థల ద్వారా ఫిల్ చేసి బీజేపీని ఎక్కువగా వ్యతిరేకించే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల పేర్లను తొలగించే కుట్ర జరిగింది. ఇలా రెప్పపాటులో లక్షలాది మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి మాయమవుతాయి. మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ ముగ్గురూ కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ దేశద్రోహమే. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి. మోదీ- షా పై విచారణ జరగాలి'

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

# ఎవరి ఆదేశాలతో ఫారం - 6 మార్పులు చేశారు?



## దీని వెనుక కుట్ర ఎవరిది?

- ఎవరి ఆదేశాలతో జరిగాయో చెప్పండి
- సీఈసీకి రాహుల్ గాంధీ సూటి ప్రశ్న
- మేధావులు, విద్యావేత్తలపై మోదీ అక్కసు
- 'సర్'తో ప్రక్రియతో ప్రజాస్వామ్యం ధ్వంసం
- సీఈసీ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి'
- మోదీ, షాపై విచారణకు డిమాండ్
- సర్‌పై ఇండియా కూటమి ఆందోళనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశం ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. కొద్ది రోజులుగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలు, ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఈ సర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కిందికే వస్తుందని ఆరోపించారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని, మోదీ- షా ద్వయంపై దర్యాప్తు జరగాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటక బెళగావిలో ఓటర్ల పేర్ల తొలగింపు కుట్రకు

మిగతా 2లో..

# ఖైరతాబాద్‌లో ఈసారి బీజేపీ గెలుపు ఖాయం

## పోయినసారి పొరపాటున ఓడిపోయాం.. : కిషన్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌తో భాజ పాకు పొత్తు ఉండదని స్పష్టం చేశారు. హైదరా బాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "యాదాద్రి థర్మల్ ప్లాంట్ కోల్ లింకేజీకి సంబంధించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. సింగరేణిలో ఉన్న బొగ్గును వినియో గించుకునేలా యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఎందుకు నిర్మించలేదో సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సమాధానం

మిగతా 2లో..

## సంతకాల పంచాయితీకి
# సర్కార్ చెక్!

- ఉప సర్పంచ్ జాప్యంచేస్తే మరో చట్టబద్ధ అధికారికి చెక్ డ్రాయింగ్ పవర్
- గ్రామ పంచాయతీల్లో అడ్డంకులు లేకుండా ప్రభుత్వం కీలక ఆదేశాలు
- మంత్రి సీతక్క ఆదేశాలతో జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు
- 7 పని దినాల్లో సంతకం చేయకపోతే కలెక్టర్ విచారణ




హైదరాబాద్(జనంసాక్షి) గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. చెక్కులపై సంతకాలు చేయడం లేదా వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ కీ ద్వారా ఆమోదించడంలో ఉప సర్పంచ్‌లు అనవసరంగా జాప్యం చేస్తే చర్యలు తీసుకునేలా పంచాయతీరాజ్ శాఖ జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ గురువారం నాడు మెమో జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో కొంతమంది ఉప సర్పంచ్‌లు ఎలాంటి సరైన కారణం లేకుండా చెక్కులపై

మిగతా 2లో..



## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు
# పోరుఆగదు

- నేటి నుంచి దేశవ్యాప్త నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. అక్టోబర్ 2 నుంచి ఈ నిరసనలు ప్రారంభంకానున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలని.. పౌర సమాజానికి భాగస్వామ్యం

మిగతా 2లో..

## 'ఫ్లైదుబాయ్' విమానంలో భయానక దాడి..
# ఉగ్రకుట్రేనా?




- కో-పైలట్ దాడి ఘటనపై యుఏఈ ఉన్నత స్థాయి దర్యాప్తు
- నిందితుడిపై విచారణలో వెలుగులోకి దిగ్భ్రాంతికర విషయాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు 174 మంది ప్రయాణికులతో వెళ్తున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో చోటుచేసుకున్న భయానక దాడి ఉదంతం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. విమానాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చివేసేందుకు ఒమన్ పౌరుడైన కో-పైలట్ చేసిన కుట్రను, భారతీయ కెప్టెన్, ఇజ్రాయెల్ ప్రయాణికులు తమ ప్రాణాలకు తెగించి తిప్పికొట్టారు. అయితే, ఈ ఘోర ఘటన వెనుక ఏదైనా ఉగ్రవాద కోణం ఉందా? ఇది ముందస్తుగా పన్నిన కుట్రేనా? అనే దిశగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధికారికంగా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం 34వేల అడుగుల ఎత్తులో ప్రశాంతంగా ప్రయాణిస్తున్న సమయంలో కాక్‌పిట్‌లో

మిగతా 2లో..

## 9/11 తరహా మారణహోమాన్ని భారతీయుడు నివారించాడు:మోదీ

2లో..

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు
# పోరుఆగదు

కల్పించాలని డిమాండ్ చేశారు. ముంబయిలోని శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సాయంత్రం 'జైల్ భరో ఆందోళన్' చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది. అయితే ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అక్కడ సభల నిర్వహణకు అనుమతి లేదని తెలిపారు. ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని సూచించారు. పోలీసులే కాకుండా.. శివాజీ పార్క్ పరిసరాల్లోని నివాసితులు కూడా ఈ నిరసనను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.

## సిద్ధమైన ఎర్రవల్లి భూసర్వే నివేదిక..

ప్రభుత్వ భూములున్న సర్వే నంబరు 325లో హద్దులు నిర్ధరించారు. రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించారు. తమకు చెందిన భూములు సైతం 2014లో 325 సర్వే నంబరులో కలిపేశారని.. న్యాయం చేయాలని శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి పొంగులేటిని కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నివేదికలో ఆ గ్రామస్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని సమాచారం.

## మల్లేశ్ నుంచి కీలక సమాచారం రాబట్టిన పోలీసులు



**హైదరాబాద్(జనంసాక్షి):** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసు(ంతీఎ్ఎ లివజీజూనీనిబ బిప్తృవటబి ఇ-జీబవ)లో నిందితుడు మల్లేశ్ కస్టడీ ముగిసింది. సెప్టెంబరు 22 నుంచి 10 రోజుల పాటు మల్లేశ్‌ను విచారించిన బొల్లారం పోలీసులు.. వైద్య పరీక్షల అనంతరం గురువారం సాయంత్రం సికింద్రాబాద్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడి నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. మల్లేశ్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశముందని సమాచారం.

## హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ
### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ, విస్తరణ, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులను రేషనలైజ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల సమర్థవంతమైన పర్యవేక్షణ, నేరాల నియంత్రణ, క్షేత్రస్థాయిలో పోలీసుల స్పందన, సమయాన్ని వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు పోలీసింగ్ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టింది. ఈ మేరకు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేరుతో జీవోను విడుదల చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 76 పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక విభాగాలు వివిధ వింగ్‌ల పరిధులలో స్పష్టమైన మార్పులు–చేర్పులను ప్రభుత్వం చేసింది. శంషాబాద్ జోన్ పరిధిలోని బండ్లగూడ, అల్మాస్‌గూడ ప్రాంతానికి చెందిన బడంగ్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను పూర్తిగా రద్దు చేశారు. రాజీవ్?గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఠాణా పేరును ఇకపై శంషాబాద్ పీఎస్‌గా మార్చారు. శంషాబాద్ వార్డు–118, కొత్వాల్‌గూడ వార్డు–119 పరిధిలోని గ్రామాలను ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోకి విలీనం చేశారు. మార్కెట్ పీఎస్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు మల్కాజిగిరి కమిషనరేట్‌కు బదిలీ కాగా, మార్కెట్ పీఎస్ పరిధిలోని బేగంపేట్ వార్డు భాగాన్ని మహంకాళి పీఎస్ పరిధిలోకి చేర్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాణా పరిధి యథాతథంగా కొనసాగుతూనే, యూనివర్సిటీ క్యాంపస్ భూభాగమంతా సంపూర్ణంగా ఓయూ పీఎస్ పరిధి కిందకే వచ్చేలా జీవో లో ప్రభుత్వం పేర్కొంది.

### ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా
## ఈసీని ఆదేశించండి

ఎన్నికపై 2024లో పిటిషన్ వేశామని కోర్టుకు తెలిపారు. అఫిడవిట్‌లో దానం తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఆ పిటిషన్ ప్రస్తుతం విచారణ దశలో ఉందని విజయారెడ్డి తరఫు న్యా యవాది చెప్పారు. గతంలో వేసిన పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆదేశించాలని విజయారెడ్డి కోరారు.

## బీచ్‌లో విషాదం..
### మహారాష్ట్రలో రాయ్‌గఢ్ జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థుల మృతి



**ముంబై(జనంసాక్షి):**మహారాష్ట్రలో రాయ్‌గఢ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహార యాత్రలో భాగంగా ఓ బీచ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎనిమిది మంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణె జిల్లాలోని ఓ ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది రాయ్‌గఢ్ జిల్లాలోని దివేఅగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లారు. వీరిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు సహా మొత్తం 48 మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సముద్రంలో దిగిన ఎనిమిది మంది విద్యార్థులు నీటి లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగి సహాయక బృందాలు.. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు.

# సర్కారీ ఉద్యోగులకు ఖుష్ ఖబర్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారు. ఈ సీజన్లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేసింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది.
విద్యుత్ కోత లేకుండా సరఫరాకు నిర్ణయం
ఎల్‌నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్లో అది రికార్డు స్థాయిలో 19892 మెగావాట్ల పీక్ డిమాండ్?కు చేరింది. అంటే దాదాపు 20 వేల మెగావాట్లకు చేరింది. గత ఏడాది మొత్తంలో 16613 మెగావాట్ల గరిష్ట వినియోగం నమోదైంది. అందుకే విద్యుత్తు డిమాండ్?కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, తగినంత విద్యుత్తు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది.

# ఆస్తులపై విచారణకు సిద్ధం



కూడా కరెంట్ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, రైతుబంధు రావడం లేదని, యూరియా దొరకడం లేదని కంటతడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఫోన్ చేస్తే యూరియా పొలం వద్దకే వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజలు తమ పక్షాన నిలబడి ఈ ప్రభుత్వంపై పోరాడాలని కోరుతున్నారని చెప్పారు.కేసీఆర్ గారు ఆనాడే చెప్పారు.. మోసపోకండి.. మోసపోతే గోసపడ్తం అని. ఇవాళ అన్నివర్గాల ప్రజలు గోసపడుతున్నరు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ రైతులను ఇబ్బంది పెట్టిందని, అదే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి "వెనకటి రోజులు మళ్లీ తెస్తా" అని చెప్పారని, ఇప్పుడు సాగునీరు లేని రోజులు, కరెంట్ రాని రోజులు తిరిగి తెచ్చారని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు మోసం చేసేవాళ్లనే నమ్ముతారని రేవంత్ రెడ్డి గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు నిజమయ్యాయని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిందని అన్నారు. కాళేశ్వరం మీద కమిషన్ వేశారని, విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ వేశారని, ఫార్ములా–ఈ వ్యవహారంపై కేసులు పెట్టారని, బ్యాంకు ఖాతాల వ్యవహారాలపై విచారణ జరిపారని, అయితే వీటి నుంచి ఏమి తేల్చారని ప్రశ్నించారు. ప్రజల మనసు ఖాళీగా ఉంటే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలు గుర్తుకొస్తాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త అంశాలను తెరపైకి తెస్తోందని ఆరోపించారు.సిరిసిల్ల పర్యటనలో ముఖ్యమంత్రి చేనేత కార్మికుల సమస్యలపై సమాధానం చెప్పకుండా వెళ్లారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లలో పలువురు చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, విద్యార్థుల స్కూల్ యూనిఫాం ఆర్డర్లు నిలిచిపోయాయని, నేతన్న బీమా పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. చనిపోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు పరిహారం ప్రకటిస్తారని, నేతన్న బీమాపై ప్రకటన చేస్తారని ఆశించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. తన ఆస్తులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేసీఆర్ 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రి, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రిగా పనిచేశారని, నాలుగు దశాబ్దాలకు పైగా చట్టసభల్లో ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ తనను చిన్నప్పటి నుంచి బాగా చదువుకోవాలని చెప్పేవారని, తాను చదువుకుని అమెరికాలో ఆరు సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బుతో 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. 2006లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలో హోటల్ ప్రారంభించానని, 2009 ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు, వ్యాపార వివరాలను స్పష్టంగా వెల్లడించానని తెలిపారు. "నేను అఫిడవిట్‌లో చెప్పిన విషయాన్నే మళ్లీ కొలంబస్ కనుగొన్నట్టు చెబుతున్నరు" అని కేటీఆర్ అన్నారు. వ్యాపారం చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు.రైతులు, చేనేత కార్మికులు, యువత, బీసీలు, దళితులు, మైనారిటీలు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు.

## ఖైరతాబాద్‌లో ఈసారి గెలుపు ఖాయం

చెప్పాలి. ఖైరతాబాద్‌లో గతంలో పొరపాటున ఓడిపోయాం. ఇప్పుడు భాజపా గెలుపు ఖాయం. భాజపా ఓటు చోరీ చేయదు.. ప్రజల హృ దయాలు మాత్రమే చోరీ చేస్తుంది. దేశ రాజకీ యాల్లో మార్పు వస్తుందని రాహుల్‌గాంధీ చెబుతున్నారు. ప్రతిపక్ష నేత పదవి వేరొకరికి ఇస్తారేమో. దేశంలో మార్పు ప్రజల చేతుల్లో ఉంటుంది.. రాహుల్ గాంధీ చేతిలో కాదు. రాజ్యాంగ బద్ధ సంస్థలతో పాటు భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్‌ను ఆయన విమర్శి స్తున్నారు. 'సర్' విషయంలో హైదరాబాద్‌లో ఏం తప్పు జరిగిందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నుంచి 8 మంది ఎంపీలు ఎలా గెలిచారు? శివుడు, రాముడి గురించి సీఎం బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజలను అన్ని రకాలుగా విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీకే ఉంది. ప్రజలను ప్రాంతాల వారీగా విభజించి వైషమ్యాలు సృష్టించిన చరిత్ర ఆ పార్టీది. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం మాట్లాడారు.తొలగించిన ఓట్లను చేర్చాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చనిపోయిన వారి ఓట్లనూ చేర్చాలా? బంగ్లాదేశ్ ఓటర్లను తిరిగి చేర్చాలా? బెంగాల్ నుంచి లక్షల మంది బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయారు. బెంగాల్, బిహార్‌లో ఓట్ల శాతం పెరగడానికి 'సర్' కారణం. దేశంలో బంగ్లాదేశ్ ఓటర్లను చేర్చి విధ్వంసం సృష్టించాలని కాంగ్రెస్ చూస్తోందా?తెలంగాణలో ప్రభుత్వం పోకుండా ఆ పార్టీ చూసుకోవాలి. ఓటమి కడుపు మంటతో కాంగ్రెస్, విపక్షాలు భాజపాతో పాటు ఈసీని విమర్శిస్తున్నాయి"అని అన్నారు.

## 'సర్' గడువు మళ్లీ పొడిగింపు కుదరదు

కుటుంబసభ్యులు అందరూ ఉండాల్సిన అవసరంలేదని, ఒకరు వివరాలు ఇస్తే సరిపోతుందని వివరించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈసీ ఈ మార్పులు చేసిందని చెప్పారు. మూడు లక్షల మందికి సంబంధించిన నోటీసులకు సమాధానాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. నోటీసులకు 65 లక్షల మంది సమాధానం ఇచ్చినట్లు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా 54లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని నవంబర్ 5వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.
ఖైరతాబాబాద్‌లో 20 శాతం మాత్రమే
బీఎల్‌వోలు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందినవారు కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశంలేదని ఆయన తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మంది ఓటర్లకు నోటీసులు వచ్చామని ఇప్పటి వరకు 20శాతం మంది నుంచి మాత్రమే సమాధానాలు వచ్చాయని వివరించారు.

## తృణముల్ బ్యాంకు ఖాతాలు సీజ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. డెబిట్ కార్యకలాపాలు సాగకుండా ఫ్రీజ్ చేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను తిరిగి నిర్వహించుకునేందుకు అనుమతించాలని కోరుతూ టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. పార్టీ చిహ్నం వివాదం ప్రస్తుతం ఎన్నికల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్నందున కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఆదాయ వివరాల్లో అవకతవకల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. అయితే, ఆ నాలుగు ఖాతాల్లో దాదాపు రూ.804 కోట్లు ఉన్నాయని టీఎంసీ కోర్టుకు తెలిపింది. ఖాతాల నిలుపుదలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. వాటిని వెంటనే తమకు అప్పజెప్పాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. పార్టీలో చీలిక, గుర్తును ఎన్నికల సంఘం ఫ్రీజ్ చేసినందున, ఈ నిధులకు అసలైన అర్హులు ఎవరనే ప్రధానాంశం ఇంకా తేలాల్సి ఉందని పేర్కొంది. ఈ వ్యవహారంలో నిజానిజాలను పరిశీలించి, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది.ఈ ఖాతాల ఫ్రీజ్‌ను ఎత్తివేయడానికి కోల్‌కతా హైకోర్టు ఇటీవల నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే పార్టీ రోజువారీ ఖర్చులు, ఇతర అవసరాల కోసం మరో మూడు ఖాతాలను తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు అనుమతిస్తూ ఒక ప్రత్యేక అధికారిని పర్యవేక్షకుడిగా నియమించింది.

## ఈ సారి చలీ తక్కువే..

ఈ సీజన్‌లో 18 శాతం లోటు వర్షపాతం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. అత్యధిక లోటు వర్షపాతం జాబితాలో నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలు ఉన్నట్లు పేర్కొంది.

## అణు పరీక్షలను పసిగట్టేందుకు అమెరికా కొత్త ప్రయోగం..!

**న్యూయార్క్(జనంసాక్షి):** అణు పరీక్షలను పసిగట్టే సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చుకునేందుకు అమెరికా కొత్త ప్రయోగం చేపట్టింది. నెవాడా నేషనల్ సెక్యూరిటీ సైట్‌లోని భూగర్భంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. అయితే ఇది అణు పరీక్ష కాదు. అణుయేతర రసాయనిక పేలుడు పదార్థాలను ఉపయోగించి ఈ ప్రయోగం చేపట్టింది. తక్కువ స్థాయి అణు విస్ఫోటనాల ను గుర్తించడమే దీని ప్రధాన లక్ష్యమని అమెరికా ఇంధన శాఖ తెలిపింది. నెవాడాలోని ఏరియా–12లో ఉన్న 'పీ టన్నెల్'లో ఈ ప్రయోగం జరిగింది. ఇందులో అధిక శక్తి కలిగిన రసాయన పేలుడు పదార్థాలతో పాటు రేడియోట్రేసర్లను ఉపయోగించారు. అణు పేలుళ్లను గుర్తించే కంప్యూటర్ అల్గారిథమ్‌లను అప్‌గ్రేడ్ చేసేందుకు ఈ ప్రయోగం చేపట్టినట్లు తెలుస్తోంది. చైనా 2020లో రహస్య అణు పరీక్ష నిర్వహించిందని అమెరికా గతంలో ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను చైనా ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమని పేర్కొంది. కొన్ని దేశాలు భూగర్భంలో అణు పరీక్షల ప్రకంపనలు బయటకు తెలియకుండా ఉండాలని పెద్ద పెద్ద గుహలు, టన్నెల్స్‌ను వాడుతుంటాయి. అలాంటి రహస్యాలను ఛేదించడమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం.



## ఎవరి ఆదేశాలతో ఫారం 6
# మార్పులు చేశారు?

సంబంధించి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
బెళగావిలో 15 వేల ఓటర్ల పేర్ల తొలగింపు ఆరోపణ
సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో కేవలం 3 రోజుల్లోనే బెళగావిలో సుమారు 15 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ప్రయత్నం జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనికి సంబంధించి వేలాది ఫారం- 7 దరఖాస్తులు వెల్లువెత్తాయని, ఎక్కువగా బీజేపీని వ్యతిరేకించే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని గతంలో చేసిన ఆరోపణల్ని రాహుల్ మరోసారి ప్రస్తావించారు. కర్ణాటక కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నారని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు.

**సర్‌పై ఇండియా కూటమి ఆందోళనలు**

ఇదిలా ఉండగా సర్ ప్రక్రియపై బుధవారం రోజు ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన 19 రాజకీయ పార్టీల నేతలు సుదీర్ఘంగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2–8 మధ్య జిల్లాల స్థాయిలో సేవ్ డెమోక్రసీ మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయించింది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలంతా కలిసి కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితా సవరణపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయాలని కూటమి నిర్ణయించింది. రాబోయే ఎన్నికలన్నింటినీ ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలనే డిమాండ్‌ను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. సర్ ప్రక్రియకు సంబంధించి సుప్రీం కోర్టులో ఉన్న కేసుల్ని వేగవంతం చేయాలని కూడా ఈ సందర్భంగా కోరుతోంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో సంబంధించిన నిర్ణయాలు, ఉత్తర్వులపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇటీవల ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఒక నివేదికలో పేర్కొంది. దీనిని ఆధారంగా చేసుకొని ప్రతిపక్షాలు విమర్శలు చేయగా ఎన్నికల సంఘం ఈ ఆరోపణలపై స్పందించింది. రాజ్యాంగ సంస్థలో అధికారుల మధ్య విభిన్న అభిప్రాయాలు, సూచనలు ఉండటం సర్వసాధారణమేనని, సర్ ప్రక్రియ సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలు అందరు సభ్యుల ఆమోదంతోనే తీసుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది.

## 'ఫ్లైదుబాయ్' విమానంలో భయానక దాడి..
# ఉగ్రకుట్రేనా..?

ఒక్కసారిగా భయానక దృశ్యం జరిగింది. ఒమన్ దేశానికి చెందిన కో–పైలట్ అకస్మాత్తుగా భారతీయ ప్రధాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడికి దిగాడు. విమానాన్ని నేలకూల్చే ఉద్దేశంతో కంట్రోల్ స్టిక్‌ను కిందకు నెట్టడంతో విమానం ఏకంగా 18,000 అడుగుల కిందకు పడిపోయింది. విమానంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ అత్యవసర సమయంలో రక్తమోడుతున్న స్థితిలోనూ ధైర్యం వీడని కెప్టెన్ మచ్చర్, తక్షణమే '7500' హైజాకింగ్ డిస్ట్రెస్ కోడ్‌ను జారీ చేశారు. ఆపై తన శక్తులన్నింటినీ కూడగట్టుకుని కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు. వెంటనే విమానంలో ఉన్న ఇజ్రాయెల్ ప్రయాణికుడు యానిక్ కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి దాడి చేస్తున్న కో–పైలట్‌ను వెనక నుంచి పట్టుకుని లాగాడు. ఇతర ప్రయాణికులు, సిబ్బంది సాయంతో నిందితుడిని బంధించి, విమానంలో ఉన్న మరొక జత పైలట్ల సాయంతో సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు.

**యుఏఈ ఉన్నత స్థాయి దర్యాప్తు**

ఈ భయానక ఘటనపై యుఏఈ న్యాయస్థానాలు పూర్తి అధికార పరిధిని కలిగి ఉన్నాయని యుఏఈ ప్రభుత్వం ప్రకటించింది. విమానం యుఏఈ పతాకంతో నమోదై ఉన్నందున, విదేశీ గగనతలంలో నేరం జరిగినప్పటికీ తమ చట్టాలే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం సౌదీ అరేబియా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని తొలిదశ విచారణ జరుపుతున్నారు. విచారణ పూర్తయిన తర్వాత అతడిని యుఏఈకి అప్పగించనున్నారు.అమెరికా వార్తా సంస్థ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ దాడి వెనుక ఇరాన్ హస్తం ఉందా లేదా అని చెప్పడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందని, నిందితుడికి ఇజ్రాయెలీలపై తీవ్రమైన ద్వేషం, మత ఛాందసవాదం ఉందనేది స్పష్టంగా కనిపిస్తోందని అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ దర్యాప్తులో ఇజ్రాయెల్ కూడా నేరుగా భాగస్వామ్యమయ్యే అవకాశం ఉందన్నారు. అటు ఈ దాడికి పాల్పడిన ఒమన్ కో–పైలట్ గురించిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇజ్రాయెల్ ఛానల్ 16కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడితో పనిచేసిన సహచర ఫ్లైదుబాయ్ పైలట్ కీలక విషయాలు వెల్లడించారు. నిందితుడు కేవలం 8 నెలల క్రితమే కంపెనీలో చేరాడని, అతడు తీవ్రమైన మతాచారాలు పాటించే ఛాందసవాది అని తెలిపారు. రోజులో అధిక సమయం ప్రార్థనల్లో గడిపేవాడని, మహిళలతో కరచాలనం చేయడానికి కూడా తిరస్కరించేవాడని పేర్కొన్నారు.

**దౌత్య ఒప్పందాల ఉల్లంఘనపై ఇజ్రాయెల్ ఆగ్రహం**

మరోవైపు ఈ ఘటన ఇజ్రాయెల్, యూఏఈ మధ్య దౌత్యపరమైన వివాదానికి దారితీసింది. ఇజ్రాయెల్‌తో అధికారిక దౌత్య సంబంధాలు లేని ఒమన్ దేశ పౌరుడిని ఇజ్రాయెల్‌కు వెళ్లే విమానం నడిపేందుకు ఎలా అనుమతిస్తారని ఇజ్రాయెల్ రవాణా శాఖ మంత్రి మిరీ రెగెవ్ ప్రశ్నించారు. ఇది ఇరు దేశాల మధ్య ఉన్న విమానయాన ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ విచారణకు ఆదేశించారు. అయితే, ఆ ఒమన్ పైలట్‌కు ద్విపౌరసత్వం ఉండి ఉండవచ్చని, అందుకే సాంకేతికంగా విమానం నడిపే అవకాశం లభించి ఉండవచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం తీవ్రంగా గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్, నిందితుడైన కో–పైలట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విమానానికి చెందిన బ్లాక్ బాక్స్ డేటా, ప్రయాణికులు రికార్డ్ చేసిన వీడియోలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ దారుణ కుట్ర వెనుక ఏమైనా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల మాస్టర్‌మైండ్ ఉందా లేదా అనే నిజాలు యూఏఈ జరిపే సమగ్ర దర్యాప్తులో తేలనున్నాయి.

### 9/11 తరహా మారణహోమాన్ని భారతీయుడు నివారించాడు: మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రాణాలకు తెగించి 174 మందిని కాపాడిన ఫ్లైదుబాయ్ పైలట్, భారతీయుడు స్మిత్ మచ్చర్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రధాని మోదీ మరోసారి ఆయన్ను కొనియాడారు. 9/11 తరహా మారణహోమాన్ని భారతీయుడు నివారించారని అభినందించారు. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు."నిన్న జరిగిన ఘటనలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసాధారణ సహనం, సమయస్ఫూర్తి, ధైర్యంతో స్పందించారు.



ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్టుగా.. ఒక భారతీయుడు 9/11 తరహా మారణహోమాన్ని నివారించారు. ఆయన మన దేశ గౌరవాన్ని పెంచారు" అని ప్రధాని పేర్కొన్నారు. ఫ్లైదుబాయ్ విమానయాన సంస్థలో చేరకముందు.. మచ్చర్ స్పైస్‌జెట్‌లో విధులు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. తాజా ఘటన నేపథ్యంలో స్పైస్‌జెట్ స్పందించింది. "ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎన్నో ప్రాణాలను కాపాడాయి. ఆయన స్పైస్‌జెట్‌లో 10 ఏళ్లపాటు పనిచేశారు. ఆయన ధైర్యం, నిస్వార్థ సేవ.. స్పైస్‌జెట్‌లో మేము అమూల్యంగా భావించే విలువలకు నిజమైన ప్రతిరూపం. ఆయన త్వరగా కోలుకోవాలని మేం కోరుకుంటున్నాం. కెప్టెన్.. మీరు మా అందరికీ హీరో" అని ఎయిర్‌లైన్ కొనియాడింది.

# సంతకాల పంచాయితీకి సర్కార్ చెక్!

సంతకాలు చేయకపోవడం, వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఆమోదించకపోవడం వల్ల చెల్లింపులు ఆలస్యం అవుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, గ్రామాల్లో అభివృద్ధి పనుల అమలు వంటి అత్యవసర సేవలపై ప్రభావం పడకుండా ఈ నిర్ణయం తీసుకుంది.7 పని దినాల్లో సంతకం చేయకపోతే కలెక్టర్ విచారణచెక్కులపై సంతకం చేయాలని లేదా డిజిటల్ సిగ్నేచర్ కీ ద్వారా వ్యయాన్ని ఆమోదించాలని ఉప సర్పంచ్‌కు సమర్పించిన తేదీ నుంచి ఏడు పని దినాల్లోపు ఎలాంటి సరైన కారణం లేకుండా సంతకం చేయకపోతే.. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సంతకం చేయకపోవడానికి లేదా వ్యయాన్ని ఆమోదించకపోవడానికి నిజమైన కారణం ఉందా లేదా అనే అంశాన్ని విచారణలో పరిశీలించనున్నారు. విచారణలో ఉప సర్పంచ్ ఎలాంటి సరైన కారణం లేకుండా ఉద్దేశపూర్వకంగా చెక్కులపై సంతకం చేయకుండా లేదా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా వ్యయాన్ని ఆమోదించకుండా జాప్యం చేసినట్లు తేలితే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. పంచాయతీరాజ్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఉప సర్పంచ్‌కు అప్పగించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లయితే చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.అవసరమైతే మరో చట్టబద్ధ అధికారికి చెక్ డ్రాయింగ్ పవర్‌ఉప సర్పంచ్ కారణం లేకుండా చెక్కులపై సంతకం చేయడం లేదా వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఆమోదించడంలో జాప్యం చేసినట్లు విచారణలో తేలితే, చెక్కులను డ్రా చేసే అధికారాన్ని మరో చట్టబద్ధమైన అధికారికి అప్పగించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ అధికారాన్ని పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ, ఎంపీడీవో తదితర చట్టబద్ధ అధికారుల్లో తగిన వారికి అప్పగించే అవకాశం కల్పించారు. దీంతో ఒక వ్యక్తి కారణంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రజా సేవలు, అభివృద్ధి పనులు, అత్యవసర నిర్వహణ పనులకు సంబంధించిన చెల్లింపులు నిలిచిపోకుండా నిరంతర ప్రక్రియ కొనసాగనుంది. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, అభివృద్ధి పనులు వంటి కార్యక్రమాలకు సంబంధించిన చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## నిర్మల్‌లో ఘనంగా చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

- సినీనటి శ్రీలీల రాకతో అభిమానుల సందడి



**నిర్మల్ బ్యూరో అక్టోబరు 1 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలో చెన్నై షాపింగ్ మాల్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి శ్రీలీల హాజరు కావడంతో ప్రారంభోత్సవ ప్రాంగణం అభిమానులతో సందడిగా మారింది. సరికొత్త ఫ్యాషన్ డిజైన్లు, సంప్రదాయ వస్త్రాలతో మాల్ అందుబాటులోకి రావడంతో పట్టణ ప్రజలకు మరిన్ని షాపింగ్ ఎంపికలు అందుబాటులోకి వచ్చాయి. ప్రారంభోత్సవంలో శ్రీలీల మాట్లాడుతూ.. కుటుంబ సమేతంగా షాపింగ్ చేసి కొత్త అనుభూతిని పొందాలని కోరారు. పండుగలు, శుభకార్యాలు, వివాహాల సందర్భంగా నూతన వస్త్రాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన వివిధ రకాల వస్త్రాలు ఒకే చోట లభించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా వివిధ డిజైన్ల దుస్తులు, సంప్రదాయ వస్త్రాలు మాల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాలతో పాటు రోజువారీ అవసరాలకు కావాల్సిన వస్త్రాలను ఒకే చోట ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

**అభిమానుల సందడి**

శ్రీలీల రాకతో ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాల్ పరిసరాలు జనసందోహంతో సందడిగా మారాయి. కొత్త షాపింగ్ సంస్థ రాకతో నిర్మల్‌లో రిటైల్ రంగం మరింత విస్తరించడంతో పాటు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ గోడం నాగేశ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తదితర ప్రముఖులు హాజరయ్యారు. నగర ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించేలా చూడండి

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన కరీంనగర్ ఎంఐఎం నేత గులాం అహ్మద్



**కరీంనగర్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గత 12సంవత్సరాలుగా, పెండింగులో ఉన్న ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ పనుల సాధన, పురోగతి, ముస్లిం డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులను మంజూరు చేయాలని, కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, 59వ డివిజన్ కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ తో కలిసి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఈవినతి పత్రాన్ని అందజేసినట్లు గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడించారు. కరీంనగర్ నియోజకవర్గంలో అన్యాక్రాంతం అయిన వక్ఫ్ బోర్డు భూములను కాపాడి, ఇందులో ఈద్గా, ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్, మినీ హజ్ హౌస్, మైనార్టీ గురుకులాలకు పక్క భవనాలు, మైనార్టీలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మైనార్టీ స్టడీ సర్కిల్ మంజూరు చేసి, నిర్మాణాలు చేయవచ్చన్నారు. నగరంలోని పురాతన ఈద్గా వద్ద రోడ్డుకు మధ్యలో వేసినటువంటి డివైడర్లు తొలగించాలని, నగరంలోని పురాతన కూరగాయల మార్కెట్ స్థలాన్ని, అదాలత్ మస్జిద్, వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని, ఇతర రాజకీయ పార్టీల కార్యాలయాల మాదిరిగా, ఎంఐఎం పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని, ఉర్దూ మీడియం టీచర్ అభ్యర్థుల కోసం, ప్రత్యేక ఉర్దూ డిఎస్సి నిర్వహించాలని, ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగ ముస్లిం యువత కోసం సబ్సిడీ లోన్ల యూనిట్ లను పెంచాలని, పేద ముస్లిం మహిళలకు ఇచ్చేటువంటి కుట్టుమిషన్ల యూనిట్లను పెంచాలని, సంచార ముస్లిం జాతుల కోసం పనిముట్లను అందజేసే యూనిట్లను, వాహనాల యూనిట్లను పెంచాలని వినతిపత్రంలో సీఎం ను కోరారు. బొమ్మకల్ ప్రాంతంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మించేలా చొరవ తీసుకోవాలని, స్మార్ట్ సిటీ ద్వారా రూ. 3కోట్ల నిధులను బైపాస్ రోడ్డు మోడల్ ఖబ్రస్థాన్ సంబంధించి, అభివృద్ధి చేసేలా చొరవ తీసుకోవాలని, కరీంనగర్ పట్టణంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు విలీనమై, కార్పొరేషన్ జనసాంద్రత పరంగా ఎక్కువగా ఉన్నందువల్ల, 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ను హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో మంజూరు చేసి, ఏర్పాటు చేయాలని, కరీంనగర్ ముస్లింల అవసరాల కోసం 10ఎకరాల క్లియర్ గా ఉన్న భూమిని కేటాయించాలని, చింతకుంట ఈద్గా భూమిని క్లియర్ చేసి ఇవ్వాలని, కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర రెండవ అధికార భాష అయిన ఉర్దూను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాకు మైనారిటీ సంక్షేమ అధికారిని, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ ను పూర్తిస్థాయిలో నియమించాలని పేర్కొన్నారు. నగరంలోని 59, 60 డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేయాలని, కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ముకరంపుర మమత థియేటర్ వరకు పెద్ద మురుగునీటి కాలువ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. లేకుంటే ముఖరం పుర ప్రతి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. కొత్తపల్లి మండలం బద్దిపల్లికి సంబంధించినటువంటి సుమారు 2000 పేదల ఇండ్లకు ఇందిరమ్మ బిల్లులను మంజూరు చేసి, వాటిని నిర్మాణం చేసి పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్త పోస్టుకార్డు ఉద్యమం

- క్యాష్‌లెస్ హెల్త్‌కార్డు స్కీంను అమలు చేయండి
- తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, ఆస్కాని మారుతీ సాగర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే క్యాష్ లెస్ హెల్త్ కార్డ్ స్కీమ్ ను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్టు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత విషయంలో తెలంగాణ ప్రభుత్వ అలసత్వ వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టులు బహిరంగ లేఖల ద్వారా సమస్యను ముఖ్యమంత్రికి తెలియచెప్పాలనే ఉద్దేశ్యంలో ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు వారు వివరించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాలలో ప్రారంభమయ్యే ఈ ఉద్యమం వారం రోజులపాటు కొనసాగుతుందని, తెలంగాణలోని ప్రతి జర్నలిస్టు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈ సమస్యను తెలియజేస్తూ పోస్ట్ కార్డు పై రాసి పంపించాలని వారు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ కేంద్రంగా సికింద్రాబాద్ లోని మహాత్మా గాంధీ రోడ్డులో గల బాపూజీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వారు వివరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు.. సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్

- పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి
- పార్టీ శ్రేణులు విస్తృతంగా పనిచేయాలి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** హైదరాబాద్-రంగారెడ్డి-పాలమూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్ వంటివని పేర్కొన్నారు. పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, పార్టీ శ్రేణులు గ్రామగ్రామాన పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక 43 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరగనున్నందున ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియకు కీలకమైన నెల రోజుల పాటు పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయం శిరోధార్యమని, పార్టీ నిర్ణయించిన అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు విజయాన్ని అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాన్ని తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తాటిచెట్ల తొలగింపు ఆపాలి

### ఎమ్మెల్యేకు గౌడ సంఘం వినతి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిన్న కోడెపాక గ్రామ శివారు బాలయ్యపల్లిలో విద్యుత్ లైన్ వేస్తున్న క్రమంలో గౌడ కుల వృత్తికి ఆధారమైన తాటి చెట్లను తొలగిస్తుండటంపై గౌడ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ గౌడ సంఘం చైర్మన్ కక్కెర్ల సంపత్ గౌడ్, అధ్యక్షులు కొత్తకొండ భానుతేజ గౌడ్, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్, కునూరి రాజేష్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి చెట్లు తొలగించవద్దని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాల ఆరోపణలు!

- ఓటు వేసిన వారికే ఇళ్లు ఇస్తున్నారంటూ గ్రామస్తుల ఆవేదన
- ఎంపీడీవో కార్యాలయాన్ని ఆశ్రయించిన అందుగూడ గ్రామస్తులు



జైనూర్, అక్టోబర్1(జనం సాక్షి)మండలం అందుగూడ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతోందని అందుగూడ గ్రామ పంచాయతీకి చెందిన పలువురు పేద కుటుంబాలు ఆరోపించారు. గ్రామంలో మంజూరైన ఇళ్లను అర్హులైన పేదలకు కాకుండా సర్పంచ్‌కు అనుకూలంగా ఉన్నవారికి, తనకు ఓటు వేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం.. అందుగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ సాగర్ బాయి తండ్రి గునాజీ తన ఇష్టానుసారంగా గ్రామ పంచాయతీని నడిపిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులు సైతం తమ మాట వినడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో సుమారు 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ, పైస్థాయి నుంచి వచ్చిన పేర్లను పరిగణనలోకి తీసుకోకుండా, సర్పంచ్‌కు అనుకూలంగా ఉన్నవారి పేర్లను జాబితాలో చేర్చి ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు.

అర్హత ఉన్న పేద కుటుంబాలు ఉన్నప్పటికీ వారికి ఇళ్లు మంజూరు కావడం లేదని వాపోయారు. “మేము కూడా పేద ప్రజలమే.. మాకు సరిగా ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఇందిరమ్మ ఇంటి పథకంతోనైనా మాకు న్యాయం చేయాలి” అని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రూ.5 వేల వరకు లంచం తీసుకుని ఇళ్లు ఇస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపణలు చేశారు. అయితే తాము డబ్బులు తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ చెబుతోందని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను బయటకు తీయాలని డిమాండ్ చేశారు.

గ్రామానికి చెందిన పవార్ వనజాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఇల్లు రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు మంజూరైనట్లు తెలిసినా ఇప్పటివరకు తమకు ఇల్లు అందలేదని, ఇందిరమ్మ ఇంటిని ఇప్పటికైనా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లబ్ధిదారుల జాబితా, అర్హతలు, మంజూరు ప్రక్రియ, ఇళ్ల నిర్మాణ పరిస్థితులను పరిశీలించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు ఎంపీడీవో కార్యాలయాన్ని ఆశ్రయించిన వారిలో ఆడే నూర్‌సింగ్, పవార్ వనజా, పవార్ రవీందర్, జాదవ్ జనార్ధన్, రాథోడ్ జైపాల్, జాదవ్ తులసిబాయి, చవాన్ దిలీప్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 1 (జనం సాక్షి) :అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అధికారులు అమలు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, మేన శ్రీను, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తదితర శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమీక్ష చేశారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీ ఫండ్స్ ద్వారా చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షణ చేసి అందుకు సంబంధించిన చెల్లింపులు కూడా వేగవంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజు గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరా నగర్‌లో ఒక్క గుడిసె ఉండకూడదు

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 01 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఇందిరానగర్‌లో గుడిసెలు, కవర్లు కప్పి ఉన్న ఇళ్లు లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబా నికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పక్కా ఇల్లు నిర్మించే బాధ్యత తనదని మాజీ ఉప ముఖ్యమం త్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ 10వ వార్డు పరిధిలోని ఇందిరానగర్‌లోని ప్రాథమిక పాఠశాల లో 5లక్షల రూపాయలతో నిర్మించిన వంట గదిని, మున్సిపల్ నిధులు కోటి రూపాయలతో 10,18 వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇందిరానగర్‌కు పలుమార్లు వచ్చానని, స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నానని చెప్పారు. గతంలో ఇందిరానగర్ మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయ ని స్థానికులు తన దృష్టికి తీసుకురాగా, వెంటనే దానిని అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు. ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక వసతుల కోసం చర్యలు చేపట్టినట్లు, ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా సీసీ రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో ఇందిరానగర్ కూడా ఉంద న్నారు. సీసీ రోడ్లతో పాటు సైడ్ డ్రైన్ల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. ఇందిరానగర్‌లో ఎక్కువగా పేద కుటుంబాలు నివసిస్తున్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గతంలో ఏడు ఇళ్లు మంజూరు కాగా ఐదు ఇళ్లు నిర్మాణం పూర్తయ్యాయని, మిగిలిన కుటుంబాల కు కూడా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఇందిరానగర్‌లోని అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించే బాధ్యత తీసుకుంటానని హామీఇచ్చారు.స్టేషన్ ఘనపూర్, చాగల్లు, శివునిపల్లి గ్రామాలను కలిపి ఘనపూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు కడియం శ్రీహరి తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు 2025 జనవరిలో ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మున్సిపాలిటీ చేయడమే కాదు మున్సిపాలిటీ అభివృద్ధికి సుమారు 50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి మరో 8 కోట్ల అదనపు నిధు లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలు కుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ బి రాధక్రిష్ణ,కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు, మున్సిప ల్ అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నా రు.

## రిమ్స్ ప్రగతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



గుడిహత్నూర్, అక్టోబర్ 1(జనం సాక్షి): రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు నిర్వహణలోని లోపాలను పూర్తిగా సరిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో అధికారులు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి నెలవారీ వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని, వేతనాల్లో అనధికారిక కోతలు విధిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేటాయించిన విధులను వదిలి ఇతర పనులకు వెళ్లే సిబ్బందిని ఉపేక్షించబోమన్నారు. సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచాలని సూచించారు.

రిమ్స్‌లోకి అనధికారిక ప్రవేశాలను అరికట్టేందుకు గతంలో అమల్లో ఉన్న పాస్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీల వెంట ఇద్దరు, ఇతర రోగుల వెంట ఒకరు లేదా ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉండేలా గేటు వద్దే నియంత్రణ చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలో గుట్కా నమలడం, ధూమపానం చేయడం, ప్లాస్టిక్, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వంటి చర్యలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, సూపర్‌వైజర్లు తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

రిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేస్తున్నప్పటికీ, రిజిస్టర్‌లో ఉన్న 420 మందిలో 350 మంది మాత్రమే విధులకు హాజరవుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన 70 మంది హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ హాజరు వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నవంబర్ నుంచి ఆన్‌లైన్ హాజరు ఆధారంగానే వేతనాలు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11 కోట్ల నిధులతో రిమ్స్‌లో లిఫ్ట్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వీల్‌చైర్లు, హెచ్‌డీఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్ట్రెచర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి వ్యర్థాలను మున్సిపల్ డంప్‌యార్డుకు తరలించేందుకు ప్రత్యేక ట్రాక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను డిసెంబర్ 3లోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధుల నిర్వహణ, వేతన సమస్యలు, ఇతర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ సాధన, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**CHENGE OF NAME AND DATE OF BIRTH**

I, EDIGI CHINNARI,R/O H.NO.1-28, MADANPALLE GP, BURANPUR (POST), BOMRASPET(MANDAL),VIKARABAD(DIST), TELANGANA (STATE), PIN:509338, CHENGED MY NAME AND DATE OF BIRTH STUDY BONAFIDE,BIRTH CERTIFICATE EDIGI NANDINI S/O EDIGI SRINIVAS ,D.O.B.29/07/2013.

సంపాదకీయం

## పండగలు - పర్యావరణం
# మనోభావాల కన్నా మనుగడ ముఖ్యం

పండగలు సమాజాన్ని కలిపే సాంస్కృతిక ఉత్సవాలు. కానీ ఆ ఉత్సవాల పేరుతో పర్యావరణానికి హాని కలిగించే ఆచారాలను కొనసాగించాలని పట్టుబట్టడం, వాటిని ప్రశ్నించిన వారిపై "మా మనోభావాలు దెబ్బతిన్నాయి" అంటూ విరుచుకుపడటం ఇటీవల ఒక ధోరణిగా మారింది. మనోభావాలు నిజంగా దెబ్బతింటాయో లేదో చెప్పడం కష్టం. కానీ సమాజం, పర్యావరణం మాత్రం తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నది కాదనలేని సత్యం.

దీపావళి తర్వాత ఢిల్లీ పరిస్థితే దీనికి అద్దం పడుతుంది. బాణాసంచా పొగ శీతాకాలపు మంచుతో కలిసి నగరాన్ని విషపు దుప్పటిలా కమ్మేస్తుంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయికి చేరి, పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె జబ్బుల రోగులు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడతారు. ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతుంది. ఇప్పటికే వాహన కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాలు, పంట వ్యర్థాల దహనంతో సతమతమవుతున్న నగరానికి, మనం తలచుకుంటే నివారించగలిగే ఈ అదనపు భారం ఎందుకు? కొన్ని క్షణాల ఆనందం కోసం లక్షల మంది ఊపిరితిత్తులను పణంగా పెట్టడం ఏ సంప్రదాయమూ కోరదు.

సమస్య బాణాసంచాతోనే ఆగదు. కొన్ని పండగల్లో విగ్రహ నిమజ్జనాల పేరుతో రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వ్యర్థాలు చెరువుల్లో, నదుల్లో కలుస్తున్నాయి. తాగునీటి వనరులు కలుషితమై జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. హోలీ వంటి సందర్భాల్లో విషపూరిత రసాయనాలున్న రంగులు చర్మానికి, కళ్లకు హాని చేయడమే కాక, నీటిని, నేలను పాడు చేస్తున్నాయి. ఇక లౌడ్ స్పీకర్ల హోరు, భారీ శబ్దాల టపాసులు రోగులకు, విద్యార్థులకు, వృద్ధులకు, మూగజీవాలకు నరకం చూపిస్తున్నాయి. శబ్ద కాలుష్యం కూడా ఆరోగ్యానికి తీవ్ర ముప్పేనని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు.

ఇలాంటి సందర్భాల్లో ప్రశ్నించిన వారిని, హేతుబద్ధమైన ఆలోచనను కోరిన వారిని "హిందూ వ్యతిరేకులు" అనో, "మనోభావాలను గాయపరుస్తున్నారు" అనో ముద్ర వేయడం సహేతుకం కాదు. ప్రశ్న అడగడం అవమానించడం కాదు. పర్యావరణం గురించి మాట్లాడేవారు పండగకు వ్యతిరేకులు కారు, ఆ పండగ భవిష్యత్తులో కూడా సురక్షితంగా జరగాలని కోరుకునేవారు. పైగా సంప్రదాయాలు స్థిరమైనవి కావు. కాలానుగుణంగా మారుతూ, సమాజ అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందుతూ వచ్చాయి. దీపావళి అంటే దీపాల వరుస, చీకటిపై వెలుగు విజయం. అందులో విషపు పొగకు, చెవులు చిల్లులు పడే శబ్దాలకు స్థానం ఎక్కడుంది?

పరిష్కారాలు అందుబాటులోనే ఉన్నాయి. మట్టి విగ్రహాలు, సహజ రంగులు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృత్రిమ నిమజ్జన కుండీలు, తక్కువ కాలుష్యం కలిగించే హరిత టపాసులు, సామూహిక దీపోత్సవాలు, నిర్ణీత సమయాల్లోనే వేడుకలు వంటివి ఆనందాన్ని తగ్గించకుండానే నష్టాన్ని తగ్గిస్తాయి. ప్రభుత్వాలు నిబంధనలను కేవలం కాగితాలపై కాకుండా నిజాయతీగా అమలు చేయాలి. అదే సమయంలో మతనాయకులు, సామాజిక సంస్థలు, పౌరులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మార్పుకు నాయకత్వం వహించాలి. మనోభావాలు ఎంత గొప్పవైనా, ఊపిరి ఆగిపోతే వాటికి అర్థం ఉండదు. స్వచ్ఛమైన గాలి, శుభ్రమైన నీరు, ప్రశాంత వాతావరణం అందరి ప్రాథమిక హక్కులు. పండగలను ఆనందంగా జరుపుకుందాం, కానీ మన పిల్లల భవిష్యత్తును పొగలో కలిపేయకుండా. ప్రశ్నించే గొంతులను నొక్కడం కాదు, వాటిని వినడమే నిజమైన సంస్కారం.

---

## మతం లేని కళ - కులం లేని కళాకారుడు
# మహమ్మద్ అక్బర్ పాషా
## ఒక కళాకారుడి కన్నీటి కథ



రంగస్థలంపై రాముడిగా కనిపిస్తే రాముడే అనిపిస్తాడు. కృష్ణుడిగా నిలబడితే కృష్ణుడినే చూస్తాం. హనుమంతుడిగా వస్తే భక్తి ఉప్పొంగుతుంది. అర్జునుడిగా నిలబడితే కురుక్షేత్రం కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. అంతటి అభినయం, వాగ్ధాటి, వేషధారణ, పరకాయ ప్రవేశం కలిగిన కళాకారుడు మహమ్మద్ అక్బర్ పాషా. కానీ ఒక ప్రశ్న మాత్రం మన ముందుంది. ఆయన పోషించిన పాత్రలను మనం చూశాం. ఆయన కళను ఆస్వాదించాం. కానీ ఆ పాత్రల వెనుక ఉన్న మనిషిని ఎప్పుడైనా చూశామా? ఆయన మతం ఏమిటని అడిగాం. కులం ఏమిటని అడిగాం. కానీ ఆయన ఇంట్లో పొయ్యి వెలుగుతోందా? వృద్ధాప్యంలో ఆయనకు భరోసా ఉందా? ఆయన కుటుంబం ఎలా జీవిస్తోంది? అని ప్రశ్నించామా? రంగస్థలంపై వేలాది మందిని అలరించిన కళాకారుడు, జీవిత రంగస్థలంలో కష్టాలతో ఒంటరిగా నిలబడాల్సి వస్తే అది ఒక్క వ్యక్తి విషాదం కాదు. కళాకారుల పట్ల సమాజ బాధ్యతను ప్రశ్నించే సందర్భం.

**దేవుడి వేషం వేసిన ముస్లిం కళాకారుడు**

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబంలో మహమ్మద్ అక్బర్ పాషా జన్మించారు. ఆయన తల్లిదండ్రుల పేర్లు అంకుస్, అమీనాబి అని పేర్కొనబడుతున్నాయి. పాషా చదువు పదో తరగతితో ఆగిపోయిందని, చిన్న వయసులోనే రంగస్థలంపై ఆసక్తి పెంచుకున్నారని చెబుతున్నారు.

1974 నుంచి యక్షగానం, నాటకరంగం ఆయన జీవితంలో భాగమైందని సమాచారం. అల్లీరాణి, అర్జునుడు, రాముడు, కృష్ణుడు, హనుమంతుడు, పుండరీకుడు, సత్యహరిశ్చంద్రుడు, చింతామణి, సతీ సక్కుబాయి, సారంగధరుడు, శివుడు, పార్వతి వంటి అనేక పాత్రలను ఆయన పోషించినట్లు చెబుతున్నారు. పాత్ర ఏదైనా సరే- పాషా దాన్ని కేవలం ధరించలేదు. పాత్రలోకి ప్రవేశించాడు. ప్రేక్షకులు ఆయనను కాకుండా పాత్రనే చూసేంతగా అభినయం ప్రదర్శించడం ఆయన కళా ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు.

**రంగస్థలానికి మతం లేదు**

ముస్లిం కుటుంబంలో పుట్టి హిందూ పురాణ పాత్రలు పోషించడం కొందరికి ఆశ్చర్యంగా అనిపించినా, పాషా తన కళా ప్రయాణాన్ని కొనసాగించారు. ఆయన కళా దృక్పథంలో నాటకానికి మతం లేదు, కళకు కులం లేదు, కళాకారుడి ప్రతిభకు సరిహద్దులు లేవు అనే భావన ప్రధానంగా కనిపిస్తుంది.

రాముడు, కృష్ణుడు, హనుమంతుడు వంటి పాత్రలను పోషించడం ద్వారా ఆయన ఒక ముఖ్యమైన సాంస్కృతిక వాస్తవాన్ని ప్రతిబింబించారు-రంగస్థల కళ పాత్రను మతంతో కాకుండా అభినయంతో చూస్తుంది. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఒక కార్యక్రమంలో రాముడి వేషంలో ప్రత్యేక శకటంపై ఊరేగింపులో పాల్గొన్నట్లు పాషా చెబుతున్నారు. ఈ అంశానికి సంబంధించిన తేదీ, కార్యక్రమం, ఫొటోలు, వీడియోలు లేదా నిర్వాహకుల ఆధారాలు సేకరించి ప్రచురించడం అవసరం.

**కళ కోసం కరిగిపోయిన జీవితం**

పాషా కుటుంబానికి ఒకప్పుడు పది ఎకరాల భూమి ఉండేదని, కుటుంబ అవసరాల కారణంగా ఆ భూమిని అమ్ముకోవాల్సి వచ్చిం దని ఆయన చెబుతున్నట్లు సమాచారం. పిల్లల బాధ్యతలు, కుటుంబ అవసరాలు, చెల్లెళ్ల వివాహాలు వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి దారితీశాయని పేర్కొనబడింది. ఇవన్నీ కుటుంబ సభ్యుల వాంగ్మూ లం లేదా భూ రికార్డులతో నిర్ధారించాల్సిన అంశాలు. మైమునాతో ఆయన వివాహం జరిగిందని, కుటుంబ జీవితంతో పాటు కళా ప్రయాణాన్ని కొనసాగించారని చెబుతున్నారు.

ఆయన కళకు అంకితమైన జీవితం గురించి చెప్పబడే ఒక భావం- "కళామతల్లి ఒడిలోనే కన్నుమూయాలి. ప్రజలకు వినోదంతో పాటు విలువలను అందించాలి. నాటక సమాజమే నా లక్ష్యం. ప్రజలే నా కుటుంబం. విలువలే నా సంపద."-అనేది. ఇది ఆయన ప్రత్యక్ష వాక్యమైతే ఇంటర్వ్యూ లేదా రికార్డుతో ప్రచురించాలి.

**పగలు కష్టజీవి... రాత్రి కళాకారుడు**

పగలు ట్రాక్టర్ డ్రైవర్‌గా, పొలాల్లో కష్టపడు తూ జీవనం సాగించి, రాత్రివేళ రంగ స్థలంపై కళాకారుడిగా మారేవారని చెబుతున్నారు. మేకప్, వేషధారణ, రిహార్సల్స్, డైలాగులు, వేదిక, లైట్ల వెలుగులు, ప్రేక్షకుల చప్పట్లు-ఇవన్నీ ఆయన జీవితంలో భాగమయ్యాయి. లత్కోర్ సాబ్‌గా నవ్వించినా, రాముడిగా భక్తిని రేకెత్తించినా, కృష్ణుడిగా మెప్పించినా, సతీ సక్కుబాయిగా కన్నీళ్లు తెప్పించినా ఆయన తన కళతో ప్రేక్షకుల హృదయాలను తాకినట్లు సహకళాకారులు చెబుతున్నారు. అయితే కళతో పాటు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, జీవన సమస్యలు కూడా ఆయన ప్రయాణంలో ఉన్నాయని తెలుస్తోంది.

**సన్మానం మాత్రమే కాదు... జీవన భరోసా కావాలి**

పాషాకు సన్మానాలు, అవార్డులు, సర్టిఫికెట్లు, శాలువాలు, మెమెంటోలు లభించాయని చెబుతున్నారు. వాటి వివరాలు సంబంధిత ధృవపత్రాలు, ఫొటోలు, వార్తా కథనాలతో నమోదు చేయాల్సి ఉంది. అయితే ఒక కళాకారుడికి శాలువా కప్పడం, మెమెంటో ఇవ్వడం మాత్రమే సరిపోతుందా? బతికున్న కళాకారుడికి బతుకు భరోసా కూడా అవసరం. వృద్ధ కళాకారులకు అర్హత ఆధారంగా పెన్షన్, ఆరోగ్య భద్రత, నిరంతర కళా ప్రదర్శన అవకాశాలు, ప్రయాణ సౌకర్యాలు, కుటుంబానికి అవసరమైన సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలపై కాకుండా అర్హులైన కళాకారుల గడపకు చేరాలి.

**కళాకారుడి కన్నీరు ఒక్క అక్బర్ పాషాదే కాదు**

అక్బర్ పాషా కథ ఒక్క వ్యక్తి కథగా చూడకూడదు. తెలంగాణ జానపద కళా సంప్రదాయాన్ని మోస్తున్న అనేక మంది కళాకారుల జీవన పరిస్థితులను గుర్తు చేసే సందర్భం ఇది. ఒగ్గుకథ, బుర్రకథ, యక్షగానం, చిందు కళలు, డప్పు, కోలాటం, భజనలు, వీధి నాటకాలు, పల్లె భాగోతాలు-ఇవన్నీ తెలంగాణ ప్రజల సాంస్కృతిక జీవితంలో భాగం. జానపదం కేవలం వినోదం కాదు. అది చరిత్ర, సంస్కృతి, పల్లె జ్ఞాపకం, ప్రజల జీవన దర్పణం. కళను కాపాడాలంటే కళాకారుడిని కాపాడాలి.

**భిన్నత్వంలో ఏకత్వానికి ఒక సజీవ ఉదాహరణ**

ముస్లిం కుటుంబంలో పుట్టి రాముడు, కృష్ణుడు, హనుమంతుడు వంటి హిందూ పురాణ పాత్రలను పోషించిన అక్బర్ పాషా కళకు మత గోడలు లేవనే భావనకు ఒక సాంస్కృతిక ఉదాహరణగా నిలుస్తారు. భగవత్ కథలతో పాటు దేశ నాయకుల జీవితాలు, క్విట్ ఇండియా ఉద్యమం, ఏసు ప్రభువు జీవితం, ముస్లిం చరిత్ర వంటి విభిన్న అంశాలను యక్షగాన రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచన ఆయనకు ఉందని చెబుతున్నారు. మతం గోడలు కడితే కళ వేదికలను నిర్మిస్తుంది. మతం మనుషులను విడదీసే సందర్భంలో కళ వారిని కలిపే వంతెనగా నిలుస్తుంది.

**జానపదం అంతరించిపోతే... ఒక చరిత్ర అంతరించిపోతుంది**

ఇలాంటి కళాకారుల జీవితాలను నమోదు చేయాలి. వారి కళను డాక్యుమెంట్ చేయాలి. యువతరానికి వారి అనుభవాలను అందించాలి. వృద్ధాప్యంలో కళాకారులు గౌరవంగా జీవించేలా సామాజిక భద్రత కల్పించాలి. సన్మానం చనిపోయిన తర్వాత కాదు-బతికున్నప్పుడే ఉండాలి. శాలువా, మెమెంటో, అవార్డు గౌరవానికి గుర్తులు కావచ్చు. కానీ కళాకారుడి జీవితానికి అవసరమైనది జీవన భరోసా.

**అక్బర్ పాషా వంటి కళాకారులు మనకు ఒక ప్రశ్నను ముందుకు తెస్తున్నారు:**

రంగస్థలంపై వెలుగులు విరజిమ్మే ముందు, ఆ వెలుగుల వెనుక నిలబడి ఉన్న కళాకారుడి జీవితంలో కూడా వెలుగు నింపుతున్నామా? కళకు మతం లేదు. కళాకారుడి ప్రతిభకు కులం లేదు. కళకు సరిహద్దులు లేవు. కానీ కళాకారుడి జీవితానికి మాత్రం సమాజం బాధ్యత ఉంది. మహమ్మద్ అక్బర్ పాషా కథ ఒక కళాకారుడి కన్నీటి కథ మాత్రమే కాదు. మన సమాజం కళను ఎలా చూస్తోంది, కళాకారుడిని ఎలా ఆదరిస్తోంది అనే విషయానికి ఒక అద్దం. కళను కాపాడుదాం. కళాకారుడిని కాపాడుదాం. జానపద సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందిద్దాం.



వ్యాసరచన:
మాలోతు సాగర్
సామాజిక వేత్త, సెల్: 7013805411

---

## అంతా రాజకీయ డ్రామాలే...
# గాంధీజీ మళ్లీ రావయ్యా!



**సత్యం లేని చదువు.. ప్రేమ లేని ఇల్లు.. ధర్మం లేని రాజకీయం ఉన్నంతకాలం సమాజానికి శాంతి ఎక్కడ?**

నేడు అక్టోబర్ 2. దేశం గాంధీ జయంతిని జరుపుకుంటోంది. ప్రతి కూడలిలో విగ్రహానికి పూలమాల.. కార్యాలయాల్లో చిత్రపటానికి నివాళి.. సభల్లో సత్యం, అహింస, స్వచ్ఛతపై ప్రసంగాలు. ఈ రోజును ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింసా దినంగా గుర్తించింది. కానీ మరుసటి రోజే మళ్లీ అదే కోపం.. అదే పోటీ.. అదే మోసం.. అదే అవినీతి.. అదే కుటుంబ కలహాలు.. అదే రాజకీయ ఆరోపణలు. గాంధీని విగ్రహంలో పెట్టుకున్నామా? గుండెల్లో పెట్టుకున్నామా? గాంధీకి సత్యం ప్రసంగ పదం కాదు.. జీవిత ప్రయోగం. సత్యాగ్రహం అంటే తప్పు ముందు తలవంచకుండా నిలబడే నైతిక ధైర్యం. అహింస అంటే ఎదుటివాడిని కొట్టకపోవడమే కాదు.. ఎదుటివాడిలోనూ మనిషిని చూడడం. విగ్రహం ముందు తలవంచడం సులువు.. మన తప్పు ముందు తలవంచడం కష్టం.

చదువు పెరిగింది.. మనిషి పెరిగాడా? నేటి విద్యార్థి చేతిలో ప్రపంచ జ్ఞానం ఉంది. ఫోన్‌లో పాఠాలు.. వీడియోల్లో ప్రయోగాలు.. ఏఐతో క్షణాల్లో సమాచారం. కానీ ఈ జ్ఞానం మంచి మనిషిని తయారు చేస్తోందా? మార్కులు, ర్యాంకులు, ఉద్యోగం కోసం మాత్రమే చదువు అయితే ఏదో కోల్పోయినట్టే. గాంధీ నయీ తాలీమ్ విద్యను అక్షరజ్ఞానంతో ఆపలేదు; పని, నైపుణ్యం, బాధ్యత, వ్యక్తిత్వ వికాసంతో అనుసంధానించింది. పిల్లలకు కోడింగ్ నేర్పుతున్నాం.. కరుణ నేర్పుతున్నామా? గెలవడం నేర్పుతున్నాం.. ఓడినవాడిని గౌరవించడం నేర్పుతున్నామా? ఫోన్ శత్రువు కాదు.. కానీ ఫోన్ మనిషికి యజమాని కాకూడదు. పిల్లల చేతిలో ఫోన్ పెట్టి బాధ్యత పూర్తయిందనుకోవడం పొరపాటు. వారి పక్కన కూర్చొని ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏదైనా ఇబ్బంది ఉందా? అని అడగాలి.

గోరుముద్దకు చందమామ పోయింది.. ఫోన్ వచ్చింది. ఒకప్పుడు తల్లి చందమామ చూపిస్తూ తినిపించేది. ఇప్పుడు వీడియో చూపిస్తూ తినిపిస్తోంది. సౌకర్యం పెరిగింది.. సంభాషణ తగ్గింది. గోరుముద్ద స్థానంలో గూగుల్ ముద్ద వస్తే కడుపు నిండొచ్చు.. మనసు నిండుతుందా? పిల్లాడికి బొమ్మ, ఫీజు, ఫోన్ కొనివ్వడం సులువు. కానీ పక్కన కూర్చొని అరగంట మనసు విప్పి మాట్లాడటం కష్టం. పిల్లలకు వస్తువుల కంటే తల్లిదండ్రుల సమయం అవసరం. ప్రేమ పేరుతో ప్రతి తప్పును కప్పిపుచ్చడం ప్రేమ కాదు; అర్థమయ్యేలా చెప్పి సరిదిద్దడం నిజమైన ప్రేమ. కుటుంబం మాట్లాడటం మానేసిన చోట ఒంటరితనం పెరుగుతుంది. పక్కింట్లో గొడవ జరిగితే తలుపు మూసుకోవడం.. రోడ్డుపై అన్యాయం కనిపిస్తే వీడియో తీసి వెళ్లిపోవడం.. "మనకెందుకులే?" అనడం మన నిర్లిప్తతకు అద్దం. ప్రతి సంఘటనలో మనమే పోలీసులం కావాల్సిన అవసరం లేదు. కానీ బాధితుడికి చట్టబద్ధంగా అండగా నిలవచ్చు. అదే సత్యాగ్రహం యొక్క నేటి అర్థం. రాజకీయాల్లో మాటలు ఎక్కువ.. బాధ్యత ఎంత? ప్రజాస్వామ్యంలో అధికారపక్షం పాలనకు జవాబు చెప్పాలి. ప్రతిపక్షం ఆధారాలతో ప్రశ్నించాలి. సభలు ప్రజా సమస్యల చర్చకు వేదికలు కావాలి. ప్రజల సొమ్ము ఎలా ఖర్చవుతోంది? పథకం ఎందుకు ఆలస్యమైంది? పని నాణ్యత ఎలా ఉంది? అనే ప్రశ్నలకు సమాధా నాలు కావాలి. అవినీతి, భూకబ్జాలు, కల్తీ వ్యాపారాలు, పోలీసు పైరవీలు, సెటిల్మెం ట్లు రాజకీయ పలుకుబడితో నడుస్తున్నా యనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోపణ వస్తే విచారణ జరగాలి. ఆధారం ఉంటే చట్టం తన పని తాను చేయాలి. ఆధారం లేకుండా ఎవరినీ నేరస్తుడిగా ముద్ర వేయకూడదు. వ్యక్తి ఎవరు అన్నది కాదు.. నిజం ఏమిటన్నదే ముఖ్యం. పదవి శాశ్వతం కాదు.. అధికారం ప్రజల నుంచి వచ్చే తాత్కాలిక బాధ్యత. ఓటు ఒకరోజు లావాదేవీ కాదు.. ఐదేళ్ల బాధ్యత. కులం, పార్టీ, వ్యక్తిగత అభిమానం దాటి పనితీరు, పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రశ్నించే పౌర సంస్కృతి కావాలి.

అభివృద్ధి కావాలి. కానీ అభివృద్ధి పేరుతో ప్రకృతిని కోల్పోతే ఆ అభివృద్ధి ఎవరి కోసం? చెట్టు నరికితే నీడ, గాలి, పక్షుల గూడు మాత్రమే కాదు.. భవిష్యత్తు తరానికి ఒక సంపద తగ్గుతుంది. భూమి మన ఆస్తి కావచ్చు.. కానీ భవిష్యత్తు తరాల ముందు బాధ్యత కూడా. నీరు, నేల, గాలి, చెట్లు మన తరువాత కూడా ఉండాలి. "గాంధీజీ మళ్లీ రావయ్యా!" అని పిలవడం సులువు. కానీ ఆయన మళ్లీ ఎందుకు రావాలి? మనం చేయాల్సిన పని మనం చేయకపోవడానికా? విద్యార్థిలో సత్యం పుడితే ఒక అబద్ధం తగ్గుతుంది. తల్లిదండ్రిలో బాధ్యత పుడితే ఒక కుటుంబం బలపడుతుంది. సమాజంలో స్పందన పుడితే బాధితుడికి అండ లభిస్తుంది. రాజకీయంలో జవాబుదారీతనం పెరిగితే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రకృతిపై బాధ్యత పెరిగితే రేపటి తరానికి ఊపిరి మిగులుతుంది.

ఈ గాంధీ జయంతికి పెద్ద ప్రతిజ్ఞలు అవసరం లేదు. ఐదు చిన్న మార్పులు చాలు. అవసరం వచ్చినా అబద్ధం చెప్పకూడదు. మనవాడు తప్పు చేసినా తప్పు అని చెప్పాలి. పిల్లల ముందు మనమే ఆదర్శంగా ఉండాలి. ఓటును అమ్ముకోకూడదు. ప్రకృతిని మన ఆస్తిగా కాక బాధ్యతగా చూడాలి. రేపు విగ్రహాలపై పడే పూలు సాయంత్రానికి వాడిపోతాయి. కానీ మన ఇంట్లో ఒక నిజం పుడితే? పిల్లవాడితో ఇరవై నిమిషాలు ఫోన్ పక్కన పెట్టి మాట్లాడితే? ఒక అన్యాయాన్ని చట్టబద్ధంగా ప్రశ్నిస్తే? ఒక మొక్క నాటి దాన్ని పెంచితే? ఒక ఓటును నిజాయితీగా వినియోగిస్తే? అప్పుడు గాంధీ జయంతి క్యాలెండర్‌లోని తేదీ కాదు.. మన జీవితంలో ఒక మార్పు. గాంధీ కళ్లజోడులో మన ముఖం కనిపించాలి. ఆ ముఖంలో సత్యం.. ఆ ఇంట్లో ప్రేమ.. ఆ సమాజంలో బాధ్యత.. ఆ రాజకీయంలో ధర్మం.. ఆ అభివృద్ధిలో ప్రకృతికి స్థానం ఉండాలి. అప్పుడు గాంధీజీ మళ్లీ పుట్టాల్సిన పనిలేదు. మనలోని గాంధీయే లేస్తాడు.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9133947176

---

## నక్సలైట్ ఉద్యమం ముగింపే..
# జేన్ జీ ఉద్యమానికి పునాది



భారతదేశ చరిత్ర అనేది రాజులు, రాజ్యాలు, యుద్ధాల చరిత్ర మాత్రమే కాదు. సామాజిక అసమానతలు, భూస్వామ్య ఆధిపత్యం, కుల వివక్ష, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల చరిత్ర. ఈ చరిత్రలో నక్సలైట్ ఉద్యమం కూడా ఒక కీలక అధ్యాయంగా నిలిచింది. భూమి, శ్రమ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి ఆశలను ముందుకు తెచ్చిన ఈ ఉద్యమం దశాబ్దాల పాటు భారత సామాజిక, రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. అయితే దాని ప్రయాణంలో అణగారిన వర్గాల ఆకాంక్షలు, యువత పాత్ర, నాయకత్వ స్వరూపంపై అనేక ప్రశ్నలు కూడా ఉత్పన్నమయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం ఈ ఉద్యమం అగ్రకుల నాయకత్వం--అట్టడుగు వర్గాల భాగస్వామ్యంతో నడవడమే అని విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు. నక్సలైట్ ఉద్యమాన్ని అంతమొందించడానికి కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్ ' తో ఆ ఉద్యమంలోని డొల్లతనం బయటపడింది. ఈ ఆపరేషన్ లో అగ్రకుల నక్సలైట్ నాయకత్వం సరెండర్ అయితే అణగారిన హిడ్మా వంటి ఎంతోమంది దళిత, బహుజనులు బలిపీఠమెక్కారు. ఈ నేపథ్యంలో ఇదొక కుట్రపూరిత ఉద్యమం అని మేధావులు విశ్లేషిస్తున్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ద్వారా నక్సలైట్ ఉద్యమం 2026 మార్చి 31 నాటికి అంతమొందించారు. అంతమైన కొన్ని రోజులకు జేన్ జీ పోరాటం నీట్ ఉద్యమం రూపంలో జూన్ 6 నుంచి బయలుదేరింది. ఇప్పుడు నిర్భయంగా బీసీ ఎస్సీ ఎస్టీలు మరియు ప్రజాస్వామ్య అగ్రవర్ణ యువత ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నారు.

**నక్సలైట్ ఉద్యమం పతనంతో బయటకొచ్చిన జేన్ జీ**

దశాబ్దాల నక్సలైట్ ఉద్యమం ముగియడంతో ఆధునిక జెన్ జీ ప్రజాస్వామ్య తిరుగుబాటు మొదలైంది. 2026 మే15న భారత ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతపై 'కాక్రోచ్', 'పరాన్నజీవులు' అనే వ్యాఖ్యలు చేశారు. అనంతరం అభిజిత్ దీప్కే నాయకత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) అనే డిజిటల్ ఉద్యమం వేగంగా వెలుగులోకి వచ్చింది. ఇదీ జెన్ జీ యువతలో ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామ్య చైతన్యాన్ని, వ్యవస్థను జవాబుదారిగా నిలబెట్టాలనే ఆకాంక్షను ముందుకు తీసుకెళ్లింది. అయితే ఈ జేన్ జీ ఉద్యమం ఆవిర్భావాన్ని కేవలం ఆ న్యాయమూర్తి వ్యాఖ్యకు పరిమితం చేయలేం. ఇప్పటికే దేశం ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక , రాజకీయ సమస్యలు , యువతలో పెరుగుతున్న ఆగ్రహం వంటి దీర్ఘకాలిక పరిస్థితులే ఈ చైతన్యానికి పునాది వేశాయి. ఈ పోరాటంలో బీసీ-ఎస్సీ-ఎస్టీలు, ప్రజాస్వామ్య అగ్రవర్ణ యువత తమ హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం, ప్రాతినిధ్యం కోసం సంఘటితం అయ్యారు. ఈ కొత్త చైతన్యం విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలనే ప్రశ్నలను ప్రజా వేదికలపై పెట్టింది. దాదాపు 22 లక్షలకుపైగా విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ వివాదంపై జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలు విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకతపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఇదే సమయంలో "స్కూల్ టీక్ కరో" వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రభుత్వాలను కదిలిస్తున్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కు, ఎన్నికల కమిషన్, సర్ ప్రక్రియపై సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జెన్ జీ పోరాటం తీవ్రరూపం దాల్చుతుంది. తెలంగాణలో ఈ సమకాలీన చైతన్యానికి బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ , అదే విధంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, మాజీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య వంటి నాయకులు పునాది వేస్తున్నారు. "ఎవరి కులం ఎంతో వారికంత వాటా" అనే సామాజిక న్యాయ ఎజెండా కోసం సాగుతున్న వారి పోరాటం పూలే, అంబేడ్కర్, కాన్షీరాం సామాజిక, రాజకీయ చైతన్యానికి కొనసాగింపు.

**సామాజిక న్యాయం కోసం జేన్ జీ పోరాటం**

మెజార్టీ బీసీ ఎస్సీ ఎస్టీ యువత నక్సలైట్ ఉద్యమం వల్ల విముక్తి లభిస్తుందని భ్రమపడ్డారు. కానీ ఆ ఉద్యమంలో చేరినవారు రాత్రింబవళ్లు అడవుల్లో భయం భయంగానే బ్రతికారు. వారి తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు కూడా భయంగానే జీవించారు. మరోవైపు సమాజంలో అరాచకాలు, అన్యాయాలను ఎదిరించడానికి యువత కూడా భయపడ్డారు. ఎందుకంటే నక్సలైట్ అనే ముద్ర వేస్తారని వెనకడుగు వేశారు. అంతిమంగా బీసీ ఎస్సీ ఎస్టీలు భయం భయంగానే జీవించారు. నక్సలైట్ ఉద్యమం వల్ల అగ్రకులాలు మాత్రమే నిర్భయంగా ఉన్నారు. వారికే మేలు జరిగింది. ఎందుకంటే వారి అన్యాయాలను, అరాచకాలను ప్రశ్నించిన బీసీ-ఎస్సీ-ఎస్టీ యువత, విద్యార్థులు, మేధావులపై "నక్సలైట్", "అర్బన్ నక్సలైట్" వంటి ముద్రలు వేసి అడవుల్లోకి పంపించారు. కానీ బీసీ ఎస్సీ ఎస్టీలకే మేలు జరిగిందని అబద్ధపు ప్రచారం చేశారు. ఫలితంగా సామాజిక న్యాయం, సామాజిక మార్పు కోసం ఉప్పొంగిన ఆ యువశక్తి హింసాత్మక సంఘర్షణల మధ్య తన సామర్థ్యం నిర్వీర్యమైపోయింది. స్వేచ్ఛగా బయటకు రాలేకపోయారు. ఇప్పుడు నక్సలైట్ ఉద్యమం అంతం కావడంతో యువశక్తి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, విద్య, ఓటు హక్కు, ప్రాతినిధ్యం కోసం భయం లేకుండా రోడ్డెక్కుతున్నారు. తమ భవిష్యత్తు గురించి స్వేచ్ఛగా మాట్లాడుతోంది. భారత రాజ్యాంగమే భావజాలంగా, సామాజిక న్యాయమే లక్ష్యంగా, ఐక్యతే ఆయుధంగా జెన్‌జీ తరం కొత్త ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మిస్తోంది. కావున నేటి జెన్‌జీ ఉద్యమంను యువత పోరాటంగా చూడడం కాదు, ఈ యువశక్తినీ నిజమైన, నికార్సైన సామాజిక చైతన్యానికి ప్రతీకగా చూడాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేయాలనే ఆకాంక్ష, మండల్ కమిషన్ సామాజిక న్యాయ ఉద్యమం కొనసాగింపుగా ఇది కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. అందుకే దీనిని సామాజిక న్యాయ పోరాటంలో నవ నూతన విప్లవ దశగా చూడవచ్చు.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# కాలుష్య నివారణపై క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు

- ఫలితాల ఆధారిత విధానంతో పనిచేయాలి
- టీజీపీసీబీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాలుష్య నియంత్రణతో పాటు కాలుష్య నివారణకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ పరిరక్షణ చర్యలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి లక్కడి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేసి, కాలుష్యానికి దారితీసే కార్యకలాపాలను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మెంబర్ సెక్రటరీ రవి ఆధ్వర్యంలో రెండు జోనల్, పది రీజినల్ కార్యాలయాల అధికారులు, డివిజనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన తొలి సమీక్ష కావడంతో రాష్ట్రవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.
వాయు, నీరు, శబ్ద కాలుష్యంతో పాటు పారిశ్రామిక ఉద్గారాలు, వ్యర్థజలాల శుద్ధి, ఈటీపీ, ఎస్టీపీ వ్యవస్థల నిర్వహణ, నీటి నాణ్యత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు పర్యావరణ ప్రమాణాలు, అనుమతులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఫలితాల ఆధారిత కార్యాచరణ విధానాన్ని అనుసరించాలని సూచించారు.
ప్రధాన కార్యాలయం, రీజినల్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత సమస్యను అధికారులు చైర్మన్ దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే కాలుష్య ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడంతో పాటు గాలి, నీరు, పారిశ్రామిక ఉద్గారాల మానిటరింగ్ డేటాను శాస్త్రీయంగా విశ్లేషించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం రీజియన్ల వారీగా పరిశ్రమల అనుమతుల స్థితిగతులపై మెంబర్ సెక్రటరీ రవి అధికారులతో సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మురుగునీటి, పారిశ్రామిక వ్యర్థ ద్రవాలు, ప్రమాదకర వ్యర్థాల నిల్వ ట్యాంకులను సీజ్ చేయాలని ఆదేశించారు. పరిశ్రమలు, స్థానిక సంస్థలు, సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పర్యావరణ పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.
సమావేశంలో చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రఘు, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శకుంతల, హైదరాబాద్, రామచంద్రాపురం జోనల్ కార్యాలయాల అధికారులు, జోనల్ లేబొరేటరీ అధికారులు, రీజినల్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అల్మాస్ కుంటపై హైడ్రా దృష్టి సారించాలి

- కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో పరిదిలోని అల్మాస్ కుంట అభివృద్ధి,పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అల్మాస్ కుంట చెరువు స్థానిక ప్రజలకు కీలక జలవనరుగా ఉందన్నారు. చెరువును అభివృద్ధి చేయడంతో పాటు పరిసర ప్రాంతాలను సుందరీకరించి,కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెరువు పరిధిలో ఆక్రమణలు, మురుగునీటి సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పరిష్కరించాలని, చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హల్మాస్ కుంట చెరువు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, పుల్లకండ్ల జంగా రెడ్డి, పుల్లకండ్ల వెంకట్ రెడ్డి, పుల్లకండ్ల రాజి రెడ్డి, సింగిరెడ్డి రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిఫ్లెక్టర్ల పేరిట దోపిడీ ఆపాలి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** వాణిజ్య వాహనాల సామర్థ్య ధ్రువీకరణ పత్రం కొరకు అవసరమైన రేడియం రిఫ్లెక్టర్ స్టిక్కర్ల పేరుతో లారీ యజమానుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేయడాన్ని వెంటనే అరికట్టాలని తెలంగాణ లారీ యజమానుల సంఘం, ఐ.ఎన్.టి.యు.సి. రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సాధారణంగా మార్కెట్‌లో వెయ్యి రూపాయల లోపు లభించే రిఫ్లెక్టర్ స్టిక్కర్లకు నిర్ణీత విక్రేతలు ఐదు వేల నుండి పది వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకే నిర్దిష్ట విక్రేత వద్దనే స్టిక్కర్లు కొనుగోలు చేయాలనే నిబంధనకు సంబంధించిన అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులు, ప్రకటనలు లేదా నిబంధనల పత్రం ఏదైనా ఉంటే దానిని వెంటనే రవాణా శాఖ బహిర్గతం చేయాలని కోరారు. విక్రేతలు వసూలు చేస్తున్న అధిక ధరలను ప్రభుత్వం ఆమోదించిందో లేదో స్పష్టం చేయాలన్నారు. మార్కెట్‌లో రూ. 55 ఉండే 20 మిమీ రిఫ్లెక్టర్ మీటర్‌ను విక్రేతలు రూ. 85కి, రూ. 1,200 ఉండే సి3 రకం జతను రూ. 2,600కి అమ్ముతున్నారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న రిఫ్లెక్టర్లను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని, ఇప్పటికే పన్నులు, ఇంధన ధరలతో నష్టపోతున్న చిన్న లారీ యజమానులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి స్పష్టమైన ధరల పట్టికను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ చంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల చేతిలో కాంగ్రెస్ పార్టీకి పరాభవమే..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల చేతిలో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత , నిరుద్యోగులు , ఉద్యోగులు , విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి యేడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పట్టుమని పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ను అసెంబ్లీలో ప్రకటించి కూడా అమలు చేయలేదని విమర్శించారు. నెలకు నాలుగు వేల నిరుద్యోగ భృతి హామీని కూడా కాంగ్రెస్ గాలికి వదిలేసిందని అన్నారు. తెలంగాణలో ఉద్యోగాల నోటిఫికేషన్లు వద్దని నిరుద్యోగులు ధర్నాలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రకటించి నిరుద్యోగులను అవమానించారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి గద్దెనెక్కి మోసం చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఆరు డీఏలను పెండింగులో పెట్టారని చెప్పారు. పీఆర్సీ, ఓపీఎస్, సిహెచ్ఎస్ లు ఎండమావిగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు తొమ్మిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి అవస్థలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ ముందుంటుందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి , దండెం రాంరెడ్డి , మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి , మాజీ ఎంపిపిలు కృపేష్ , నర్మద , మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు , కిషన్ గౌడ్ , రమేష్ గౌడ్ , చీరాల రమేష్ , మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య , అల్వాల్ వెంకట్ రెడ్డి , కళ్యాణ్ నాయక్ , బలరాం , సీనియర్ నాయకులు బూడిద రాంరెడ్డి , కందాడి లక్ష్మారెడ్డి , చిన్నయ్య , రాజు , జగదీష్ , అంజిరెడ్డి , రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో షాపింగ్ సందడి

- రష్మి గౌతమ్‌తో మాంగళ్య ఎగ్జిబిషన్ ప్రారంభం
- పళని కన్వెన్షన్‌లో మెగా షాపింగ్ జాతర..18 రోజుల పాటు సందడి
- ఒకేచోట వేలాది ఉత్పత్తులు..మాంగళ్య ఎగ్జిబిషన్‌కు ఘన శ్రీకారం
- రష్మి గౌతమ్ రాకతో కళకళలాడిన మాంగళ్య షాపింగ్ ఎగ్జిబిషన్



**బోడుప్పల్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లో ఉన్న పళని కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్ మెగా ఎగ్జిబిషన్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీ నటి,టెలివిజన్ వ్యాఖ్యాత రష్మి గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు నమశివాయతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె వివిధ స్టాల్స్‌ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రష్మి గౌతమ్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఒకే వేదికపై నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందించే ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఎగ్జిబిషన్‌లో మహిళలు, యువత, పిల్లలు, కుటుంబ సభ్యుల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలు,డిజైనర్ చీరలు, రెడీమేడ్ దుస్తులు తదితర విభాగాలకు చెందిన వందలాది స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక తగ్గింపు ధరలు,పండుగ ఆఫర్లు, ఆకర్షణీయమైన కొనుగోలు పథకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌ను 18 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపార సంస్థలు,ప్రముఖ బ్రాండ్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన షాపింగ్ అనుభూతిని కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు,అభిమానులు,వ్యాపారవేత్తలు,నిర్వాహకులు హాజరయ్యారు. రష్మీ గౌతమ్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపగా ఎగ్జిబిషన్ ప్రాంగణం సందర్శకులతో కిక్కిరిసిపోయింది.

# బతుకమ్మకు తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు

- ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం గర్వకారణం
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అమీర్పేట్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపు లభించిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సనత్‌నగర్ జేకే కాలనీ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను కలిసి, ఈ నెల 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజులపాటు మహిళలు బతుకమ్మను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. తెలంగాణలో పుట్టిన బతుకమ్మ పండుగను నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రధాన కూడళ్లలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ప్రభారెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు భాగ్యలత, అమరావతి, సృజన, హైమవతి తదితరులు పాల్గొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ హైదర్‌బస్తీలో గురువారం నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. బస్తీలోని దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, దర్గా కమిటీ సభ్యులు మౌలా బేగ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా అక్రమాలపై అఖిలపక్షం ఆగ్రహం

- కలెక్టరేట్ ముట్టడి, భారీ ధర్నా




**గద్వాల, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ, ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ జోగులాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అఖిలపక్ష నాయకులు వైఎస్సార్ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి అఖిలపక్ష నాయకులు, డీసీసీ అధ్యక్షుడు మలిచేటి రాజీవ్ రెడ్డి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అర్హులైన వేలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుండి అన్యాయంగా తొలగించారని మండిపడ్డారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలు తమ ప్రాథమిక ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ధర్నా ఉధృతం కావడంతో కలెక్టరేట్ ఉన్నతాధికారుల నిరసనకారుల వద్దకు వచ్చి మాట్లాడారు. తక్షణమే క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారుల ద్వారా పునఃపరిశీలన జరిపి, సాంకేతిక లోపాలను సరిచేస్తామని, అన్యాయంగా తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను చట్టప్రకారం పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అఖిలపక్ష నాయకులు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. డిమాండ్లు నెరవేరకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- అమీర్‌పేట్‌లో కాంగ్రెస్ ర్యాలీ.. దిష్టిబొమ్మ దహనం




**అమీర్‌పేట్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అమీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేట్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టి 'దేశ్ కో బచావో.. జ్ఞానేశ్ కుమార్ హటావో' అంటూ నినాదాలు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ కూడా ఇటీవల హైదరాబాద్‌లో ూ×=పై నిరసన నిర్వహించి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తమ నాయకురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఓటు హక్కు ప్రతి భారతీయుడి ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం దారుణమని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించకుండా ఇతర ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని వారు ఆరోపించారు. ఎన్నికల సంఘం తీరుపై తమ నిరసనలను కొనసాగిస్తామని తెలిపారు. ూ×=పై కాంగ్రెస్ పలు ఆరోపణలు చేస్తుండగా, ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు చట్టబద్ధమైన ప్రక్రియలోనే జరుగుతున్నాయని పేర్కొంది.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- సమగ్ర విచారణ జరిపించాలి
- అవినీతి నిర్మూలన యుద్ధ సంఘం
- జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ తీరుపై ఆగ్రహం

**ముషీరాబాద్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు, లోతైన సెల్లార్ తవ్వకాలపై తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణ చేపట్టాలని సొసైటీ ఫర్ టూ సైడ్ ఎగైనెస్ట్ కరప్షన్ (అవినీతి నిర్మూలన యుద్ధ సంఘం) ప్రతినిధులు, పౌర సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్ లో సొసైటీ ఫర్ టూ సైడ్ ఎగైనెస్ట్ కరప్షన్ (అవినీతి నిర్మూలన యుద్ధ సంఘం) ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఈ నిరసనకు మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎల్. గిరిజా శంకర్, అంబేద్కర్ సేన సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ..అక్రమ నిర్మాణాల కారణంగా సమీపంలోని నివాస గృహాలు, రోడ్లు, ఇతర మౌలిక వసతులకు ముప్పు ఏర్పడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు, నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు సమర్థవంతంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న లోతైన సెల్లార్ తవ్వకాలు సమీప భవనాల భద్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పరిసరాల్లో జరుగుతున్న అనధికార నిర్మాణాలపై ప్రజలు ప్రశ్నించాలని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### సమగ్ర విచారణ చేపట్టాలి

మున్సిపల్ నిబంధనల అమలులో వైఫల్యాలకు వ్యవస్థాగత అవినీతి కూడా కారణమవుతోందని అవినీతి నిర్మూలన యుద్ధ సంఘం, పౌర సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యం, నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలను పట్టించుకోకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు, అనధికార సెల్లార్లకు అడ్డుకట్ట వేసే వరకు ప్రజలు, పౌర సంఘాలతో కలిసి పోరాటాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బి. శివకాంత్, ఉపాధ్యక్షుడు జి. విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి ఎం. పురుషోత్తం,కోశాధికారి జి. శ్రీధర్, సంయుక్త కార్యదర్శి ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా లోతైన సెల్లార్ తవ్వకాలు, దట్టంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల చిత్రాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు.



# మెదక్ అభివృద్ధికి కొత్త దిశ

- ప్రజల కలలను సాకారం చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



**మెదక్ టౌన్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మెదక్ పట్టణ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా పనులను ముందుకు తీసుకెళ్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏళ్లుగా ప్రజలు కోరుకుంటున్న మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. "మెదక్ ప్రజలు అభివృద్ధి అంటే ఏమిటో కళ్లారా చూడాలి. అభివృద్ధి కాగితాలపై ఉండకూడదు.. అది రోడ్లపై కనిపించాలి, డ్రైనేజీ వ్యవస్థలో కనిపించాలి, ప్రధాన కూడళ్ల రూపంలో కనిపించాలి, ప్రజలకు అందుతున్న మౌలిక వసతుల్లో కనిపించాలి. అదే మా లక్ష్యం" అని రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ప్రధాన కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణతో పాటు ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మేజర్ ధ్యాన్‌చంద్ వంటి మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించేలా ఈ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. "విగ్రహాలు ఏర్పాటు చేయడం మాత్రమే మా ఉద్దేశం కాదు. ఆయా మహనీయుల ఆలోచనలు, సేవలు, త్యాగాలు, స్ఫూర్తి ప్రజలకు మరియు భావితరాలకు గుర్తుండేలా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే మా ఆలోచన" అని ఎమ్మెల్యే తెలిపారు. మెదక్ పట్టణంతో పాటు రామాయంపేట ప్రాంత అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీ, జంక్షన్లు, సుందరీకరణ, ఇతర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. "ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా బాధ్యత. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తాం. ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతూ, ఒక్కో ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతాం" అని రోహిత్ రావు స్పష్టం చేశారు. మెదక్‌ను కేవలం ఒక సాధారణ పట్టణంగా కాకుండా అందమైన, ఆధునిక, సౌకర్యవంతమైన మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మెదక్‌కు కొత్త రూపం తీసుకురావాలి. పట్టణంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ అభివృద్ధి స్పష్టంగా కనిపించేలా చేయాలి. ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మార్పు ఇప్పుడు ఒక్కొక్కటిగా ఆచరణలోకి వస్తోంది. ఈ అభివృద్ధి ప్రయాణం ఇక్కడితో ఆగదు.. మెదక్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు కొనసాగుతుంది" అని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుతో పాటు మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌లు, టౌన్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, మైనారిటీ టౌన్ అధ్యక్షుడు మహ్మద్ ఫాజిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

- ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులు బాధ్యతగా తమ ఓటును నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఆర్‌డీఓ సుబ్రమణ్యంకు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 2023 నాటికి ఏదైనా యూనివర్సిటీ నుంచి పట్టభద్రులైన వారు ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. ఓటరు నమోదుకు 2026 నవంబర్ 6 తుది గడువు ఉన్నందున అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, గౌడ్ నాయక్, స్టార్ రహీం, సయ్యద్ జమీల్, మంద రాము తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యలను పరిష్కరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు వినతి
- దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్



**ఖిల్లా ఘనపురం, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలసిన దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్ జిల్లా వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం రవి నాయక్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు అదనపు సౌకర్యాలు కల్పించడంతో పాటు కేంద్ర నిధులు కేటాయించి పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను ప్రతి తండాలో ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో గిరిజన భవనాలు నిర్మించాలని, గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను కోరినట్లు రవి నాయక్ తెలిపారు.

# రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలి

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** సమాజంలోని పేదలు, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రధాన కార్యాలయంలో సోషల్ జస్టిస్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్ సహా కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయం చిన్నదిగా, ఇరుకుగా ఉండటంతో సేవల విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక డయాగ్నోస్టిక్ సేవలతో కూడిన నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల దృష్ట్యా పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, నామమాత్రపు ఖర్చుతోనే అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్స అందేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రెడ్‌క్రాస్ వంటి సంస్థల సేవలను విస్తరించడానికి రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ భాగస్వామ్యం, విరాళాల ద్వారానే వేలాది మంది పేదలకు సహాయం అందించవచ్చన్నారు. అలాగే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళా మరియు శిశు సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. రెడ్‌క్రాస్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె ఎస్ రవికుమార్, వైస్ చైర్మన్ రామకృష్ణయ్య, , ట్రెజరర్ జి .రమణయ్య తో పాటు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హుమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి దివ్య జ్యోతి, మాజీ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్,వివిధ ప్రజా సంఘాల నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## సార్ ప్రక్రియను రద్దు చేయాలి

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ చేయాలి
- వామపక్షాల ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ నిరసన
- అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి




**సంగారెడ్డి, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని తొలగించిన 13 కోట్ల ఓటర్లను చేర్చాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం, సిపిఐఎంబి కాంగ్రెస్ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు అనంతరం జిల్లా కలెక్టర్ ఏవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా మార్చుకునే విధంగా ఉందని అన్నారు ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని తొలగించిన 13 కోట్ల ఓటర్ ఓటర్ జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, బీరం మల్లేశం, అతిమెల మాణిక్యం, అశోక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్, సిపిఐ నాయకుడు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**రాజాపూర్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** రాజాపూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో రైతులకు అవసరమైన 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయడంతో పాటు, రైతుల అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తున్నామని చెప్పారు.రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణా, అక్రమ ఇసుక కార్యకలాపాలు పెద్దఎత్తున జరిగాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా పారదర్శక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై తమ ప్రభుత్వ హయాంలో కేసుల నమోదు విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.బీఆర్ఎస్ నాయకులు అక్రమ సంపాదన కోసం రాజకీయాలు చేస్తే.. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు చంద్రశేఖర్ , నవీన్ , వెంకటేష్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, రాజాపూర్ సర్పంచ్ రామాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సుజన్ చంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి, గోపినాథ్,రమణ,రమేష్, దొండ్లపల్లి గిరిగౌడ్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీజేపీ ప్రత్యేక దృష్టి



**వనపర్తి, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ పిలుపునిచ్చారు. గురువారం వనపర్తిలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలు, సేవా జ్యోతి యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ నవంబర్ 6 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి శక్తి కేంద్రం పరిధిలోని నాలుగు, ఐదు పోలింగ్ బూత్‌లలో అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో కిలోమీటరు మేర కాగడాల యాత్ర నిర్వహించాలని, ఉదయం 11 గంటలకు దేశవ్యాప్తంగా 747 జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మున్నూరు రవీందర్, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, కేతూరి బుడ్డన్న, అనుజ్ఞ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పనతో పాటు పలువురు పార్టీ నాయకులు, మోర్చాల ప్రతినిధులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## మెదక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస వసతులు కరువు



**మెదక్ టౌన్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నిత్యం భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అయితే కార్యాలయంలో ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, పురుషులకు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కార్యాలయానికి వచ్చే ప్రజలు మరుగుదొడ్లను ఉపయోగించేందుకు ప్రయత్నిస్తే, కార్యాలయ భవనం యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. "ఈ మరుగుదొడ్లు కార్యాలయ సిబ్బందికి మాత్రమే, కార్యాలయానికి వచ్చే ప్రజలకు కాదు" అని భవనం యజమాని చెప్పినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి కార్యాలయంలో వేచి ఉండే ప్రజలకు కనీసం కూర్చునే సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ వంటి ప్రాథమిక వసతులు కూడా అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవల కోసం ప్రజల నుంచి వివిధ రకాల రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు స్పందించి మెదక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ముఖ్యంగా ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వానకాలం కొనుగోలు కేంద్రాల సెంటర్ల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య



**ఖిల్లా ఘనపురం, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోనీ స్థానిక రైతు వేదికలో జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 2026 వానకాలం వరి కొనుగోలు కేంద్రాలపై ముందస్తు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ముందస్తు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది అని కొనుగోలు కేంద్రాల్లో ఉంచవలసిన సదుపాయాలు, వరి పంటలో ఏడు రకాలను ఏవిధంగా గుర్తించాలో, కొనుగోలు చేసే ప్రక్రియలో గుర్తుంచుకోవాల్సిన జాగ్రత్తలపై, వరి కొనుగోలులో నాణ్యత ప్రమాణాల గుర్తింపు అవగాహన పూర్తిస్థాయిగా జిల్లా అధికారులు ఇచ్చిన సూచనల మేరకు అవగాహన కల్పించడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తో పాటు మహిళా సంఘం మండలి ఏపీఎం, ప్యాక్స్ సిఈఓ, పౌరసరఫరాల శాఖ అధికారి రాజశేఖర్ మండలంలోని ఏ ఈ ఓ లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు

- ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసి ఇబ్బందులు పడొద్దు..
- వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, బ్యూరో, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** మన సృష్టికి మూలమైన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలని, వారిని నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొందరు తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లల పేరున రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వారి సంరక్షణకు నోచుకోక అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 169 ఫిర్యాదులు రాగా, 115 పరిష్కరించినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోతే సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆస్తులను పిల్లల పేరున ముందుగానే రిజిస్ట్రేషన్ చేయకుండా, తమ తదనంతరం వారసులకు చెందేలా వీలునామా రాసుకోవాలని సలహా ఇచ్చారు.

వయోవృద్ధులు వ్యాయామం, యోగా చేస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు ప్రత్యేక సేవలతో ఉచిత వైద్యం, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వనపర్తిలోని వయోవృద్ధుల పునరావాస, వినోద కేంద్రాన్ని పట్టణంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. పిల్లల నుంచి సమస్యలు ఎదురైతే 14567 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఓటీపీలు అడిగి బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కాజేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.



కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సెర్ప్ ప్రోగ్రాం అధికారి లింగయ్య గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి. ఇందిర, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు నాగేంద్రస్వామి, అమ్మ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిన్నమ్మ థామస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వయోవృద్ధులను కలెక్టర్ శాలువా, మెమెంటోలతో సన్మానించారు.

# వయోవృద్ధుల సేవలకు రాష్ట్ర పురస్కారం



- డాక్టర్ ఉమేష్ గుప్తాకు ఘన సత్కారం

**నిర్మల్ టౌన్ , అక్టోబర్ 1 (జనంసాక్షి) :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో నిర్మల్‌కు చెందిన ప్రముఖ ఆయుర్వేద, న్యూరో థెరపిస్ట్ డా. ఉమేష్ గుప్తా రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్య సేవలు, వైద్య అవగాహన కార్యక్రమాల్లో డా. ఉమేష్ గుప్తా అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారం ప్రదానం చేశారు. గత 32 ఏళ్లుగా వైద్య, చికిత్సా రంగంలో సేవలందిస్తూ వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కీళ్ల నొప్పులు, మోకాళ్ల సమస్యలు, కండరాల నొప్పులు, సయాటికా తదితర సమస్యలతో బాధపడుతున్న వయోవృద్ధులకు చికిత్సతోపాటు ఆరోగ్య సలహాలు, అవసరమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి పురస్కారం అందించడం పట్ల డా. ఉమేష్ గుప్తా హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. డా. ఉమేష్ గుప్తాకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించడం నిర్మల్ జిల్లాకు గర్వకారణమని కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల అక్టోబర్ 02 ( జనం సాక్షి):** వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమం, ప్రణాం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి మెడికల్ హెల్ప్ క్యాంపులు, కంటి పరీక్షలు, ప్రభుత్వ పరంగా అందవలసిన పుస్తకాలు, సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు లేదా ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే తమ తల్లిదండ్రులను, వయోవృద్ధులను సరిగా చూసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాధ్యత విస్మరించి వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే, వారి జీతం నుంచి ఆటోమేటిక్‌గా కోత విధించి నేరుగా వృద్ధులకు అందించేలా చట్టపరమైన నిర్ణయం తీసుకున్నామని, ఇది ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందని తెలిపారు. అదేవిధంగా, గతంలో భావోద్వేగంతో పిల్లలకు రాసిచ్చిన భూములను.. ఆ తర్వాత వారు సరిగ్గా చూసుకోకపోతే తిరిగి వెనక్కి పొందేలా చట్టంలో వెసులుబాటు ఉందని అన్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వయోవృద్ధులు నేరుగా తనకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెంటనే స్పందించి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. జపాన్ తరహాలో రాబోయే రోజుల్లో మన దేశంలోనూ వయోవృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఆ సమాజానికి తగినట్లుగా వారి ఆరోగ్యం, డే కేర్ కార్యకలాపాలు, రక్షణ బాధ్యతలను ప్రతి ఒక్కరూ విస్మరించకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వయోవృద్ధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి, మోమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, వయోవృద్ధుల సమైక్య ప్రతినిధులు దేవిదాస్ దేశ్పాండే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వయోవృద్ధులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో సీబీఎస్ షోరూం ప్రారంభం

- ఐశ్వర్య రాజేష్ చేతుల మీదుగా ప్రారంభం..
- 5 వరకు ప్రత్యేక ఆఫర్లు



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** పట్టణంలోని బోయివాడ, నటరాజ్‌నగర్‌లో సీబీఎస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) షోరూం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్ షోరూంను ప్రారంభించారు. తెలంగాణలో సంస్థకు ఇది ఏడో షోరూం అని నిర్వాహకులు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ, ఆధునిక వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని అక్టోబర్ 1 నుంచి 5 వరకు ప్రత్యేక తగ్గింపు ఆఫర్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సినీనటి ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ.. నిర్మల్‌లో సీబీఎస్ షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న డిజైన్లు, వస్త్రాల రకాలతో వినియోగదారులను ఆకట్టుకుంటోందని తెలిపారు. ప్రారంభోత్సవంతో షోరూంలో కస్టమర్ల సందడి నెలకొంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో విస్తృతంగా చర్చించిన చల్లా.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టభద్రులు, యువత, ఉద్యోగుల కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పట్టభద్రులకు వివరించి బీఆర్ఎస్ వైపు మద్దతు కూడగట్టాలని అన్నారు. పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఓటరును నేరుగా కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామం, పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలాన్ని నిరూపించేలా ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని చల్లా పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలకు నియోజకవర్గ బాధ్యులుగా పరకాల మండల సీనియర్ నాయకులు నేతాని శ్రీనివాస్ రెడ్డి గారిని నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ,పరకాల, నడికుడ, ఆత్మకూరు, దామెర, జిడబ్ల్యూఎంసి 15,16,17 డివిజన్ల నాయకులు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## తాటిచెట్ల తొలగింపు ఆపాలి

- ఎమ్మెల్యేకు గౌడ సంఘం వినతి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిన్న కోడెపాక గ్రామ శివారు బాలయ్యపల్లిలో విద్యుత్ లైన్ వేస్తున్న క్రమంలో గౌడ కుల వృత్తికి ఆధారమైన తాటి చెట్లను తొలగిస్తుండటంపై గౌడ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ గౌడ సంఘం చైర్మన్ కక్కెర్ల సంపత్ గౌడ్, అధ్యక్షులు కొత్తకొండ భానుతేజ గౌడ్, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్, కునూరి రాజేష్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి చెట్లు తొలగించవద్దని కోరారు. వినతికి స్పందించిన ఎమ్మెల్యే చెట్లు తీసివేయకుండా చూడాలని విద్యుత్ అధికారులకు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు నిగ్వ కుర్రాడు వరుణ్ ఎంపిక



**కుబీర్, అక్టోబర్ 01, (జనంసాక్షి):** కుబీర్ మండలం నిగ్వ గ్రామానికి చెందిన సరికొండ లావణ్య అనిల్ దంపతుల కుమారుడు వరుణ్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో వరుణ్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నాడు. జిల్లా స్థాయిలో ప్రత్యర్థులపై పైచేయి సాధించి అందరి ప్రశంసలు అందుకున్న వరుణ్, ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. వరుణ్ భైంసా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడవ తరగతి విద్యను అభ్యసిస్తూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా ఇంతటి ప్రతిభ కనబరచడం, రాణించడం పట్ల నిగ్వ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చదువును, క్రీడలను సమతుల్యంగా మేనేజ్ చేస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం తమ గ్రామానికి ఎంతో గర్వకారణమని వారు కొనియాడారు. ఈ సందర్భంగా సరికొండ వరుణ్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీలు తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని తెలిపాడు. రాబోయే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో కూడా పట్టుదలతో రాణించి, ఖచ్చితంగా గోల్డ్ మెడల్ (బంగారు పతకం) కైవసం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేశాడు. తన గ్రామానికి, కుబీర్ మండలానికి మంచి పేరు తీసుకురావడమే లక్ష్యంగా కష్టపడుతానని పేర్కొన్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వరుణ్ విజయం సాధించి బంగారు పతకంతో తిరిగి రావాలని గ్రామస్థులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులను వేధిస్తూ ఆస్తులు స్వాధీనం చేసుకునే వారిపై వయోవృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని, పిల్లల పేరిట బదిలీ చేసిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరిట మార్చే అవకాశం ఉందన్నారు. అర్హులైన వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. హనుమాన్ నగర్ లో తాత్కాలిక డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసి ఆటలు, భోజనం, టీ సదుపాయాలు కల్పించామని, శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం ద్వారా చట్టపరమైన రక్షణ కల్పించిందన్నారు. బాధ్యత విస్మరిస్తే ఆర్డీఓ కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమురయ్య, సంక్షేమాధికారి మల్లేశ్వరి, డీఎంహెచ్ఓ డా. మధుసూదన్, డీఆర్డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చు

**నిర్మల్ బ్యూరో , అక్టోబర్ 1 (జనంసాక్షి) :** గృహ వినియోగదారులు సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సూచించారు. 'పీఎం సూర్య ఘర్–ముఫ్త్ బిజ్లీ యోజన'పై గురువారం నిర్మల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో సేవా సేతు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, కేంద్ర సబ్సిడీ, దరఖాస్తు విధానం, బ్యాంకు రుణ సదుపాయాలపై అధికారులు వివరించారు. అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి పథకం ప్రయోజనాలు అందేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ నాగరాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, టౌన్ ఏడీఈ శ్రీనివాస్‌తో పాటు విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల రక్షణే పోలీస్ శాఖ తొలి ప్రాధాన్యత

- మహిళలు సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- షీ టీం సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :** మహిళలు, చిన్నారుల రక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా కేంద్రాల ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నామని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు. సెప్టెంబర్ నెలలో జిల్లా వ్యాప్తంగా షీ టీం ఆధ్వర్యంలో 28 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, మహిళల భద్రత అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. అలాగే 76 హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి నిఘా నిర్వహించడంతో పాటు, 7 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, 12 ఫిర్యాదులు స్వీకరించగా 3 ఎఫ్ఐఆర్,2 పెట్టి కేసులు నమోదు నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారులు వేధింపులు, హింస లేదా సైబర్ వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, వీడియోలను పంచుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సహాయం కోసం ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం – 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం – 8712670565 లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

# కుటుంబ వ్యవస్థకు మూల ఆధారం పెద్దవారే..

- ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కుటుంబంలో పెద్దవారిని నిర్లక్ష్యం చేయడం తగదని, వారి హక్కులకు భంగం వాటిల్లకూడదని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఆర్ దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థకు మూల ఆధారం పెద్దవారేనని, సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం వారికి కల్పించిన హక్కులకు భంగం కలగకూడదని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, వారిపై హింసకు పాల్పడితే చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలనాధికారి పారిజాతం, సంస్థ నిర్వాహకురాలు శైలజ, సూపరిండెంట్ రఘురాం, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ దేవేందర్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసమే అన్ని రంగాల అభివృద్ధికి మూలం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- ఎన్ఎస్ఎస్ దిశా నిర్దేశక కార్యక్రమం



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ దిశానిర్దేశక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ, ఎన్ ఎస్ ఎస ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ, సమాజానికి ఉపయోగపడే ఎన్ ఎస్ ఎస వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో 4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :** పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ములుగు జిల్లాలో మరో ముందడుగు పడింది. ములుగు సర్కిల్, ములుగు డివిజన్ పరిధిలోని మల్లంపల్లి సెక్షన్, రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బొక్క సునీల్ రెడ్డి, అపర్ణ పెంటా రెడ్డి ఏర్పాటు చేసిన 2o2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ విద్యుత్ గ్రిడ్‌కు గురువారం అనుసంధానం చేశామని సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బేతి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, సౌర విద్యుత్ ప్లాంట్ల గ్రిడ్ అనుసంధానం ద్వారా పర్యావరణహితమైన విద్యుత్ ఉత్పత్తికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెంపొందుతుంది. గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలను బలోపేతం చేయడంలో ఇటువంటి సౌర విద్యుత్ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ రెండు ప్లాంట్లను విజయవం తంగా గ్రిడ్‌కు అనుసంధానం చేయడంలో సమన్వయంతో కృషి చేసిన ఆపరేషన్, ప్రొటెక్షన్ విభాగాల అధికారులు, సిబ్బందిని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ములుగు, డీఈ రాజు, ఎంఆర్‌టీ అండ్ కన్‌స్ట్రక్షన్/భూపాలపల్లి, ఆపరేషన్, ప్రొటెక్షన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బైకులు పర్యావరణ హితం

- ఈఈటుగో ఎండి శ్రీనివాస్ రెడ్డి



**ములుగు, అక్టోబర్1 (జనం సాక్షి):** ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించడం ద్వారా పర్యావరణానికి, ఆర్థికంగా మేలు చేస్తాయని ఎలక్ట్రిక్ ఎన్విరో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ములుగు గట్టమ్మ దేవాలయం వద్ద వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఈ ఈ టు గో సలహాదారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడారు పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో చాలా మంది సాంప్రదాయ బైకుల నుండి ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. వీటిని వినియోగించడంలో సరైన అవగాహన కలిగి ఉంటే ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం పెరుగుతుందని,దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు ఎలక్ట్రిక్ బైకులను కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీం ఫౌండర్ సంజీవయ్య, కుమారస్వామి,వెంకట్ రెడ్డి, గణేష్, బిక్షపతి , పరశురాములు,సతీష్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి):** అనారోగ్యంతో, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదాలకు గురై అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలువవచ్చని, రక్తదానం చేయడంతో శరీరంలో నూతన రక్తం పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్కారు బడుల చుట్టూ ప్రైవేటు బడుల ముళ్ల కంచె..!

- ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తామంటూ మాటలు
- ప్రైవేటు బడుల విస్తరణకు అనుమతులు

**యాలాల, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి.. విద్యార్థుల సంఖ్య పెంచాలి.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించాలి.. ఇవన్నీ పాలకులు, అధికారులు తరచూ చెప్పే మాటలే. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తే ఆ మాటలకు, ఆచరణకు మధ్య అంతరం కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యాలాల మండలంలోని గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల చుట్టూ ప్రైవేటు పాఠశాలలు విస్తరిస్తుండటం, మరోవైపు గురుకుల పాఠశాలల వైపు కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు మొగ్గుచూపుతుండటంతో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యపై ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం తప్పు అనేది ప్రశ్న కాదు. విద్యాసంస్థలు నిబంధనలకు అనుగుణంగా నడిచేలా చూడటం ప్రభుత్వ బాధ్యతే. అయితే ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచనలు ఇస్తూనే మరోవైపు ప్రభుత్వ పాఠశాలల పరిధిలోనే ప్రైవేటు విద్యాసంస్థలు పెరుగుతున్న పరిస్థితిని సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ప్రతి విద్యా సంవత్సరం కొత్త ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు మంజూరు అవుతున్నాయా, వాటి అవసరం ఏమిటి, సంబంధిత ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలపై వాటి ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.మరోవైపు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వారే ప్రైవేటు విద్యాసంస్థల వైపు మొగ్గుచూపుతున్నారనే విమర్శలు వినిపిస్తే, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేది ఎవరు? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తూ




విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచనలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేందుకు క్షేత్రస్థాయిలో మరింత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన ప్రమాణాలు, పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు, తల్లిదండ్రులతో నిరంతర సంబంధాలు వంటి అంశాలపై నిర్దిష్ట కార్యాచరణ ఉండాలి.ఇటీవల కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ప్రీ-ప్రైమరీ తరగతులు చిన్నారులను ప్రభుత్వ విద్యా వ్యవస్థలోకి ఆకర్షించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అయితే వాటిలో విద్యార్థుల చేరిక ఎంతమేరకు ఆశాజనకంగా ఉంది? గ్రామీణ తల్లిదండ్రులు ఆ అవకాశాన్ని ఎందుకు వినియోగించుకుంటున్నారు లేదా ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అనే విషయాలను కేవలం గణాంకాల కోణంలో కాకుండా గ్రామాల వారిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఒక పాఠశాలలో కొత్త తరగతి ప్రారంభించడం మాత్రమే కాకుండా, ఆ తరగతిలో పిల్లలను చేర్పించే స్థాయిలో తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించగలిగితేనే దాని ప్రయోజనం కనిపిస్తుంది.

యాలాల మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న పాఠశాలలను కేవలం 'విద్యార్థులు లేరు' అనే గణాంకాలతో చూడటం సరైన పరిష్కారం కాదు. ఆ విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు? ప్రైవేటు పాఠశాలలకా ? గురుకులాలకా ? సమీప పట్టణాల పాఠశాలలకా? అసలు ప్రభుత్వ బడి నుంచి తల్లిదండ్రులు ఎందుకు దూరమవుతున్నారు? అనే అంశాలపై గ్రామాల వారిగా విద్యాశాఖ సమగ్ర అధ్యయనం చేయాలి. కారణాలను గుర్తించకుండా విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు ఉచిత సలహాలు ఇవ్వడం సమస్యకు పరిష్కారం కాదనే విషయాన్ని ప్రభుత్వము గుర్తించాలి.మరోవైపు ప్రైవేటు పాఠశాలలపై కూడా సమానమైన బాధ్యత ఉండాలి. విద్య పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు వస్తే వాటిని సంబంధిత అధికారులు పరిశీలించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, ఇతర చార్జీల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అనుమతులు ఇచ్చిన తరువాత పాఠశాలలను పట్టించుకోకుండా వదిలేయడం కాకుండా, విద్యార్థుల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగాలి.

ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇస్తూనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే, దానికి కారణాలను వెతకకుండా కుదింపు వైపు వెళ్లడం ప్రభుత్వ విద్యా విధానానికి సమాధానం కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో విద్యార్థులు తగ్గితే తరగతులు తగ్గించడం, ఉపాధ్యాయుల అవసరాన్ని తగ్గించడం వంటి చర్యల కంటే ముందుగా ఆ పాఠశాలలో విద్యార్థులను ఎందుకు నిలుపుకోలేకపోతున్నామనే అంశాన్ని పరిశీలించాలి. ప్రభుత్వ పాఠశాల బలహీనపడితే దాని ప్రభావం ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలపై పడే అవకాశం ఉంది.

యాలాల మండలంలో ఈ పరిస్థితిపై మండల స్థాయిలో ఒక సమగ్ర విద్యా సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## ఆధారాలు లేకుండా పాత్రికేయులపై ఆరోపణలు తగవు

- ప్రభుత్వ భూ కబ్జాలతో ముడిపెడుతూ కథనాలపై స్థానిక విలేకరుల ఆగ్రహం
- జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు..
- విచారణ చేపడతాం : ఎస్‌హెచ్‌ఓ సైదులు

**జవహర్‌నగర్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** స్థానిక పాత్రికేయులను ప్రభుత్వ భూముల కబ్జాలతో ముడిపెడుతూ ఆధారాలు లేకుండా కించపరిచేలా కథనాలు ప్రచురించడం తగదని జవహర్‌నగర్‌కు చెందిన స్థానిక విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ గురువారం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక స్థానిక విలేకరుల ప్రమేయం ఉందంటూ కొన్ని కథనాలు, ప్రచారాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. అంతేకాకుండా స్థానిక పాత్రికేయుల వృత్తిపరమైన గౌరవాన్ని దెబ్బతీసేలా అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని కథనాల ప్రతులను పోలీసులకు అందజేశారు. ప్రభుత్వ భూముల కబ్జాల్లో నిజంగా ఎవరైనా పాత్రికేయుల ప్రమేయం ఉన్నట్లయితే వారి పేర్లు, సంబంధిత ఆధారాలను పోలీసు, రెవెన్యూ అధికారులకు అందించాలని విలేకరులు కోరారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే కొందరిపై వచ్చిన ఆరోపణలను ఆధారంగా చేసుకుని మొత్తం స్థానిక పాత్రికేయులను కబ్జాలతో ముడిపెట్టడం సరికాదన్నారు. ఇలాంటి ప్రచారం నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. పాత్రికేయుల ఫిర్యాదుపై జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు స్పందిస్తూ.. ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించి ఎవరి వద్దైనా ఆధారాలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన ఆధారాలను పరిశీలించి వాస్తవాల ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధారాలు లేకుండా వ్యక్తులు లేదా పాత్రికేయులను లక్ష్యంగా చేసుకుని వారి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విలేకరులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపడతామని, విచారణలో చట్ట ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్‌కు చెందిన పలువురు స్థానిక విలేకరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలకు జర్నలిస్టుల పాత్ర కీలకం

**నారాయణఖేడ్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ప్రభుత్వాలకు జర్నలిస్టుల పాత్ర కీలకమని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఫెడరేషన్ నారాయణఖేడ్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిరదర్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి కైసర్, కోశాధికారి ఇబ్రహీంఖాన్‌తో పాటు ఉపాధ్యక్షులు, శరణప్ప కార్యవర్గ సభ్యులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా జర్నలిస్టులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వాస్తవాలను తెలియజేసే విధంగా వార్తలను అందించాలని అన్నారు. అదే సమయంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల ఐక్యతతో పాటు వారి హక్కులు, సంక్షేమం కోసం ఫెడరేషన్ మరింత చురుకుగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునిగాల మాణిక్ ప్రభు, మున్సిపల్ కౌన్సిలర్ బాణపురం రాజు, టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసేవలో వారి నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం

- పదవీ విరమణ పొందిన తహసీల్దార్లకు వీడ్కోలు
- కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** పదవీ విరమణ పొందిన నాల్కల్ తహసీల్దార్ బి. ప్రభులు, చౌటకూర్ తహసీల్దార్ కిష్టయ్యలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఘనంగా సత్కరించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పదవీ విరమణ పొందిన ఇద్దరు తహసీల్దార్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, అంకితభావం, ప్రజలకు అందించిన సేవలే వారి సేవా ప్రస్థానానికి నిజమైన గుర్తింపు అని అన్నారు. బి. ప్రభులు, కిష్టయ్య తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజాసేవలో విశేష కృషి చేశారని అభినందించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, తమకు ఇష్టమైన వ్యాపకాలతో ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన వారిని సత్కరించి, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.




## భూ భారతి రీ-సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- పారదర్శకత, ఖచ్చితత్వంతో సర్వే పూర్తి చేయాలి
- కలెక్టర్ హైమావతి



**కోహెడ, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** భూ భారతి రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కోహెడ మండల పరిధిలోని జుమ్లా తండాలో కొనసాగుతున్న భూ భారతి రీ-సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 90 సంవత్సరాల క్రితం భూ సర్వే నిర్వహించారని, కాలానుగుణంగా జనాభా పెరగడం, భూమి కొరత తదితర కారణాలతో భూ సమస్యలు పెరిగాయని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రీ-సర్వే చేపట్టిందని పేర్కొన్నారు. రీ-సర్వేలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలను సంబంధిత రికార్డులతో సరిచూసి ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులు, భూ హక్కుదారుల సహకారం తీసుకోవాలని, నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేసి భూ రికార్డులను పకడ్బందీగా నవీకరించాలని ఆదేశించారు. ముందుగా గ్రామ సరిహద్దులను నిర్దేశించి ప్రభుత్వ స్థలాల్లో సర్వే నిర్వహించాలని, అనంతరం పట్టా, అసైన్డ్ భూములను సర్వే చేయాలని సర్వే అధికారులకు కలెక్టర్ సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్. నవీన్ కుమార్, ఆర్ఐ, సర్వే అధికారులు, సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏబీసీ, ఏఆర్‌వీ సేవలు పటిష్టం చేయాలి

- ఫతుల్లాగూడ యానిమల్ కేర్
- సెంటర్‌లో ఎంఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ
- 3 వేల జంతువుల సామర్థ్యంతో షెల్టర్ల అభివృద్ధికి చర్యలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో వీధి కుక్కల నియంత్రణ, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ (ఏఆర్‌వీ) సేవలను మరింత పటిష్టంగా అమలు చేయాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఫతుల్లాగూడలోని యానిమల్ కేర్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పలు కీలక సూచనలు చేశారు. యానిమల్ కేర్ సెంటర్‌లో డాగ్ కెన్నెల్స్, ఆపరేషన్ థియేటర్, డాగ్ ఫుడ్ తయారీ ప్రాంతం, నిర్మాణంలో ఉన్న నూతన యానిమల్ షెల్టర్‌ను కమిషనర్ పరిశీలించారు. ఏఆర్‌వీ కార్యక్రమం, వ్యాక్సినేషన్, మందుల వినియోగం, జంతువులకు అందిస్తున్న ఆహారం తదితర అంశాలపై వెటర్నరీ సిబ్బందితో సమీక్షించారు. ఎన్జీవో ప్రతినిధులు, జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకున్నారు.

### కోల్డ్‌చైన్‌పై నిఘా

యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌ను ఎస్ఓపీ ప్రకారం నిర్వహించాలని, వ్యాక్సిన్ల కోల్డ్‌చైన్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనంతర ఫాలోఅప్‌ను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

### 3 వేల జంతువులకు షెల్టర్లు

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అనుకూల స్థలాలు, సాంకేతిక సాధ్యత, బడ్జెట్‌కు అనుగుణంగా మొత్తం 3 వేల జంతువుల సామర్థ్యంతో యానిమల్ షెల్టర్ల నిర్మాణం, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జంతు సంక్షేమ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వెటర్నరీ విభాగం సమన్వయంతో పనిచేసి జంతువులకు మెరుగైన సంరక్షణ, ప్రజలకు భద్రత కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ), ఇన్‌చార్జి చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు, వెటర్నరీ అధికారులు, సిబ్బంది, గౌరీ వందన, అసరా ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులు, యానిమల్ లవర్స్ తదితరులు పాల్గొన్నారు.



## వృత్తిని దైవంగా భావిస్తేనే గుర్తింపు

- జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా
- పదవి విరమణ పొందిన తహసిల్దార్ ప్రభులకు ఘన వీడ్కోలు

**న్యాల్‌కల్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** న్యాల్‌కల్ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తూ.. సెప్టెంబర్ 30న పదవి విరమణ పొందిన బైండ్ల ప్రభులు నకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గురువారం మండలంలోని ముంగి గ్రామ శివారులో గల ఎస్ఎల్ఆర్ ప్రాంగణంలో.. ఉప తహసిల్దార్ మల్లికార్జున స్వామి అధ్యక్షతన, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన "పదవి విరమణ అభినందన సభ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, గౌరవ అతిథిగా ఎస్సై సుజిత్ లు హాజరయ్యారు. పదవి విరమణ పొందిన తాజా మాజీ తహసిల్దార్ "ప్రభువులు – సరోజిని" దంపతులకు స్థానిక రెవెన్యూ సిబ్బంది, మండలంలోని సర్పంచులు, అధికార విపక్ష పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీల శ్రేణులు, సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది, జిల్లా రెవెన్యూ కార్యవర్గం ప్రతినిధులు, తదితరులు వీడ్కోలు సభకు అధిక సంఖ్యలో.. పదవి విరమణ పొందిన బైండ్ల ప్రభులు – సరోజిని దంపతులకు ఘనంగా సత్కరించారు. ప్రతి ఉద్యోగి వృత్తిని దైవంగా భావించి, జిల్లా ఉన్నత అధికారుల ఆదేశం మేరకు సకాలంలో అవసరమైన పనులను పూర్తి చేసిన అధికారులకు ఎల్లప్పుడూ గుర్తింపు దక్కనుందని ఆర్డీఓ అన్నారు. మండలంలోని జాతీయ పెట్టు బడులు ఉత్పాదకమండలి ప్రాజెక్టు పనులు, సర్ ప్రక్షాళన, భూభారతి గ్రామసభలు, తదితర రెవెన్యూ సంబంధిత కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేసి ఉన్నతాధికారుల నుండి మెరుగైన ఫలితాలు పొందారని పదవి విరమణ పొందిన ప్రభులునకు ఆర్డీవో అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ ఉన్నతాధికారులు, సిబ్బంది, మండల విద్యాధికారి మారుతీ రాథోడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి. అధికార, విపక్ష పార్టీ శ్రేణులు సిద్ధి లింగయ్య స్వామి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, సక్కులాల్, నరసింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, మండలంలో సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



# ఈత వనాలతో గీత కార్మికులకు శాశ్వత ఉపాధి

- మిషన్ కాకతీయతో నాటిన చెట్లు ఇప్పుడు కల్లు ఇస్తున్నాయి
- కొత్తగా నాటిన 500 ఈత మొక్కలను సంరక్షించాలి
- రంగనాయక సాగర్‌కు నీళ్లు ఇవ్వాలి..
- ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**నంగునూరు, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** ఈత వనాల పెంపకం ద్వారా గీత కార్మికులకు శాశ్వత ఉపాధి లభించడంతో పాటు చెరువు కట్టలకు రక్షణ కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అక్కెనపల్లి గ్రామంలో నిర్వహించిన ఈత వనాల పెంపకం కార్యక్రమంలో ఆయన పాల్గొని 500 ఈత మొక్కలను నాటారు.

### రెండేళ్లు కాపాడితే జీవితాంతం ఉపాధి

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. గతంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించిన సమయంలో పెద్ద ఎత్తున ఈత చెట్లను నాటామని తెలిపారు. చిన్నకోడూరు, లింగారెడ్డిపల్లి, పుల్లూరు, చింతమడక తదితర గ్రామాల్లో నాటిన ఈత చెట్లు ప్రస్తుతం కల్లు దిగుబడినిస్తూ గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. ఈత వనాల పెంపకంతో చెరువు కట్టలకు భద్రత కలగడంతో పాటు గౌడ సామాజిక వర్గానికి ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని అన్నారు.

అక్కెనపల్లిలో తాజాగా నాటిన 500 ఈత మొక్కలను ప్రజలు శ్రద్ధగా సంరక్షించాలని కోరారు. ఈత చెట్లను రెండేళ్లపాటు కాపాడితే అవి జీవితాంతం ఉపాధి అందించే వనరుగా మారతాయని చెప్పారు. మొక్కల సంరక్షణలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది కూడా సహకరించాలని సూచించారు.

### గీత కార్మికుల సంక్షేమానికి చర్యలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెట్టు పన్ను రద్దు చేయడం, కొత్త సొసైటీలకు అవకాశం కల్పించడం, పాత బకాయిల రద్దు, ఆటోమేటిక్ రిన్యూవల్ విధానం వంటి నిర్ణయాలు తీసుకున్నామని హరీశ్ రావు తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించే విధానాన్ని కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో ఎక్సైజ్ శాఖ అధికారుల నుంచి గీత కార్మికులకు ఇబ్బందులు ఉండేవి కావని, ప్రస్తుతం గీత కార్మికులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

### రంగనాయక సాగర్‌కు నీళ్లు ఇవ్వాలి

రంగనాయక సాగర్ ప్రాజెక్టును నింపాలని తాను పోరాడుతున్నానని హరీశ్ రావు అన్నారు. గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లను పూర్తిస్థాయిలో నడపకుండా ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆరోపించారు. రంగనాయక సాగర్‌కు నీరు చేరకుండా మోటార్లను కేవలం ఎనిమిది గంటలు మాత్రమే నడుపుతున్నారని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు.

త్వరలో జిల్లాలోని చెరువులకు కాళేశ్వరం నీటిని తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని, చెరువులు నిండితే గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు.

చెక్‌డ్యామ్‌లతో వ్యవసాయానికి మేలు

పెద్దవాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించడం వల్ల వ్యవసాయం మెరుగుపడిందని హరీశ్ రావు తెలిపారు. చెక్‌డ్యామ్‌ల కారణంగా తాటి, ఈత చెట్లకు కూడా మంచి దిగుబడి వస్తోందని చెప్పారు. నీటి వనరులను అభివృద్ధి చేయడంతో పాటు ఈత, తాటి వనాల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు.



### ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రాధాన్యం

అక్కెనపల్లిలోని ఆయిల్‌పామ్ తోటను హరీశ్ రావు సందర్శించారు. ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని సూచించారు. రైతుల్లో ఆయిల్‌పామ్ సాగుపై మరింత అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు నమ్మకం కల్పించేలా అధికారులు పనిచేయాలని అన్నారు.

వ్యవసాయ శాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు సకాలంలో యూరియా, నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలని హరీశ్ రావు కోరారు.




# సెప్టెంబర్‌లో రూ. 2 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ వసూళ్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ గురువారం విడుదల చేసింది. సెప్టెంబర్ నెలలో రూ.2.03 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ వసూలైనట్లు తెలిపింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 14.7 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీల నుంచి పన్ను వసూళ్లు 10.1 శాతం పెరిగి రూ.1.38 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల నుంచి స్థూల ఆదాయం 26 శాతం పెరిగి రూ.65,525 కోట్లుగా ఉంది. ఏడాది ప్రాతిపదికన.. జీఎస్టీ రీఫండ్‌ల విలువ 3 శాతం తగ్గి రూ.27,001 కోట్లకు చేరుకుంది. రీఫండ్‌ల అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 18.1 శాతం పెరిగి రూ.1.76 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగం (ఏప్రిల్- సెప్టెంబర్) జీఎస్టీ వసూళ్లు 11.6 శాతం పెరిగి రూ.12.46 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికరంగా 10.4 శాతం పెరిగి రూ.10.66 లక్షల కోట్లుగా ఉన్నాయి.

**జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ముందంజ..**

జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ దూసుకుపోతోంది. జాతీయ సగటు వృద్ధి రేటును వెనక్కి నెట్టి తెలంగాణలో అత్యధికంగా జీఎస్టీ వసూలైంది. సెప్టెంబర్‌లో 18 శాతం వృద్ధితో రూ.5,327 కోట్ల జీఎస్టీ రెవెన్యూ నమోదైంది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య సర్దుబాటు అనంతరం రూ.22,231కోట్లు ఎస్‌జీఎస్‌టీ రూపంలో వసూలయ్యాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్‌టీ వసూళ్లు స్థిరంగా కొనసాగుతున్నాయి. సెప్టెంబర్ నెలలో 6 శాతం వృద్ధితో రూ.3,599 కోట్ల వసూళ్లను సాధించింది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య సెటిల్‌మెంట్ అనంతరం 18 శాతం వృద్ధితో రూ. 19,598 కోట్ల వసూళ్లను సాధించింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓగా అనుప్ బాగ్చీ

దిల్లీ: ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ కొత్త మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అనుప్ బాగ్చీ నియమితులయ్యారు. ఈ మేరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుత ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ నుంచి అక్టోబర్ 27న బాగ్చీ బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మూడు దశాబ్దాల పాటు పని చేసిన జగదీశన్ (61) అక్టోబరు 26న పదవీ విరమణ చేయనున్నారు. తన ప్రస్తుత పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో పునర్నియామకం కోసం పరిశీలనలో ఉండకూడదని నిర్ణయించుకున్నారు. దీంతో జగదీశన్ వారసుడి ఎంపిక, ప్రక్రియను బోర్డు ప్రారంభించింది. ఈ క్రమంలోనే అనుప్ బాగ్చీని తదుపరి ఎండీ, సీఈఓగా బోర్డు నియమించింది. అనుప్ బాగ్చీ ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సురెన్స్ ఎండీ, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈ నియామకానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

# నాలుగోరోజూ నష్టాలే..

## సెన్సెక్స్ 570 పాయింట్లు పతనం

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఎఫ్ఐఐల విక్రయాలు, అమెరికాలో బాండ్ రాబడులు పెరగడం వంటివి మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. చమురు ధరల పెరుగుదల కూడా సూచీలపై ఒత్తిడి పెంచింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఒక దశలో 1200 పాయింట్ల మేర పతనమైంది. ఆఖర్లో దాదాపు 600 పాయింట్లు రికవరీ అవ్వడం కొంతవరకు కలిసొచ్చింది. నిఫ్టీ 200 పాయింట్లు కోల్పోయి 22,400 మార్కుకు కాస్త ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 72,192.89 (క్రితం ముగింపు 72,480.29) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 71,292.88 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో కొంత కోలుకుంది. చివరకు 570.59 పాయింట్ల నష్టంతో 71,909.70 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 198.50 పాయింట్లు తగ్గి 22,421.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ దాదాపు 37 పైసలు క్షీణించి 96.31గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,162 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



**కారణాలు ఇవీ..**

దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి విదేశీ మదుపర్లు తరలిపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బుధవారం ఒక్కరోజే 10,148 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించారు. మంగళవారం కూడా సుమారు మరో రూ.10 వేల కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఈ వారంలోనే దాదాపు రూ.26వేల కోట్ల పెట్టుబడులు తరలిపోయాయి. అమెరికా బాండ్ రాబడులు పెరగడం కూడా మన మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికాలో 10 ఏళ్ల ట్రెజరీ బాండ్లపై రాబడులు 5.33 శాతానికి చేరాయి. 2007 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. 30 ఏళ్ల ట్రెజరీ బాండ్లు సైతం (5.65%) 2002 తర్వాత గరిష్ఠ స్థాయికి చేరాయి. ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచన ప్రాయంగా పేర్కొన్నారు. తన ముందు కేవలం రెండు ఆప్షన్లు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఒకటి ఒప్పందం, రెండోది ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేయడం అని స్థానిక విలేకరులతో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలు రేకెత్తించాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగొచ్చన్న అంచనాలతో క్రూడాయిల్ ధరలకు రెక్కలు రావడం మన మార్కెట్‌కు ప్రతికూలంగా మారింది. చివరకు 570.59 పాయింట్ల నష్టంతో 71,909.70 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 198.50 పాయింట్లు తగ్గి 22,421.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ దాదాపు 37 పైసలు క్షీణించి 96.31గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,162 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి విదేశీ మదుపర్లు తరలిపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బుధవారం ఒక్కరోజే 10,148 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించారు. మంగళవారం కూడా సుమారు మరో రూ.10 వేల కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఈ వారంలోనే దాదాపు రూ.26వేల కోట్ల పెట్టుబడులు తరలిపోయాయి.

# జోహో సొంత క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. విద్యార్థులకు ఫ్రీ

ఇతర కంపెనీలపై ఆధారపడకుండా తామే సొంత క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తెలిపారు. డేటాబేస్, ఐడెంటిటీ, మెసేజింగ్, సెర్చ్, స్టోరేజ్, కంప్యూటింగ్ వంటి కంపెనీ అప్లికేషన్స్‌ను నడిపించేందుకు.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ లేదా గూగుల్ క్లౌడ్ వంటి విదేశీ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా దీన్ని సొంతంగా ఏర్పాటు చేసినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. డెవలపర్లు తమ ప్రాజెక్టులను నిర్మించడానికి ఉపయోగించే క్యాటలిస్ట్ (అజీబిజీశ్రీఎబబి) సర్వర్‌లెస్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చామని శ్రీధర్ వెంబు తెలిపారు. విద్యార్థులకు దీన్ని ఉచితంగా అందించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల విద్యార్థులు ఎలాంటి ఖర్చు లేకుండా సొంతంగా అప్లికేషన్స్‌ను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. జోహో ఉత్పత్తులన్నీ దేశంలోనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్లోబల్ హెడ్‌క్వార్టర్స్ చెన్నైలో ఉందన్నారు. భారతీయ వినియోగదారుల డేటాను ముంబయి, దిల్లీ, చెన్నైలోని డేటా సెంటర్లలోనే భద్రపరుస్తున్నామని తెలిపారు.



# బీఎస్ఎన్ఎల్ గుడ్‌న్యూస్..

## ఈ ప్రీపెయిడ్ ప్లాన్లపై రూ లక్ష బీమా కవరేజీ

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ తన వినియోగదారులకు శుభవార్త చెప్పింది. ఎంపిక చేసిన ప్రీపెయిడ్ ప్లాన్లపై ఉచిత బీమా సదుపాయం, సైబర్ ఫ్రాడ్ కవరేజీని తీసుకొచ్చింది. ఇందుకోసం ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో బీఎస్ఎన్ఎల్ చేయి కలిపింది. స్పెషల్ టారిఫ్ ప్రీపెయిడ్ ప్లాన్లకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంది. అర్హులైన చందాదారులు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.లక్ష వరకు బీమా లభిస్తుంది. బీఎస్ఎన్ఎల్ నంబర్‌పై సైబర్ మోసాల బారిన పడితే రూ. 10 వేల వరకు కవరేజీ అందించనుంది. ఈ సదుపాయం ఉన్న ప్లాన్‌లను రీఛార్జ్ చేసిన వెంటనే పాలసీ అమల్లోకి వస్తుంది. రీఛార్జ్‌కు సంబంధించిన ఎస్సెమ్మెస్‌లోనే బీమా వివరాలు కంపెనీ వెల్లడిస్తుంది. ప్లాన్ చెల్లుబాటు అయ్యేంత వరకు బీమా కవరేజీ సదుపాయం ఉంటుంది. అక్టోబర్ 1 నుంచే ఈ సదుపాయం అమల్లోకి వచ్చింది. బీమాను అందిస్తున్న తొలి టెలికాం ఆపరేటర్‌గా బీఎస్ఎన్ఎల్ నిలిచింది.

BSNL Connecting Bharat
Securely • Affordably • Reliably

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,58,793 | ₹ 1,73,236 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,45,000

# మద్యంలో పురుగులమందు కలిపి..

## పక్కా ప్లాన్‌తో హత్య

- సంపత్‌ను చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం
- భార్యతో సంబంధంపై అనుమానమే
- హత్యకు కారణం.. రూ.లక్షకు ఒప్పందం
- బుద్ధారం హత్య కేసును ఛేదించిన
- పోలీసులు.. ముగ్గురు అరెస్ట్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామంలో సంచలనం సృష్టించిన పెండెల సంపత్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పక్కా ప్రణాళికతో సంపత్‌ను హత్య చేసి, అతడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. అనుమానంతో మొదలై.. హత్యకు దారితీసిన ఈ వ్యవహారంపై పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన పెండెల సంపత్ (32) ప్లంబర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం బుద్ధారంలో నివాసం ఉంటున్నాడు. సెప్టెంబర్ 17న రాత్రి జడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద అతడు మృతిచెందాడు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బుద్ధారం గ్రామానికి చెందిన ఉమ్మల్ల శ్రీకాంత్ (36), పెండెల సుమలత (26), పొలుదాసరి తరుణ్ (23)లను నిందితులుగా గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. శ్రీకాంత్‌తో తన భార్య సుమలతకు సంబంధం ఉందని సంపత్ అనుమానించి హెచ్చరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దీంతో సంపత్‌ను అడ్డు తొలగించుకోవాలని శ్రీకాంత్, సుమలత కలిసి పథకం వేసినట్లు పోలీసులు వెల్లడించారు.

**రూ.లక్షకు డీల్..**

**మద్యంలో పురుగుమందు..**

హత్యకు తరుణ్ సహకారం తీసుకుని అతడికి రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. పథకంలో భాగంగా సెప్టెంబర్ 17న శ్రీకాంత్, తరుణ్ సంపత్‌ను పాఠశాల ప్రాంగణానికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అక్కడ మద్యంలో పురుగుమందు కలిపి తాగించడంతో సంపత్ మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు.

**హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం..**

సంపత్ మృతిచెందిన అనంతరం మృతదేహాన్ని పల్సర్ ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అతడు స్వయంగా పురుగుమందు తాగి చనిపోయినట్లు నమ్మించేలా నోటిలో, దుస్తులపై, నేలపై పురుగుమందు పోసినట్లు డీఎస్పీ వెల్లడించారు. అయితే పోలీసుల దర్యాప్తులో అనుమానాస్పద అంశాలు వెలుగులోకి రావడంతో కేసును హత్య కోణంలో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించినట్లు తెలిపారు. నిందితుల నుంచి పల్సర్ ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు, మద్యం సీసా, పురుగుమందు సీసా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. కేసులో దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో గణపురం సీఐ కరుణాకర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు..

## సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు : ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి):**
శబ్ద కాలుష్యానికి కారణమయ్యే మార్పు చేసిన సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసిన ట్రాఫిక్ పోలీసులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర రావు గారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది గురువారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి అమర్చిన, అధిక శబ్దాన్ని వెలువరించే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సందర్భంగా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా స్వాధీనం చేసుకున్న సుమారు 350 మార్పు చేసిన సైలెన్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు మాట్లాడుతూ, వాహనాల సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దం వచ్చే విధంగా వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనాల్లో కంపెనీ అమర్చిన ఒరిజినల్ సైలెన్సర్లనే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం వచ్చేలా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు సుజాత, వెంకన్న ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# 9న భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళా

- హాజరు కానున్న 300కుపైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు..
- 20 వేల మంది నిరుద్యోగ యువతను సమీకరించడమే లక్ష్యం..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**
నిరుద్యోగ యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 9న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీలో జాబ్‌మేళా ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఓ, సింగరేణి, జెన్కో తదితర శాఖల అధికారులతో ఎమ్మెల్యే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాలో 300కుపైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారని, సుమారు 20 వేల మంది నిరుద్యోగ యువతను సమీకరించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై జాబ్‌మేళాను ప్రారంభించనున్నారని చెప్పారు. ఎంపీ కడియం కావ్యతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. జాబ్‌మేళా సమాచారం ప్రతి గ్రామానికి చేరేలా గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్‌మేళాకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ నెల 6లోగా గ్రామాల వారీగా చదువుకున్న నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగ యువతకు ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా ప్రాంగణంలో మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, సింగరేణి జీఎం రాజేశ్వరరెడ్డి, జెన్కో ఎస్ఈ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# సోయా విత్తనాలతో రైతులకు నష్టం

**నెరడిగొండ అక్టోబర్1(జనంసాక్షి):**
బోథ్ నియోజకవర్గంలోని పలువురు రైతులు మాలవికా కంపెనీకి చెందిన సోయా విత్తనాలతో నష్టపోయారని, బాధిత రైతులకు కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ డిమాండ్ చేశారు. గురువారం రోజున తలమడుగు మండలంలోని రూయ్యడి గ్రామంలో ఎమ్మెల్యే రైతులతో కలిసి వ్యవసాయ క్షేత్రాన్ని చేరుకుని సోయా పంటలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ని వినతిపత్రం అందజేశారు. విగర్ మాళవిక కంపెనీకి చెందిన సోయా విత్తనాలు సాగు చేసిన రైతుల పొలాల్లో పంట సరిగా ఎదగకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ లు జోక్యం చేసుకుని సోయా పంట నష్టపోయిన ప్రతి రైతుకు కంపెనీ నుంచి రూ.50 వేల నష్టపరిహారం అందాలని జిల్లా ఎస్పీని కోరినట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.



# ఏరియా బొగ్గు గనుల ఉత్పత్తి 99శాతం

**శ్రీరాంపూర్ (జనంసాక్షి):**
శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి బొగ్గు గనులు సెప్టెంబర్ మాసంలో 99 శాతం ఉత్పత్తి సాధించాయని ఏరియా జీఎం శ్రీనివాస్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. జీఎం మాట్లాడుతూ సెప్టెంబర్ మాసంలో ఉత్పత్తి, ఉత్పాదకత పరంగా చాలా సంతృప్తికర ఫలితాలు సాధించాం అన్నారు మూడు భూగర్భ గనులు,ఒక ఓపెన్ కాస్ట్ వందశాతం ఉత్పత్తి సాధించాయి అన్నారు. సెప్టెంబర్ నెల ఉత్పత్తి లక్ష్యం నాలుగు లక్షల పదివేల టన్నులకు గాను నాలుగు లక్షల ఏడు వేల రెండు వందల పదిహేను టన్నులతో 99 శాతం ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. ఎస్ఆర్పీ ఓసీ లో రెండు ప్రైవేట్ ఓబీ కాంట్రాక్టు ప్రతిభ కనబర్చటంతో సెప్టెంబర్ మాసంలో 114 శాతం ఉత్పత్తి సాధించనట్లు,ఐకే ఓసీలో సైతం సెప్టెంబర్ మాసంలో కొత్త కాంట్రాక్టు ప్రారంభమై 44 శాతం ఉత్పత్తి సాధించింది అన్నారు. అక్టోబర్ నెల నుంచి మిగిలిన ఆరునెల్లలో శ్రీరాంపూర్ ఏరియాలో భూగర్భ గనులు,ఉపరితల గనులలో ఉత్పత్తి పెంపు ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశిత లక్ష్యాలను నూటికి నూరు శాతం రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారా అధిగమిస్తామని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు 3868 మందికి డిపెండెంట్ ఉద్యాగాలు కల్పించటం,320 మంది ఉద్యోగులకు ఎల్ఎస్‌పీ చెల్లింపు, 14మందికి ఎంఎంసీ చెల్లించటం,ఉద్యోగ విరమణ పొందిన 9795 మంది ఉద్యోగులకు సీపీఆర్ఎంఎస్ క్రింద ఇప్పటి వరకు మెడికల్ కార్డులు అందజేశామన్నారు.



# 16 నెలలు గడుస్తున్నా అందని ఉపాధి హామీ డబ్బులు

## పట్టించుకోని అధికారులు

### ఆందోళన వ్యక్తం చేస్తున్న కోనాపురం గ్రామ ఉపాధి కూలీలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 1 (జనంసాక్షి):**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తే 16 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఉపాధి కూలీ డబ్బులు రాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలోమే నెలలో మండల కుమారస్వామి చెలుక నుండి పసునూటి ఆనందం చెలుక వరకు ఉన్న ఎస్సారెస్పీ కాలువలో పేరుకపోయిన చెత్తాచెదారం, పూడిక మట్టిని 40 మంది కూలీలు మూడు వారాలపాటు తొలగించారు. అంతేకాక ఎస్సారెస్పీ కాలువను మొత్తం శుభ్రం చేశారు. అనంతరం అదే నెలలో పని పూర్తికాగానే టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్, ఈసీ కిషోర్ కుమార్ లు చేసిన పని ప్రదేశానికి వచ్చి కొలతలను, హాజరు మస్టర్లను తీసుకొని వెళ్లారని తెలిపారు. కానీ ఉపాధి హామీ పథకంలో కూలీ పనులు చేపట్టి ఇప్పటి వరకు 16 నెలలు గడుస్తున్నా మూడు వారాలకు సంబంధించిన డబ్బులు ఇప్పటి వరకు అందలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 40 మంది కూలీలకు రూ. 2.16 లక్షల రూపాయలు రావాల్సి ఉందని కూలీలు ఈసంపల్లి మహేందర్, రవళిక, పసునూటి రవి, కవిత, తాండ్ర చిన్న స్వామి, ఎలీషా, రామ్ చంద్రు, సాంబ, కుమారస్వామి, రవి, స్వామి, కౌసల్య, యాకలక్ష్మి ఆవేదన చెందుతున్నారు. ఏపీఓ అరుణను అడిగినా పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఉన్నతాధికారులు గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన కూలీ డబ్బులను వెంటనే చెల్లించి తమ నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

# ఈనెల 4న కరీంనగర్‌కు అమిత్ షా

- ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవనానికి శంకుస్థాపన
- సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- హెలిప్యాడ్, సభా స్థలాన్ని పరిశీలించిన అధికారులు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 1 (జనంసాక్షి):** ప్రతిమ మెడికల్ కళాశాల ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 4న నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. పర్యటన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం ప్రతిమ మెడికల్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ప్రతిమ కళాశాల యాజమాన్య ప్రతినిధులు బోయినపల్లి శ్రీనివాసరావు, చెన్నమనేని వికాస్‌రావు, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావుతో కలిసి బండి సంజయ్ హెలిప్యాడ్, పైలాన్, డీమ్డ్ యూనివర్సిటీ పైలాన్ స్టోన్, ఫొటో ఎగ్జిబిషన్, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.
ప్రతిమ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో నాటి కేంద్ర హోంమంత్రి ఎల్.కె.అద్వానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సీహెచ్.విద్యాసాగర్‌రావు పాల్గొన్నారని విషయాన్ని బండి సంజయ్ గుర్తుచేశారు. 4న జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అమిత్ షా పైలాన్‌ను ఆవిష్కరించి, డీమ్డ్ యూనివర్సిటీ భవనానికి శంకుస్థాపన చేయడంతో పాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించే సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పర్యటన షెడ్యూల్: అమిత్ షా 3న రాత్రి 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో బస చేస్తారు. 4న ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో తూప్రాన్ చేరుకుని సబర్ డెయిరీ మిల్క్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ చేరుకుని ప్రతిమ మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

# కాలిపోయిన మోటార్లతో రైతుల కదం.. లోవోల్టేజీపై రాస్తారోకో

- కామారెడ్డి-సిద్దిపేట రహదారిపై రెండు గంటల ధర్నా..
- విద్యుత్ సమస్య పరిష్కరించాలని డిమాండ్



**గంభీరావుపేట, అక్టోబర్ 1 (జనం సాక్షి):** లోవోల్టేజీ, విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వివిధ గ్రామాలకు చెందిన రైతులు గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. తెలంగాణ స్తూపం వద్ద కాలిపోయిన మోటార్లను రోడ్డుపై ఉంచి కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతుండగా, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు సరిపడా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్ద ఎస్సై సీహెచ్ శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏఈ ఆనంద్‌కుమార్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో సర్పంచులు మద్దుల రాజిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, పొన్నాల మహేష్, మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్ యాదవ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో మంథని వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం

- సంవత్సరంలో పనులు పూర్తి చేస్తాం
- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**మంథని, అక్టోబర్ 01, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ ప్రజలు, కూరగాయల వ్యాపారులకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించనున్న నూతన వెజ్ మార్కెట్ పనులను మరో రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ కలిసి వెజ్ మార్కెట్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, మున్సిపల్ శాఖ ద్వారా సాంకేతిక ఆమోదం పొందిన నిర్మాణ ప్రణాళిక (టెక్నికల్ అప్రూవల్ ప్లాన్)ను గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలు అధికారులు, కాంట్రాక్టర్స్ తో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణంలో ప్రజలకు, వ్యాపారస్తులకు అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక వసతులతో వెజ్ మార్కెట్ నిర్మిస్తామని తెలిపారు. మార్కెట్ నిర్మాణంపై ఎలాంటి అపోహలు, వదంతులు, పుకార్లను ప్రజలు నమ్మవద్దని సూచించారు. పనులు ప్రారంభమైన అనంతరం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా, ఒక సంవత్సరంలోపు వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు , మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

# భూభారతి సర్వేతో భూసమస్యలకు పరిష్కారం

- రికార్డులు, క్షేత్రస్థాయి తేడాలకు పరిష్కారం
- డీజీపీఎస్ సాంకేతికతతో భూముల హద్దుల నిర్ధారణ
- రంగారెడ్డి జిల్లాలో 108 గ్రామాల ఎంపిక
- పట్టాదారులకు జియో కోఆర్డినేట్లతో ల్యాండ్ పార్సిల్ మ్యాప్



**మొయినాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి):** భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూభారతి రీసర్వే నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సర్వే అధికారి రాంరెడ్డి, ఆర్డీవో పార్థసారథిరెడ్డి తెలిపారు. మొయినాబాద్ మండలం కాశింబౌలి గ్రామపంచాయతీ పరిధిలోని నదీమ్‌నగర్‌లో గురువారం భూభారతి రీసర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డీజీపీఎస్ సాంకేతికత, జియో కోఆర్డినేట్ల ఆధారంగా రైతుల భూములు, గ్రామాల హద్దులను స్పష్టంగా గుర్తించనున్నట్లు తెలిపారు. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య వ్యత్యాసాలు, పట్టా భూముల్లో ఆక్రమణలు, హద్దుల వివాదాలను రీసర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేవలం భూమిని కబ్జాలో ఉంచుకున్నంత మాత్రాన హక్కు లభించదని ఆర్డీవో స్పష్టం చేశారు.
రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 370 గ్రామాలను రీసర్వేకు ఎంపిక చేయగా, రంగారెడ్డి జిల్లాలో 108 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, రైతుల భూములను సర్వే చేస్తామని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రతి పట్టాదారుడికి జియో కోఆర్డినేట్లతో కూడిన ల్యాండ్ పార్సిల్ మ్యాప్ అందజేస్తామని తెలిపారు.
రైతులు తమ సందేహాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, కబ్జా లేదా హద్దులకు సంబంధించిన సమస్యలు ఉంటే రీసర్వే సమయంలో తెలియజేయాలని సూచించారు. ఇతర భూ సమస్యలపై మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బింగయ్య, సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, ఆర్ఐలు రాజేష్, వీణాకుమారి, సర్వేయర్ బిలాజీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలి

**మంథని డీఈ ఆపరేషన్ వి. ప్రభాకర్**

మంథని, అక్టోబర్ 01( జనంసాక్షి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సేవా సేతు అభియాన్ సదస్సులు విద్యుత్ వినియోగదారులకు మంచి అవకాశమని డీఈ ఆపరేషన్ మంథని వి. ప్రభాకర్ అన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే శిబిరంలో ప్రతి వినియోగదారుడు తమ ఇళ్లపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.సదస్సును ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఎన్‌పీడీసీఎల్, టీజీ రెడ్కో అధికారులు, బ్యాంకర్లు, వెండర్లు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రజలకు సౌర విద్యుత్‌పై పూర్తి అవగాహన కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, ఉద్యోగులు నివసించే కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సుమారు 10 స్పాట్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ఈఆర్సీ సభ్యుడు శశిభూషణ్ కాచే, మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, బుద్ధర్తి బుచ్చయ్య, సహాయ లెక్కల అధికారి, సహాయ ఇంజనీర్, లీడ్ బ్యాంక్ మేనేజర్, వెండర్లు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

# 4 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్ట్

- నాచారం-మల్లాపూర్‌లో విక్రయాలకు యత్నం
- ద్విచక్ర వాహనం, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం
- ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చినట్లు పోలీసుల వెల్లడి
- పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు

**నాచారం, అక్టోబర్ 1 (జనంసాక్షి):** గంజాయిని అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని నాచారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 4 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిని ఒడిశాకు చెందిన దేవి ప్రసాద్ త్రిపాఠి (23), కృష్ణ సాహు (23), శిబ ప్రసాద్ మహారాణా (23)గా గుర్తించారు. వీరిలో ఇద్దరు జొమాటో డెలివరీ బాయ్‌లుగా, మరొకరు ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద తనిఖీ చేయగా సూట్‌కేస్‌లో గంజాయి లభించిందని, గంజాయి తరలింపునకు ఉపయోగించిన టీవీఎస్ మోటార్‌సైకిల్, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో ఒడిశాకు చెందిన అజిత్ దేవర్ వద్ద గంజాయి తీసుకుని హైదరాబాద్‌లోని నాచారం, మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు నిందితులు వెల్లడించారని పోలీసులు తెలిపారు. అజిత్ దేవర్ పరారీలో ఉండటంతో అతడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై నాచారం పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 561/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టయిన ముగ్గురిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

# నర్సింగ్ విద్యార్థిని మృతి

- వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు.. హాస్టల్‌లో అపస్మారక స్థితిలో గుర్తింపు
- ఆస్పత్రికి తరలించేలోపే మృతి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**కరీంనగర్ క్రైమ్, అక్టోబర్ 1 (జనంసాక్షి):** కరీంనగర్‌లో నర్సింగ్ విద్యార్థిని మృతి చెందింది. వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ ఆమె తండ్రి పోతెం రమేష్ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం జాదురావుపేటకు చెందిన రమేష్ కుమార్తె రజిత (20) కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి ఎస్ఆర్ఎం నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం రెండో సంవత్సరం చదువుతోంది. డాక్టర్స్ స్ట్రీట్‌లోని శ్రీలక్ష్మి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ సిటీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది.
తన కుమార్తె ఓ వ్యక్తితో మాట్లాడుతోందనే కారణంతో సన్‌రైజ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న గీత అనే మహిళ తరచూ వేధిస్తూ, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతానని బెదిరించినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రజిత రూమ్‌మేట్స్‌తో చెప్పినట్లు తెలిపారు. గురువారం తెల్లవారుజామున రజిత హాస్టల్ బాత్రూమ్‌లో అపస్మారక స్థితిలో కనిపించడంతో రూమ్‌మేట్స్ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలతో పాటు ఫిర్యాదులో పేర్కొన్న వేధింపుల ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఆరు నెలల్లో అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం పూర్తి చేయాలి
- భూ రీసర్వేకు ముందే రైతులకు సమాచారం ఇవ్వాలి
- నవంబర్ 10లోగా రీసర్వే పూర్తి చేయాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా ముగించాలి



**గోదావరిఖని, అక్టోబర్ 1 (జనంసాక్షి):** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం అంతర్గాం, ఆకెనపల్లి, రామగుండంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పనులను పరిశీలించారు. అంతర్గాంలో నిర్మిస్తున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవన పనులను పరిశీలించిన కలెక్టర్.. పనుల్లో వేగం పెంచి ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆకెనపల్లిలో కొనసాగుతున్న భూ రీసర్వేను పరిశీలించిన ఆయన.. సర్వేకు ముందే సంబంధిత రైతులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయా సర్వే నంబర్ల రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రీసర్వేను నవంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయిస్తామని తెలిపారు.
రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.. ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం-6 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయ రికార్డులు, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీ సర్వేయర్ సోమేశ్వర్, తహసీల్దార్లు పడాల ప్రసాద్‌రావు, రవీందర్‌రావు, సర్వేయర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు బ్రోకర్లుగా మారి రైతుల భూములు లాక్కుంటున్నాయి

- గిరిజనుల జోలికొస్తే అధికారులకు అరెస్టు వారెంట్ ఇస్తాం
- బలవంతపు భూసేకరణ వెంటనే నిలిపివేయాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు డాక్టర్ జాటోత్ హుస్సేన్ నాయక్




**యాచారం, అక్టోబర్ 1 (జనం సాక్షి):** ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నాయని, పేదల భూములను గుంజుకుంటూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు డాక్టర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాచారం మండల పరిధిలోని కురిమిద్ద గ్రామపంచాయతీ కింద ఉన్న మంగళగడ్డ తండా, మరలకుంట తండా, పోతుబండ తండాలలో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన రైతుల భూసమస్యలు, ఆవేదనలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలూ రైతు ప్రయోజనాలను పక్కనపెట్టి బ్రోకర్లుగా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 'ఫార్మాసిటీ' పేరుతో పట్టా భూములు గుంజుకుంటే, నేటి ప్రభుత్వం 'ఫ్యూచర్ సిటీ' పేరుతో బలవంతంగా భూసేకరణకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. రైతుల వద్ద లక్షల రూపాయలకు భూములు లాక్కుని, పెద్ద కంపెనీలకు కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. 2017 నుంచి గిరిజన భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆన్‌లైన్ నుండి తొలగించి క్రయవిక్రయాలు కాకుండా అడ్డుకున్నారని తెలిపారు. భూములు అమ్మకోలేక, పిల్లల పెళ్లిళ్లు చేయలేక ఇద్దరు గిరిజనులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు.
తండాల పరిధిలోని 275 ఎకరాల పట్టా భూములను 22ఏ జాబితా నుంచి వెంటనే తొలగించి గిరిజన రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భూకావాలనుకుంటే మంత్రి పొంగులేటికి చెందిన 900 ఎకరాల భూముల నుంచి తీసుకోవాలని వ్యాఖ్యానించారు. గిరిజన రైతుల పట్ల రెవెన్యూ, పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తే సహించేది లేదని, సమగ్ర నివేదిక తెప్పించుకుని అవసరమైతే అధికారులపై అరెస్టు వారెంట్ జారీ చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. గిరిజనులకు ఎస్టీ కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో టీజీఐఐసి అధికారి అనంతరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఏసీపీ రాజు, స్థానిక నాయకులు రఘురాం, దశరథ, హనుమాన్, కిషన్, శ్రీకాంత్, ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకులు కవుల సరస్వతి, కానముని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-2 ఏరియాలో 98 శాతం బొగ్గు ఉత్పత్తి

- సెప్టెంబరులో 6.25 లక్షల టన్నుల ఉత్పత్తి.. ఓబీ వెలికితీతలో 82 శాతం లక్ష్యసాధన
- వార్షిక బొగ్గు ఉత్పత్తిలో 101 శాతం నమోదు : జీఎం లక్ష్మీపతి గౌడ్

**యైటింక్లైన్ కాలనీ, అక్టోబర్ 1 (జనంసాక్షి):** సెప్టెంబర్ నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో ఆర్జీ-2 ఏరియా 98 శాతం సాధించిందని ఏరియా జీఎం టి.లక్ష్మీపతిగౌడ్ తెలిపారు. నెలవారీగా 6.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 6,25,513 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. ఓవర్ బర్డెన్ (ఓబీ) వెలికితీతలో 43 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 35,34,571 క్యూబిక్ మీటర్లు వెలికితీసి 82 శాతం సాధించినట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి 39,26,300 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను ఇప్పటివరకు 39,85,000 టన్నులు ఉత్పత్తి చేసి 101 శాతం సాధించినట్లు జీఎం వివరించారు. ఓబీ వెలికితీతలో 2,76,50,000 క్యూబిక్ మీటర్లకు గాను 2,33,63,262 క్యూబిక్ మీటర్లు వెలికితీసి 84 శాతం సాధించినట్లు తెలిపారు.
సెప్టెంబర్‌లో ఓసీపీ-3, సీఎచ్‌పీ, పీహెచ్‌డీ అడ్మినిస్ట్రేషన్ ద్వారా 6,25,166 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేసిన ఉద్యోగులను జీఎం అభినందించారు. ఆర్థిక సంవత్సర లక్ష్యాలను ముందుగానే పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి

**ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి**




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి) :**
ఎన్నికల సంఘం తన రాజ్యాంగ స్వతంత్రతను కాపాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్ , ఫారం - 6లో మార్పులు, ఎన్నికల కమిషన్‌లో నమోదైనట్లు వచ్చిన అభ్యంతరాల పై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ 26న భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనతో తలెత్తిన సందేహాలు తొలగలేదని, నిర్ణయాల ప్రక్రియ పై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్ , ఫారం - 6, కమిషన్‌లోని అభ్యంతరాలు, నిర్ణయాల ప్రక్రియపై సమగ్ర, స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత పై తలెత్తిన ప్రశ్నల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని అంబటి జోజి రెడ్డి కోరారు.

# సిరిసిల్ల సభలో అభివృద్ధి మాట లేదు

- మూడేళ్లలో కాంగ్రెస్ చేసిందేమిటో చెప్పాలి
- కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలకే సభ పరిమితమైందని ఆరోపణ
- సిరిసిల్ల అభివృద్ధిని ఆదర్శంగా తీసుకోవాలని సూచన
- చేనేత, రైతు సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్




**సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 1 (జనంసాక్షి):** సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభలో అభివృద్ధి అంశాలపై స్పష్టమైన ప్రకటనలు లేకుండా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సిరిసిల్లకు కేసీఆర్, కేటీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుని కొడంగల్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు.
మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కరీంనగర్‌కు వస్తున్న సందర్భంగా కొత్త అభివృద్ధి పనులు, నిధులపై ప్రకటనలు చేస్తారని ప్రజలు ఆశించారని అన్నారు. అయితే వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఆరోపణలు తప్ప కొత్తగా చెప్పడానికి ఏమీ లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్‌కు కేబుల్ బ్రిడ్జి, రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులు మంజూరయ్యాయని, నూతన కలెక్టరేట్‌కు కూడా గత ప్రభుత్వమే నిధులు కేటాయించిందని తెలిపారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం కరీంనగర్‌కు కొత్తగా మంజూరు చేసిన పెద్ద ప్రాజెక్టుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.
బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల సభకు వివిధ జిల్లాల నుంచి ప్రజలను తరలించిన నేపథ్యంలో రైతులు, సాగునీరు, చేనేత కార్మికులు, ఉపాధి అంశాలపై సీఎం ప్రకటనలు చేస్తారని ఆశించారని అన్నారు. అయితే కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలకే సభ పరిమితమైందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో విద్యాసంస్థలు, మౌలిక వసతులు, చేనేత రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. సిరిసిల్ల అభివృద్ధిని చూసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. చేనేత కార్మికుల కోసం అమలు చేసిన 'వర్కర్ టు ఓనర్' పథకం ఎందుకు నిలిచిపోయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన, మంజూరైన ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 8 వేల ఎకరాల భూముల వ్యవహారంపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరామని తెలిపారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట ఫ్లైఓవర్ వరకు అనుమతులు, ప్రతిపాదనలు, లేఖల ప్రక్రియ గతంలోనే జరిగిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సిరిసిల్ల అంటే కేటీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం, విద్య, మౌలిక వసతులతో గుర్తింపు పొందిన ప్రాంతమని అన్నారు. సిరిసిల్లను రాజకీయ విమర్శలకు కాకుండా అభివృద్ధికి నమూనాగా చూడాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ సిరిసిల్లలో చేసిన అభివృద్ధిలో కనీసం పది శాతం అయినా కొడంగల్‌లో చేసి చూపించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో చేనేత రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని పునరుద్ధరించాలని, కరీంనగర్ రైల్వే బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని నేతలు కోరారు. హుజురాబాద్‌కు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత రంగం పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలని కోరారు.
సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, పుట్టా మధు, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యా, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయండి : ఈసిఐ కార్యదర్శి నవీన్ కుమార్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా పరిధి, సంగారెడ్డి జిల్లా ప్రాంతంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్ - 2026) ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి జిల్లాల ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో రంగారెడ్డి మరియు సంగారెడ్డి జిల్లాల ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(సర్ - 2026) ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ మరియు ఈఆర్ఓ అమిత్ నారాయణ్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల విధులను వివరించారు. ఈ క్రమంలో ఓటర్లకు చేరాల్సిన నోటీసులను ఎలాంటి ఆలస్యం లేకుండా 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని, మ్యాపింగ్ లేని మరియు తార్కిక వ్యత్యాసాలు ఉన్న కేసులపై విచారణను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, పత్రాలను సేకరించి వెంటనే ఈసిఐ నెట్‌లో అప్‌లోడ్ చేయాలని, పేదలు మరియు నిరాశ్రయులకోసం ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ఈసీఐ కార్యదర్శి ఎత్తిచూపారు. ఈ సమావేశంలో అదనపు సిఈఓ వాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సంగారెడ్డి అదనపు కలెక్టర్, పటాన్‌చెరు ఈఆర్ఓ మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని అఖిలపక్షాల డిమాండ్

### మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా.. జేసీకి మెమోరాండం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓటు హక్కుకు నష్టం కలిగించే చర్యలను నిలిపివేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సదానందం, తెలంగాణ జన సమితి అధికార ప్రతినిధి ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరుస్తోందని వారు ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక విధానంలో మార్పులు చేసి, తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకుంటున్నారని విమర్శించారు.

**ఓటు హక్కును కాపాడాలి..**

ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికంగా బీఎల్ఓలు, అధికారులు ఓటర్లను గుర్తించే ప్రక్రియ ఉండగా.. దూరంగా కూర్చొని కంప్యూటర్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికే తొలగించినట్లు వారు పేర్కొంటున్న ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌లోని కమిషనర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సీపీఐ ధర్మేంద్ర, సీపీఎం ఎర్ర అశోక్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రవీణ్, తెలంగాణ జన సమితి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిల్ గౌడ్, హరినాథ్ రావు, లక్ష్మి, సత్యప్రసాద్, వి.శ్రీనివాస్, మహిళా సమైక్య నాయకురాళ్ళు మాధవి, ప్రమీల, మహాలక్ష్మి, నరసమ్మ, రాజేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, యువజన సంఘం అధ్యక్షులు సల్మాన్, సిపిఎం, మాస్ లైన్, జనసమితి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను భయపెట్టిన తండ్రి, కుమారుడిపై కేసు

**అల్వాల్, అక్టోబర్ 1 (జనంసాక్షి):** ఇంట్లో ఒంటరిగా ఉన్న ఇద్దరు చిన్నారులను కిటికీ వద్ద నుంచి అసభ్యకర సంజ్ఞలతో భయపెట్టిన ఘటనపై అల్వాల్ పోలీసులు తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 30న సాయంత్రం 5.30 గంటలకు ఓ మహిళ తన 15 ఏళ్ల కుమార్తెతో కలిసి కొంపల్లిలోని డీమార్ట్‌కు వెళ్లారు. 12, 9 ఏళ్ల ఇద్దరు కుమార్తెలను ఇంట్లోనే ఉంచి వెళ్లారు. రాత్రి 7.30 గంటలకు ఆమె తిరిగి వచ్చేసరికి ఇద్దరు చిన్నారులు భయంతో ఏడుస్తూ కనిపించారు. ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివసించే జావేద్ (48) కిటికీ వద్ద నుంచి తమవైపు చూస్తూ దుస్తులు తొలగించి, కిటికీని కొడుతూ, చప్పట్లు కొడుతూ తనవైపు రావాలని సంజ్ఞలు చేశాడని చిన్నారులు తల్లికి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చి, మరో వ్యక్తి ఫోన్ ద్వారా తల్లికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో జావేద్ కిందికి వచ్చి చిన్నారులను తనవైపు రావాలని సంజ్ఞలు చేయడంతో వారు భయపడి తిరిగి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జావేద్ కుమారుడు యూసుఫ్ (22) గతంలోనూ పదేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఫిర్యాదు మేరకు జావేద్, యూసుఫ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## మద్యం మానేయాలని భార్య చెప్పిందని వ్యక్తి ఆత్మహత్య



**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 1 (జనంసాక్షి) :** మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో చోటుచేసుకుంది. వావిలాలపల్లిలో కిరాయికి నివాసముంటున్న పూదరి రాజయ్య (56) ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉండటంతో, ఆరోగ్యం పాడవుతుందని భార్య పూదరి పద్మ పలుమార్లు వారించింది. అయినప్పటికీ వినకుండా వారం రోజుల క్రితం అతను తీవ్రంగా మద్యం తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. రాజయ్య తన భార్యపై చేయిచేసుకోవడంతో, ఆమె తీవ్ర మనస్తాపానికి గురై చందానగర్ కాలనీలో ఉంటున్న తన తమ్ముడు రమేష్ ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8:00 గంటల సమయంలో రాజయ్య పెద్దకుమార్తె జంగిలి నాగశ్రీకి ఇంటి యజమాని రెడ్డి అమ్మ ఫోన్ చేసి, రాజయ్య ఇంట్లో ఉరివేసుకొని చనిపోయాడని సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని చూడగా, రాజయ్య ఇంట్లోని స్లాబ్ ఇనుప కొక్కేనికి డిష్ వైరుతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. సాయంత్రం 5:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల మధ్యలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మద్యం మానాలాని తాను చెప్పినందుకు వినకుండా, తను ఇంట్లో లేని సమయంలో భర్త రాజయ్య తీవ్ర మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య పద్మ పేర్కొంది. తన భర్త మరణంపై ఎలాంటి అనుమా నాలు లేవని, చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## గచ్చిబౌలిలో వ్యభిచార రాకెట్ గుట్టురట్టు.. ఆరుగురు అరెస్ట్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** గచ్చిబౌలి పరిధిలో ఓ భారీ సెక్స్ రాకెట్ గుట్టును పోలీస్ అధికారులు ఛేదించిన రట్టు చేశారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు గురువారం వివరాలను వెల్లడిస్తూ... పలువురు విదేశీ మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖరీదైన హోటల్(ఫ్యాబ్ హోటల్ డ్రీమ్ ఫ్రైడ్) గత కొంతకాలంగా సెక్స్ రాకెట్లు నిర్వహిస్తున్నారని గచ్చిబౌలి పోలీసులకు అక్కా సమాచారం అందడంతో పోలీసు ఉన్నతాధికారులు మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్తంగా సదర్ హోటల్ పై దాడి చేసి పలువురు రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ దాడిలో ఉజ్బెకిస్తాన్ దేశానికి చెందిన ముగ్గురు విదేశీ మహిళలుసహా మరో ముగ్గురు విటులను కలిపి మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని మీడియాకు వెల్లడించారు. వ్యభిచారం ముఠా నిర్వాహకుల నుండి కొంత నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర సామాగ్రినికూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరించారు.

## వృద్ధురాలిపై దాడి చేసి 4 తులాల పుస్తెలతాడు అపహరణ

**యాచారం :** యాచారం మండలం చౌదర్ పల్లి గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని మాయమాట లతో నమ్మించి బంగారు పుస్తెలతాడు అపహరించింది ఓ గుర్తుతెలియని మహిళ. బాధితురాలు మారోజు వజ్రమ్మ (65) బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో చీర కట్టుకుని ముఖానికి గుడ్డ కప్పుకున్న ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి, మాయమాటలు చెప్పి లోపలి గదిలో ఉన్న వజ్రమ్మపై దాడి చేసింది. ఆమెను వెనక్కి నెట్టి మెడలోని సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని బయటకు పారిపోయింది.బాధితురాలు కేకలు వేస్తూ వెంబడించి నా, నిందితురాలు బయట సిద్ధంగా ఉంచుకున్న స్కూటీపై వేగంగా పారిపోయింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## టేకు చెట్లపై గొడ్డలి వేట.. 37 దుంగలు స్వాధీనం

**సిరికొండ అక్టోబర్ 1(జనం సాక్షి):** మండలంలోని రావూట్ల గ్రామ పరిధిలో అటవీ శాఖ సిబ్బంది నిర్వహించిన గస్తీలో అక్రమంగా నరికిన టేకు దుంగలు పట్టుబడ్డాయి. ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని బీట్ కంపార్టుమెంట్ నంబర్ 394లో రోజువారీ విధుల్లో భాగంగా సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా, ఓ ప్రాంతంలో టేకు చెట్లను నరికి దుంగలను కుప్పగా వేసినట్లు గుర్తించారు.అటవీ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ దుంగలు నరికిన వ్యక్తులు అక్కడ కనిపించలేదు. దీంతో సుమారు 37 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని సిరికొండ రేంజ్ కార్యాలయానికి తరలించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న దుంగలకు నంబర్లు వేసి, కొలతలు తీసి వాటి విలువను లెక్కించగా సుమారు రూ.68 వేలుగా తేలినట్లు అటవీ అధికారులు తెలిపారు. టేకు చెట్లను నరికి దుంగలను అక్కడ కుప్పగా ఉంచిన వ్యక్తులను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను త్వరలో గుర్తించి అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. అటవీ హక్కు పత్రాలు పొందిన లబ్ధిదారులు తమకు కల్పించిన అటవీ హక్కులను దుర్వినియోగం చేస్తూ అక్రమంగా చెట్ల నరికివేతకు పాల్పడితే, వారికి మంజూరైన అటవీ హక్కులను రద్దు చేసేలా ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికే వారిపై, అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అనుమానాస్పద స్థితిలో బావిలో పడి ఓ వ్యక్తి మృతి

**బంట్వారం అక్టోబర్ 01 (జనం సాక్షి) :** బంట్వారం మండలంలో అనుమానాస్పద స్థితిలో బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి భార్య శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. సింగిడి రాంరెడ్డి (45) గురువారం ఉదయం 7 గంటల సమయంలో రోజువారీగా పొలానికి వెళ్లాడు. ప్రతి రోజు పొలానికి వెళ్ళి ఉదయం 9 గంటల సమయంలో ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి పొలానికి వెళ్లేవాడు. ఉదయం 10 గంటలు దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో రాంరెడ్డి అన్న వెంకట్రెడ్డి పొలానికి వెళ్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. రాంరెడ్డి కనిపించకపోవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి వారి పొలం పరిసర ప్రాంతాల్లో గాలించగా వారి పొలంలో ఉన్న బావిలో రాంరెడ్డికి చెందిన పర్సు నీటిపై తేలుతూ కనిపించింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి గ్రామస్తుల సహాయంతో బావిలోకి దిగి గాలించగా నీటి లోపల రాంరెడ్డి మృతదేహం కనిపించింది. గ్రామస్తుల సహకారంతో వెంటనే మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. మృతదేహంపై రక్త గాయాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో రాంరెడ్డి మృతి ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక మరేదైనా కారణం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి తనకు న్యాయం చేయాలని భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు బంట్వారం ఎస్ఐ విమల తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి కొడుకు వర్షిత్ రెడ్డి, కూతురు మేఘన రెడ్డి ఉన్నారు.

## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- రంగారెడ్డి కలెక్టర్‌కు అఖిలపక్షం వినతిపత్రం
- సర్ పేరుతో ఓట్ల తొలగింపు సరికాదు
- కేంద్రం చేతిలో ఎన్నికల సంఘం కీలుబొమ్మ



**రంగారెడ్డి, అక్టోబర్ 1 (జనం సాక్షి)**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిన ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీ, టీడీపీ తదితర అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో కొత్త ఓట్ల నమోదు, పేర్ల తొలగింపు, తొలగించిన పేర్ల పునరుద్ధరణ, ఓటర్ల జాబితాలు సంబంధిత డేటా, సంరక్షణ, భద్రత వంటి అంశాలపై ప్రజా వేదికల్లో వెలువడుతున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతపై ప్రజల్లో తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ లోని ఇద్దరు సభ్యులు కమిషనర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బయటకు వచ్చినప్పటికీ ఎలా నిర్ణయాలు అమలులోకి వస్తాయని ప్రశ్నించారు. అందుకే ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించడం లేదన్నారు. మోడీ ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారిందన్నారు. ప్రజల ఓట్లు అక్రమంగా తొలగించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణం ఎన్నికల విధుల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు మొత్తం ఖండంతో ఖండిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక రాష్ట్రాల్లో దొడ్డిదారులు అధికారం చేపట్టేందుకు మోడీ ప్రభుత్వం పుట్ర పండుతోందని విమర్శించారు. భారత రాజ్యాంగ వ్యవస్థకే ప్రమాదం పొంచి ఉందన్నారు. తమ ఓటు హక్కును పారదర్శకంగా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వెలిబుచారు. ఆరోపణలు ఎదురుకుంటున్న అవకతవకలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ బాధ్యత వహించాలని తెలిపారు. ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తన పదవికి రాజీనామా చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. రాజీనామా చేయని పక్షంలో ఆయనపై అభిశంసన ప్రక్రియ చేపట్టాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాల నుండి తొలగించిన పేర్లన్నింటిని పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. తగిన ప్రక్రియను అనుసరిస్తూ విచారణకు అవకాశం కల్పించిన తర్వాతే తొలగించబడిన అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చాలని కోరారు. ఎన్నికల సంఘం పనితీరు రాజ్యాంగం, చట్టం, భారత సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి పునర్వ్యవస్థీకరించబడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం మొండిగా వ్యవహరిస్తే దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలతో ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గోద సామెల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె భాస్కర్, జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కావలి నరసింహ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీ, టీడీపీ తదితర పార్టీల జిల్లా నాయకులు అందజేశారు.




## కొలెస్ట్రాల్‌పై అవగాహనకు 'ఫ్రీడమ్ దిల్ కీ బాత్'

**ఖైరతాబాద్, అక్టోబర్ 1 (జనం సాక్షి):** కొలెస్ట్రాల్, గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ మాజీ భారత క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి 'ఫ్రీడమ్ దిల్ కీ బాత్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ మార్కెటింగ్ హెడ్ చేతన్ పింపల్‌ఖుటే తోకలసి మాట్లాడుతూ రోజువారీ వంటల్లో చిన్న మార్పులు చేయడం ద్వారా గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఈ ప్రచారం సూచిస్తోందని అన్నారు. ప్రచారంలో భాగంగా తల్లిదండ్రుల గుండె ఆరోగ్యంపై కుటుంబాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామంతో పాటు ఆలోచనాత్మకమైన వంట పద్ధతులను పాటించాలని సూచించారు. ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో 10,000కు పైగా పీపీఎం సహజ ఒరైజనాల్ ఉంటుందని తెలిపారు. కొలెస్ట్రాల్ వంటి సమస్యలపై కుటుంబాల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రోజువారీ చిన్న చిన్న నిర్ణయాలు గుండె ఆరోగ్యానికి తోడ్పడే జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు. వంట నూనెను మార్చడం ద్వారా మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుందని ప్రచారంలో పేర్కొంటున్నట్లు తెలిపారు. రాహుల్ ద్రవిడ్‌తో భాగస్వామ్యం ద్వారా ఈ సందేశాన్ని కుటుంబాలకు సులభంగా చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. టీవీ, డిజిటల్, సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

## అంగన్వాడీల బలోపేతానికి కేంద్రం కట్టుబడి ఉంది

### అంగన్వాడీల అభివృద్ధికి భారీ నిధులు : బుద్ధి శ్రీనివాస్



**కీసర, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నాగారం డివిజన్‌లో గురువారం నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాగారం, రాంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలను సన్మానించారు.

ఈ సందర్భంగా బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ సక్షం అంగన్‌వాడీ, పోషణ్--2.0, అదనపు పోషకాహారం, టీకాలు, ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. అంగన్‌వాడీల ఆధునీకరణలో భాగంగా డిజిటల్ సౌకర్యాలు, వాటర్ ఫిల్టర్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. పోషణ్ ట్రాకర్ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తోందన్నారు. సుకన్య సమృద్ధి యోజనతో బాలికల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలామృతం తదితర పోషకాహార పథకాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుధవరం లక్ష్మి, గోనె శ్రీనివాస్, గురజాల సంతోషి, విజయసింగ్, మంచాల మహేందర్, బిజ్జా శ్రీనివాస్‌గౌడ్, మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, వల్లాల శ్రీనివాస్‌గౌడ్, పొడవోళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో 20 వేల ఓట్లు తొలగించారు

### మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపణ



**ఖైరతాబాద్, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ఓటర్ల జాబితా అంశం రాజకీయంగా వేడెక్కుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగాని యోజకవర్గంలో సుమారు 20 వేల ఓట్లు తొలగించారని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. అర్హులైన ఓటర్ల పేర్లను పునః పరిశీలించి ఓటు హక్కును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు దానం నాగేం దర్ తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారికి తిరిగి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పరిస్థితి తీవ్రంగా మారే అవకాశం ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఓట్ల తొలగింపు విషయంలో కొందరు అధికారులు రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నా రని, కొందరు ఏఎంసీలు, ఏఆర్ఓలు బీజేపీతో కుమ్మక్కై ఓట్లను తొలగించారని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, బీజేపీ వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

**ఉప ఎన్నికతో పెరుగుతున్న రాజకీయ వేడి...**

దానం నాగేందర్‌పై అనర్హత వేటు నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అని వార్యమైంది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించాల్సి ఉండగా, ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వం అంశం ఆసక్తికరంగా మారింది. దానం నాగేందర్ మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి వస్తారా? లేక పార్టీ కొత్త అభ్యర్థిని ఎంపిక చేస్తుందా? అనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి ఉప ఎన్ని కకు సంబంధించిన అంశంపై హైకోర్టును ఆశ్రయిం చడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ఎస్, బీజేపీ కూడా ఖైరతాబాద్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో నియో జకవర్గంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందు కున్నాయి. ఉప ఎన్నికకు ముందు ఓటర్ల జాబితాపై వచ్చిన ఆరోపణలు, విజయారెడ్డి న్యాయ పోరాటం, పార్టీల అభ్యర్థుల ఎంపిక ప్రస్తుతం ఖైరతాబాద్ రాజకీయాల్లో ప్రధాన అంశాలుగా మారాయి.

## రైతు సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి అక్టోబర్ 01(జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో రైతుకు మద్దతు ధరను ఇచ్చేందుకే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి,తో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వానాకాలం సీజన్ లో వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న దాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని సూచించారు.రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని అమ్మాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు కీలక నిర్ణయం తీసుకుందని,మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు. దీంతో రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ కలిపి మంచి ధర లభిస్తుందని అన్నారు.ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్న రకం ధాన్యాన్ని ఈ కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామని,రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి,తాలు,తప్పా లేకుండా శుభ్రం చేసి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యాట గీతా నరసింహా,సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి,స్థానిక సర్పంచ్ శేఖర్ యాదవ్,తలకొండపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు,లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య గుప్తా,సింగల్ విండో డైరెక్టర్లు,మాజీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శి రఘురాములు,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,నాయకులు యాదయ్య,రేణురెడ్డి,జుట్టు తిరుపతి, రాజేందర్ నాయక్, పోతుగంటి గణేష్, మల్లేష్, సురేష్, అధికారులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

- మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటిస్తున్న ప్రభుత్వ ప్రతినిధి బృందం



హైదరాబాద్ / జపాన్ (జనంసాక్షి) : జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన ఈ బృందంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ, ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడలను వీక్షించి, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించింది. ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, పోటీల నిర్వహణ విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేయడంలో ఈ పర్యటన దోహదపడనుంది.

# చెట్టుకింద వృద్ధురాలి జీవనం



బండమీదిపల్లిలో 63 ఏళ్ల కురువ అనంతమ్మ చెట్టు కింద ఆరుబయట జీవనం సాగిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) స్పందించారు. స్వయంగా గ్రామానికి వెళ్లి వృద్ధురాలిని కలిసి ఆమె ఆరోగ్య, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్న అనంతమ్మకు వైద్యం, సంరక్షణ, సురక్షిత ఆశ్రయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## స్పందించిన అదనపు కలెక్టర్

- అనంతమ్మను ఆదుకోవాలని ఆదేశం
- కుటుంబ సభ్యుల నుంచి నోటరీ హామీ పత్రం తీసుకోవాలి
- కలెక్టర్‌కు నివేదిక

*మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 01(జనం సాక్షి) :*

### కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలి

అనంతమ్మను కుటుంబ సభ్యులు బాధ్యతగా చూసుకోవాలని, ఈ మేరకు వారి నుంచి నోటరీ హామీ పత్రం తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం, వైద్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఆమె భూమి, ఆస్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ట్రస్ట్ ద్వారా కేర్‌టేకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్, రేషన్, ఆరోగ్య సేవలు అందుతున్నాయా లేదా పరిశీలించి అర్హత ఉన్న పథకాలు అందించాలని, కుటుంబ పరిస్థితి, ఆస్తుల వివరాలతో కలెక్టర్‌కు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోషల్ మీడియా వార్తపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల చేయూత

- విద్యకు చేసే సాయం తరతరాలకు ఉపయోగం
- డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, అక్టోబరు 1 (జనంసాక్షి) : యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిజిపి సి.వి. అన్నారు. విద్య కోసం అందించే సహాయం సమాజంపై శాశ్వత ప్రభావం చూపుతుందని, దాని ప్రయోజనాలు భవిష్యత్ తరాలకు కూడా అందుతాయని పేర్కొన్నారు. మంచిరేవులలోని వైఐపీఎస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రెట్ (ఎంవైకే ఫౌండేషన్) రూ.2 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) లో భాగంగా ఈ విరాళాన్ని అందించింది. ఎంవైకే లాటిక్రెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం డిజిపి కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లక్ష్యమన్నారు. విద్యా సంస్థల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, దాతలు, ఇతర భాగస్వాములు అందిస్తున్న సహకారం ప్రాజెక్టుకు మరింత బలాన్నిస్తుందని చెప్పారు. విద్యారంగానికి ఇచ్చే విరాళం, చేయూత ఎప్పటికీ విలువైనదేనని, సమాజ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని డిజిపి పేర్కొన్నారు.

# దేశం తెలియాలంటే హిందీ తెలియాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్
- 'మిధున్ స్పోకెన్ హిందీ' పుస్తకావిష్కరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : భారతీయ సమాజ మూలాలు సమగ్రంగా తెలుసుకోవాలంటే సంస్కృత, ఆంగ్ల, తెలుగు భాషలతోపాటుగా హిందీ భాషను కూడా నేర్చుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. దేశం సమగ్ర స్వరూపం తెలుసుకోవడానికి, భారతీయ సామాజిక జీవన విశ్వరూపం అవగతం చేసుకోవడానికి హిందీ భాషను నేర్చుకోవాలని చెప్పారు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని తెలంగాణ బుక్‌ట్రస్ట్ కార్యాలయంలో గురువారం మిధున్ కుమార్ రాసిన "మిధున్ స్పోకెన్ హిందీ" పుస్తకాన్ని భారత ప్రభుత్వ హిందీ సలహాదారు సమితీ సభ్యులు శ్రుతికాంత్ భారతి, రామానందతీర్థ గ్రామీణ విద్యాసంస్థ ఛైర్మన్ నారా కిషోర్‌రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీసెస్ డైరెక్టర్ వై. వెంకటేశ్వర్లు, జూలూరు గౌరీశంకర్‌లు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ భారతదేశం విభిన్న భాషల కూడలి అని, దేశానికి బలమైన అనుసంధాన భాషగా హిందీ పనిచేస్తుందన్నారు. హిందీ, తెలుగు, ఆంగ్లం మూడు భాషల మాధ్యమాల ద్వారా ఈ పుస్తకం తయారు చేయబడిందన్నారు. సరళమైన పదాలు, జీవనగమనంలో పదాలను ఉపయోగించినప్పుడే భాషను నేర్చుకోవడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. కార్పోరేట్ సమాజంలో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడానికి హిందీ భాష దోహదం చేస్తుందని గౌరీశంకర్ వివరించారు. భారత ప్రభుత్వ సలహా సమితి సభ్యులు శ్రుతికాంత్ భారతి మాట్లాడుతూ భాషను సరళంగా వ్యవహారిక భాషలో సులభతరం చేయగలిగినప్పుడే అది అందరికీ చేరువ అవుతందన్నారు. హిందీ భాషాభ్యాసాన్ని సరళతరం చేసి ఆసక్తికరంగా మార్చి పుస్తకాన్ని తయారు చేసిన మిధున్ కృషిని రామానందతీర్థ గ్రామీణ విద్యాసంస్థ చైర్మన్ నారా కిషోర్‌రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీసెస్ డైరెక్టర్ వై. వెంకటేశ్వర్లు అభినందించారు. కేంద్రప్రభుత్వంలో ఉద్యగం పొంది ఇతర రాష్ట్రాలలో పనిచేస్తున్నప్పుడు భాష సమస్యను ఎదుర్కోవడం జరిగిందని, ఆ నేపథ్యంలోనే హిందీ భాషను సాధనచేసి నేర్చుకున్నానని పుస్తక రచయిత మిధున్ కుమార్ తెలిపారు. హిందీ భాష రాకపోవడంతో భయంతో చాలామంది కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఉత్తరభారతంతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి హిందీ భాష వారధిలా పనిచేస్తుందని చెప్పారు. పుస్తక రచయిత మిధున్‌ను ఈ సందర్భంగా పలువురు సన్మానించారు.

# హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో జోన్లు, డివిజన్లు, పోలీస్స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చోటు చేసుకుంది. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో మొత్తం 76 ప్రాంతాలపై మార్పులు జరిగాయి. కొన్ని పోలీస్స్టేషన్ల పరిధులు ఇతర జోన్లు, డివిజన్లకు బదిలీ చేసారు. మార్కెట్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలు మల్కాజిగిరి కమిషనరేట్కు బదిలీ అయ్యాయి. మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు జరిగాయి. ఆర్జీఐఏ పీఎస్ పేరును శంషాబాద్ పీఎస్గా మార్పు చేసారు. శంషాబాద్ డివిజన్లో ఆర్జీఐఏ పీఎస్, శంషాబాద్ పీఎస్ల పునర్వ్యవస్థీకరణ జరిగింది. రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. అబ్దుల్లాపూర్మెట్, మీర్పేట్ ప్రాంతాల పోలీస్ పరిధుల్లో మార్పులు జరిగాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్నగర్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది. ట్రాఫిక్ పోలీస్ పరిధిలోనూ జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేసారు. వుమెన్ సేఫ్టీ వింగ్ పరిధిలోనూ కొత్తగా జోన్ల కేటాయింపు జరిగింది. జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా సర్కార్ పునర్వ్యవస్థీకరించింది. ఉ.గా.ఓబ.జెనీ.84 ద్వారా పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

# పెద్ది కుటుంబ సభ్యులకు శ్రద్ధాంజలి జ్ఞాపక పత్రం అందజేత



నల్లబెల్లి, అక్టోబరు 01 (జనంసాక్షి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర శాసనసభలో శ్రద్ధాంజలి ఘటించి, ఆయన ప్రజాసేవలను గుర్తిస్తూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అధికారికంగా జ్ఞాపక పత్రాన్ని అందజేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నల్లబెల్లి మండల తహసీల్దార్ ముప్పు కృష్ణ, పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ద స్వప్నకు శ్రద్ధాంజలి జ్ఞాపక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు.



# అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట వామపక్షాల భారీ ధర్నా

హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 1 (జనం సాక్షి) : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పై సీఈసీ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. దొడ్డి దారిన సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు వామపక్షాలు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శిలు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం,కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, సిపిఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఎం. చుక్కయ్య, బొట్లచక్రపాణి,టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరువు మండలాల గుర్తింపునకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని మండలం యూనిట్‌గా కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం వర్షపాతం లోటు మాత్రమే కాకుండా ఎస్పీఐ, నేల తేమ, భూగర్భ జలాలు, పశుగ్రాసం వంటి బహుళ సూచికలను పరిగణలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని నిర్ధారించాలని సూచించారు. రబీ మార్కెటింగ్ సీజన్‌కు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. ప్రతి రైతుకూ అందాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. ప్రస్తుతం నాఫెడ్ ద్వారా కేవలం 25 శాతం పంట మాత్రమే సేకరిస్తున్నారని, ఎల్‌నినో వాతావరణ మార్పుల నేపథ్యంలో కేంద్రం మద్దతు ధర ప్రకటించిన ప్రతి పంటనూ 100 శాతం కొనుగోలు చేసేలా చిత్తశుద్ధి చూపాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ ఎండీ రాహుల్ రాజ్, హార్టికల్చర్ ఎండీ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

- ఎమ్మెల్సీ ఎల్ రమణ

హైదరాబాద్ (జనంసాక్షి) : నేతన్నల ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలే అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభతో ఏదో జరగబోతున్నట్లు ప్రచారం చేశారని.. పది రోజుల నుంచి ప్రజలను కాంగ్రెస్ నేతలు మభ్యపెట్టారని అన్నారు. పాత పద్ధతిలోనే మాట్లాడారు తప్ప ప్రజలకు ఏమీ ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 54 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. చేనేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు కేటీఆర్ మంత్రిగా ఉండి అనేక చర్యలు తీసుకున్నారని.. నేతన్న బీమా బీఆర్ఎస్ హయాంలోనే వచ్చిందన్నారు. నేతన్నలకు కాంగ్రెస్ ఇచ్చిన రూ.1,753 కోట్లతో ఎవరికి లబ్ధి జరిగిందో ప్రభుత్వం బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం స్థాయి వ్యక్తి ప్రభుత్వ పాలసీలు పక్కన పెట్టి బహిరంగ సభల్లో వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని.. సిరిసిల్లలో ప్రభుత్వ సభ కాస్త కాంగ్రెస్ పార్టీ సభ లాగా జరిగిందన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు రిప్రజెంటేషన్స్ ఇస్తే సీఎం వాటిని చదవలేదని పేర్కొన్నారు. నేతన్నలకు పని కల్పిస్తే పనిచేయడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారని.. పని కల్పిస్తే నేతన్నలను పనిచేయించే బాధ్యత తనదని సవాల్ విసిరారు.

# బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో ముందంజ

- బొగ్గు రవాణాలో 4 శాతం, ఓవర్ బర్డెన్ తొలగింపులో సింగరేణి 11 శాతం వృద్ధి
- తెలంగాణ జెన్ కో కు అధికంగా బొగ్గు సరఫరా



హైదరాబాద్ (జనంసాక్షి) : సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ముగిసిన తొలి ఆర్థిక అర్ధ సంవత్సరంలో సింగరేణి సంస్థ బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి సింగరేణి సంస్థ 287.6 లక్షల టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేయగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ సంవత్సరంలో గతానికన్నా 4 శాతం వృద్ధితో 299.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది. అంతే కాకుండా గత ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 159.1 లక్షల టన్నుల రవాణా చేసిన సింగరేణి ఈ సారి రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు రాష్ట్ర అవసరాలకు పెద్దపీట వేస్తూ 198.2 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం గమనార్హం. ఇది గత ఏడాది సరఫరా చేసిన బొగ్గు పరిమాణం కన్నా 24.58 శాతం ఎక్కువ. దీనిని బట్టి సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ అవసరాలపై అధిక ప్రాధాన్యత ఇస్తుందని అర్థం అవుతుంది.



థర్మల్ విద్యుత్ కేంద్రాల వారీగా చూసినట్లయితే కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి గత ఏడాది తొలి ఆర్థిక సంవత్సరంలో 26.4 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయగా, ఈ ఏడాది తొలి ఆర్థిక సంవత్సరంలో 39.8 లక్షల టన్నుల బొగ్గును 50.76 శాతం వృద్ధితో రవాణా చేయడం గమనార్హం. అలాగే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి గత ఏడాది ఇదే కాలానికి 21.5 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయగా ఈ ఏడాది 33.9 లక్షల టన్నుల రవాణాను 57.67 వృద్ధితో రవాణా చేసింది. మణుగూరు లోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు గత ఏడాది 19.5 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిన సింగరేణి ఈ ఏడాది 24.4 లక్షల టన్నుల బొగ్గును 25.13% వృద్ధితో రవాణా చేయడం జరిగింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 27.27 శాతం వృద్ధితో 26.6 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి రవాణా చేసింది. అలాగే ఎన్.టి.పి.సి విషయానికొస్తే ఎన్.టి.పి.సి తెలంగాణ ప్లాంట్ కు గత ఏడాది ఇదే సమయానికి 19.4 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా ఈ ఏడాది 25.3 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయటం జరిగింది ఇంకా ఎన్.టి.పి.సి రామగుండం ప్లాంట్ కు పోయిన ఏడాది సెప్టెంబర్ చివరికల్లా 43.5 లక్షల టన్నులు సరఫరా చేయగా ఈ ఏడాది 42.7 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసింది.

### రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రత్యేక చర్యలు

ఎల్ నినో పరిస్థితుల కారణంగా సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ అవసరాలకు పెద్దపీట వేయాలని విద్యుత్ సంస్థలతో సమన్వయం జరుపుతూ, విద్యుత్ ప్లాంట్ లకు కావాల్సిన బొగ్గును శక్తి మేర సరఫరా చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాలతో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిని, రవాణాని పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతినిత్యం సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు, బొగ్గు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సజావుగా రవాణా జరపడం కోసం ఐదుగురు ఉన్నతాధికారులకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను అప్పగించి పర్య వేక్షిస్తున్నారు. సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడమే నైతిక కర్తవ్యంగా భావిస్తూ స్వరాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎక్కువ శాతం బొగ్గును రవాణా చేస్తోంది. ఈ వివరాలను తెలియజేస్తూ సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఏడాదికి నిర్దేశించిన 620 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 650 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించడానికి పూర్తి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నట్లు వివరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370